# క్రాంతి

## లోపలి పేజీల్లో


| | |
|---|---|
| ప్రత్యేక తెలంగాణ సాధించేవరకు ........ | 2 |
| నారాయణపట్నం ప్రజా పోరాటం ....... | 6 |
| సహకార వ్యవసాయం కాదు ....... | 11 |
| కోపెన్‌హెగెన్ సదస్సు ....... | 16 |
| మాల్స్ నుండి స్కూల్స్‌కు ....... | 18 |
| వందేళ్ల భూంకాల్ ....... | 21 |
| చలి మరణాలకు బాధ్యులెవరు? ....... | 23 |
| సిద్ధాంత వ్యాసం | మధ్య పేజీలో |
| తమిళ ఈలం పోరాటం... ....... | 28 |
| బాబ్రీపై లిబర్హాన్ కమీషన్ ....... | 33 |
| అమరులకు వినమ్ర నివాళి ....... | 36 |
| పోరాటాలు-సభలు-ప్రతిఘటన ....... | 45 |



**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఓ.బి. కమిటీల అధికార పత్రిక**

**సంపుటి : 34 సంచిక : 1** | **జనవరి-ఫిబ్రవరి 2010** | **వెల : పది రూపాయలు**


## అమరులు కామ్రేడ్స్, శాకమూరి అప్పారావు, రమణలకు వినమ్ర నివాళి

పీడిత ప్రజల గుండెల్లో నిలిచిపోయిన మన ప్రియతమ నాయకులు కామ్రేడ్ శాకమూరి అప్పారావు, కామ్రేడ్ సోలిపేట కొండలరెడ్డి (టెక్ రమణ)లను ఆంధ్రా ఎస్.ఐ.బి., గ్రేహౌండ్స్ బలగాలు పట్టుకొని, చిత్రహింసలలో చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథ అల్లారు. 1982 నుండి వృత్తి విప్లవకారుడిగా జీవించిన కా. శాకమూరి అప్పారావు వరంగల్ జిల్లా ఖానాపూర్‌లో 1962లో జన్మించాడు. మూడు దశాబ్దాల విప్లవోద్యమ చరిత్ర గల కా. శాకమూరి అప్పారావు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ సెక్రెటేరియట్ సభ్యుడిగా 2006 వరకు పని చేశాడు. దక్షిణ తెలంగాణ ఉద్యమంతోపాటు ఆంధ్ర రాష్ట్ర వుద్యమంలో ఎన్నో పోరాటాలనూ, ప్రతిఘటనలను నిర్వహించి పాలకవర్గాల గుండెల్లో రైళ్లు పరుగెత్తించాడు. కా. రవి ఎనిమిది (1993-2000)సంవత్సరాల జైలు నిర్బంధాన్ని అనుభవించాడు. ఆ కాలంలోనే 1994లో జైలు పోరాటాన్ని నడిపాడు. ప్రస్తుతం కేంద్ర కమిటీ ఆధ్వర్యంలోని ఇంటలిజెన్సీ విభాగంలో కీలక భూమికను నిర్వహిస్తున్నాడు. అనారోగ్య సమస్యలు ఎన్ని వున్నా అలుపెరగని అవిశ్రాంత పోరాటకారుడు. పార్టీ శ్రేణుల్లో ప్రేమ పాత్రుడు. మార్చి 12న కామ్రేడ్ శాకమూరి అప్పారావు ప్రకాశం జిల్లా పుల్లల చెరువు అడవుల్లో పోలీసు కాల్పుల్లో చనిపోయినట్లు పోలీసులు ప్రకటించారు.



కామ్రేడ్ శాకమూరి అప్పారావు



కామ్రేడ్ సోలిపేట కొండలరెడ్డి

కామ్రేడ్ టెక్ రమణ అసలు పేరు సోలిపేట కొండలరెడ్డి. పార్టీలో శ్రీనివాస్‌గా, రమణగా ప్రసిద్ధి. రెండు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమంలో సుదీర్ఘ కాలం కొరియరింగ్, టెక్ మెకానిజాల్లో పని చేసి, ఆదర్శాన్ని నెలకొల్పాడు. కా. శాకమూరి అప్పారావుతో కొరియర్‌గా వుంటూ అనేక సంవత్సరాలపాటు పని చేయడం మాత్రమేకాకుండా జైలు నిర్బంధాన్ని కూడా అనుభవించాడు. తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ మెకానిజంలో చాలా కాలం ముఖ్యమైన బాధ్యతలు నిర్వహించాడు. మెదక్ జిల్లా దుబ్బాక మండలం చిట్టాపూర్ గ్రామంలో 44 సంవత్సరాల క్రితం జన్మించిన కా. రమణ వరంగల్ జిల్లా తాడ్వాయి అడవుల్లో పోలీసు కాల్పుల్లో చనిపోయినట్లు పోలీసులు ప్రకటించారు.

(వీరిరువురి బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఖండిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాయుద్ధ నేతల చరిత్రలను తదుపరి సంచికలో ప్రచురిస్తాం.)

# ప్రత్యేక తెలంగాణ సాధించేవరకు తెలంగాణా ప్రజలు అవిశ్రాంతంగా పోరు చేయాల్సిందే!

యాభై నాలుగు సంవత్సరాలుగా స్వార్థపర ఆంధ్రా దోపిడీ వర్గాలను ప్రతిఘటిస్తూ, తెలంగాణ అవకాశవాద శక్తులను ఒంటరిచేస్తూ నిరంతరాయంగా పోరాడుతున్నారు తెలంగాణ ప్రజలు. కేంద్ర ప్రభుత్వం సాచివేత విధానాలతో ఆంధ్రా దోపిడీవర్గాలకు తోడ్పడుతోంది. 2009 నవంబరు నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర విషయమై జరుగుతున్న పరిణామాలు చాలా వేగంగా నడుస్తున్నాయి. అయిదు దశాబ్దాల ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధన సమస్య ఇది. 1956 పెద్ద మనుషుల ఒప్పందం వుల్లంఘించడంతో 1969లో విద్యార్థి ఆందోళన పెద్ద ఎత్తున ప్రజ్వరిల్లింది. ఆ తరువాత జరిగిన పరిణామాలు, చేసుకున్న ఒప్పందాలు రాసుకున్న జి.ఒ.లు అన్నీ బుట్టదాఖలు కావడంతో మరలా 1997లో ఇదే సమస్య మీద ఉద్యమం తిరిగి ప్రారంభమై ఇంకా కొనసాగుతూనే వుంది. గతంలో తెలంగాణా ఉద్యమాన్ని వినియోగించుకుని ఎన్నికల్లో గెలిచి 1971లో తెలంగాణా ప్రజాసమితిని (టి.పి.ఎస్.) కాంగ్రెస్‌లో కలిపి ఉద్యమానికి ద్రోహం చేసిన చెన్నారెడ్డి అనుభవం తర్వాత కూడా అదే పేరు చెప్పుకుని చాలా మంది రాజకీయాలు నడిపారు. ఆఖరికి టి.డి.పి. నుండి విడిపోయిన కె.సి.ఆర్. 2001లో ఏర్పాటుచేసిన టి.ఆర్.ఎస్. కూడా ఎనిమిది సంవత్సరాలపాటు ఎన్నికలు, ఏకాభిప్రాయసాధన, పార్లమెంటు అసెంబ్లీల ఆమోదం పేరుతో, లాబీయింగ్ రాజకీయాలు నడిపి అవి మౌలికంగా సమస్యను పరిష్కరించలేవని మరోసారి కూడా తేలిపోయాక ఇప్పుడు చిట్టచివరకు ప్రజల ఒత్తిడిమేరకు వుద్యమబాట చేపట్టాడు. తెలంగాణా అంతటా విద్యార్థి, యువజనులు, మేధావి, ఉద్యోగులు, రైతాంగం, కార్మికులు సమస్త ప్రజానీకం మిలిటెంట్ పోరాటాల ద్వారా మద్దతునీయడంతో కేంద్ర ప్రభుత్వం డిసెంబర్ 9న ఒక ప్రకటన చేయాల్సి వచ్చింది.

సంక్షిప్తంగా చరిత్రను తడిమితే... 1956 నవంబర్ 1న ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలను కలిపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఏర్పరిచారు. అనంతరం అన్ని ఒప్పందాలకు షరతులకు తిలోదకాలిచ్చారు. తెలంగాణాను ఆంధ్రలో విలీనం చేసినప్పుడు తెలంగాణకు కల్పించిన అనేక రక్షణలలో 'ముల్కీ నిబంధనల అమలు' ఒకటి. 1956–68ల మధ్య 12 సంవత్సరాలలో అనేకసార్లు 'ముల్కీ' నిబంధనలు వుల్లంఘించి, సడలించి, వక్రీకరించి తెలంగాణకు దక్కవలసిన వుద్యోగాలు స్థానికేతరులకు ఇచ్చారు. ఈ అక్రమాలకు వ్యతిరేకంగా వచ్చినదే 1969 నాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమం, నాటి ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో విద్యార్థి యువజనులు చురుకైన పాత్ర వహించారు. 1969 ఉద్యమం మీద ఫ్రెంచి విద్యార్థి ఉద్యమం, నక్సల్‌బరీ, శ్రీకాకుళ పోరాటాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావాన్ని వేశాయి. శ్రీకాకుళ పోరాటంలో అమరులయిన సంఖ్యతో సమానంగా ప్రత్యేక తెలంగాణా ఉద్యమంలో 350 మంది, ప్రధానంగా విద్యార్థులు అమరులయ్యారు.

1969 ఏప్రిల్ 11న ప్రధాని ఇందిరా గాంధీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన అష్ట సూత్రాలను ప్రజలు విశ్వసించలేదు. 1971లో అయిదు సూత్రాల పథకాన్ని ప్రవేశపెట్టింది. అప్పటి ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి స్థానంలోకి పి.వి. నర్సింహారావును మార్చి, చెన్నారెడ్డిని కొనేసి ఆందోళనను దెబ్బతీసింది. తర్వాత ముల్కీ నిబంధనల అమలు జి.ఒ.నెం:36 వచ్చింది. 1972 అక్టోబర్ 3న సుప్రీంకోర్టు 'ముల్కీ నిబంధనలు రాజ్యాంగబద్ధమని' ప్రకటించింది. దానికి నిరసనగా ఆనాడు ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాన్ని తెచ్చారు. తర్వాత 1985 డిసెంబరు 30న 610 జి.ఒ. వచ్చింది. 1956–65, 1975–85 మధ్య కాలాల్లో ఏ అక్రమాలను అరికట్టడానికి 610 జి.ఒ. వచ్చిందో అవే అక్రమాలు 1985–2001 వరకు కొనసాగాయి. రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన స్థానిక రిజర్వేషన్లను ఉల్లంఘించడం, హైదరాబాద్ ఫ్రీజోన్ వివాదం తేవటం రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమేనని గిర్‌గ్లానీ కమీషన్ కూడా స్పష్టం చేసింది.

1946–52 వరకు నడిచిన వీరతెలంగాణా పోరాట వారసత్వం, 1980ల నుండి ఉత్తర తెలంగాణకు విస్తరించిన నక్సల్‌బరి రాజకీయాలు, 1996–97 నుండి విప్లవోద్యమం ప్రజాస్వామిక తెలంగాణ కోసం చేసిన పోరాటాలు, త్యాగాలు ఉద్యమాన్ని పదునెక్కించాయి. పదునెక్కిన ఉద్యమానికి భయపడే డిసెంబరు 9న లోక్‌సభలో, రాజ్యసభలో హోంమంత్రి చిదంబరం ప్రత్యేక తెలంగాణ ఏర్పాటు ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్నట్లు ప్రకటించాడు. దానితో కె.సి.ఆర్. ఆమరణ నిరాహారదీక్షను విరమించాడు.

**తెలంగాణ వెనుకబాటుతనానికి కారణాలను విశ్లేషిస్తే చాలా అంశాలు చర్చనీయమవుతాయి.** అవసరమయినంత వర్షపాతం

వుండి ఉత్తర, దక్షిణ తెలంగాణాల్లో ప్రవహిస్తున్న గోదావరి, కృష్ణ నదుల నీరు తెలంగాణాకు కాకుండా, ఆంధ్ర ప్రాంతానికే పోవడంతో తాగునీటి, సాగునీటి సమస్యలు అలాగే వున్నాయి. కృష్ణా, గోదావరి నదులపైన ఆంధ్రలో ఆనకట్టలు కట్టి భూమిసాగు చేయడమే కాకుండా అనేకచోట్ల విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తూ తెలంగాణను విద్యుత్‌లేని చీకటి రాష్ట్రంగానే వుంచారు. కొత్తగూడెం నుండి బెల్లంపల్లిదాకా బొగ్గు బావులు తవ్వి బొగ్గును తరలించుకుపోతూ న్యాయమైన రాయల్టీ కూడా ఇవ్వకుండా సంపదను కొల్లగొట్టారు. భూములు, వనరులు, అటవీ సంపద, మానవశక్తినీ దోచుకోవడంతో తెలంగాణా ప్రజలు దారిద్ర్యంతోనూ, ఆకలితోనూ మగ్గుతూ తెలంగాణ ప్రాంతం మొత్తం వెనుకబాటుతనంలో మునిగి తేలుతున్నది. సి.పి.ఎం. వారి విశాలాంధ్ర నినాదం పిడివాదమే, ఆంధ్ర దోపిడీవర్గాల ప్రయోజనాలకే తోడ్పడుతుంది. వారి సమైక్యాంధ్ర, సమగ్రాభివృద్ధి మాటలకే పరిమితమై చేతల్లో 54 సంవత్సరాలుగా వివక్ష, నిర్లక్ష్యం రాజ్యమేలింది. అందుకే విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాల కోసం, తెలంగాణ ప్రజల హక్కుల సాధనకోసం ప్రజలంతా ఐక్యమై కొట్లాడాల్సిన పరిస్థితి వచ్చింది. ఉద్యమం ఉధృతంగా సాగుతున్నప్పుడు ఆంధ్ర రాష్ట్రానికి చెందిన సంపన్న వర్గాలు ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర సాధన సాధ్యం కాకుండా చేయడానికి అనేక కుయుక్తులు పన్నారు. 1956 నుండి 1983 వరకు మరలా 2004 నుండి నేటి వరకు అధికారంలో వున్న కాంగ్రెస్ నాయకులు (వై.ఎస్.ఆర్.తో సహా) ఆంధ్రా అనుకూల వైఖరినే అనుసరించారు. తర్వాత వచ్చిన తెలుగుదేశం కూడా ఎన్.టి.ఆర్. హయాంలోనూ, చంద్రబాబు హయాంలోను సమైక్యాంధ్ర ఎజెండాతోనే పరిపాలించారు.

కొత్తగా వచ్చిన పి.ఆర్.పి. పార్టీ ఎన్నికల సమయంలో ఏం మాట్లాడినా చివరికి సమైక్యాంధ్రకే కట్టుబడింది. మధ్యలో పుట్టిన దేవేంద్రగౌడ్ నవతెలంగాణా, విజయశాంతి తల్లితెలంగాణ పార్టీలు రాజకీయాల్లో అస్తిత్వాన్ని కోల్పోయాయి. సి.పి.ఎం.ది పిడివాద వైఖరి. అది ఎప్పుడూ తెలంగాణ సమస్యను అర్థం చేసుకోలేదు. ఎవరు ఎన్ని రకాలుగా మారినా, ఎన్నికల సందర్భంగా మాయమాటలాడినా గత 54 సంవత్సరాలుగా తెలంగాణా ప్రజలు మాత్రం ఒకేమాటపై నిలిచి పోరాడుతున్నారు. వాళ్ల బలమైన ఆకాంక్ష, పోరాట పటిమ, ఉద్యమంలో చూపిస్తున్న మిలిటెన్సీ కారణంగానే ఈనాడు ఉద్యమం ఒక మలుపు తిరగడం, పార్టీలకతీతంగా ప్రాంతీయ ఐక్యత సాధ్యమయింది. ఉద్యమ స్ఫూర్తిని నిలపడంలో ఆయా సందర్భాలలో విద్యార్థులు, మేధావులు, కళాకారులు ప్రధానంగా తెలంగాణా సామాన్య ప్రజానీకం చూపిన చైతన్యం మార్గదర్శిగా నిలిచింది. రాజకీయ పార్టీల నాయకులకు ఎవరికున్న ప్రయోజనాలు వారికున్నా ఎవరు ఎలా దగాచేసినా తిరిగి తిరిగి ఉద్యమ బాటను నడిచేలా ప్రజల ఆకాంక్ష ఒత్తిడి తెచ్చింది. తెలంగాణా జె.ఎ.సి.లోకి వచ్చి చేరిన కాంగ్రెస్ పార్టీ అవకాశవాద ఎత్తుగడలనే అనుసరించింది. జె.ఎ.సి. నుండి బయటకు వెళ్లడంలో ఉద్యమాన్ని నీరు గార్చే దాని ఎత్తుగడలు మరింత స్పష్టమయ్యాయి.

సమైక్యాంధ్ర పేరుతో నేడు నడుస్తున్న ఉద్యమానికి ప్రజల సంపూర్ణ మద్దతులేదు. ఇది పట్టణాలకు, బూర్జువా పార్టీల నాయకులకు, వారి విద్యార్థి సంఘాలకు పరిమితమై నడుస్తున్నది. విజయవాడలో లగడపాటి, కడపలో జగన్‌ల ప్రయోజనాలకు అనుగుణంగా, వారి నాయకత్వాలను బలపర్చుకోవడానికి, వాస్తవాలను వక్రీకరించి అబద్ధాలను ప్రచారంచేస్తూ ప్రజలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమాన్ని నిర్మిస్తున్నారు.

1956లో విలీనం నాటి నుండి అన్ని విషయాల్లోనూ వివక్ష, నిర్లక్ష్యం కొనసాగింది. దీనిని వ్యతిరేకిస్తూ జరిగిన అన్ని ఆందోళనలు నిర్దిష్టమైనవే. ఎన్ని ఒప్పందాలు జరిగినా, ఎన్ని చట్టాలు, జి.ఒ.లు వచ్చినా, ఎన్నో కమీషన్‌లు తెలంగాణ సమస్యకు సరైన పరిష్కారాలు చూపినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని అమలుచేయలేదు సరికదా ఆంధ్ర పాలకులకు అనుకూలంగానే వ్యవహరించాయి. పోటీ వుద్యమాలను కూడా ఆయా పార్టీల నాయకులు ఒక పథకం ప్రకారం నడిపారు.

బలవంతంగా కలిసివుంటే సమైక్యత ఎలా అవుతుంది? ఏ ప్రాంతానికి చెందిన ప్రజలు కూడా బలవంతంగా కలిసివుండాలని కోరుకోరు. స్వేచ్ఛగా, స్వతంత్రంగా, ప్రజాస్వామికంగా, పరస్పర అంగీకారంతో కలసినపుడు వారి మధ్య ఐక్యత సాధ్యమవుతుంది. సమైక్యాంధ్ర ఉద్యమం పీడిత ప్రజల ఆకాంక్షలకు భిన్నమైనది. వారిని తక్షణ సమస్యల నుండి పక్కకు నడిపించడానికే ఈ రకమైన వుద్యమాలు నడుపుతున్నారు. నేడు ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ అన్ని ప్రాంతాల పీడిత ప్రజలకు నష్టం కలిగించే కోస్తా కారిడార్, సెజ్‌లు, అణువిద్యుత్ కేంద్రాలు, భారీ ప్రాజెక్టులు, ఓడ రేవులు, ఓబులాపురం గనులు, ఓపెన్‌కాస్ట్ గనులు వీటితోపాటు ముడిపడివున్న నిర్వాసిత సమస్యలు ఆకలి, దారిద్ర్యం, ఆత్మహత్యలు, అనారోగ్య మరణాలు, విద్యుత్, గిట్టుబాటు ధరలు, అవినీతి ఇలా ఎన్నో తక్షణ సమస్యల నుండి పక్కదారి పట్టించడానికీ, న్యాయమైన ప్రత్యేక తెలంగాణా ఉద్యమాన్ని సుదీర్ఘకాలం కొనసాగించి మరింత జటిలం చేయడానికి స్వార్థపరశక్తులు ప్రయత్నిస్తున్నాయి. దీనిని గుర్తించి ప్రజలు సరైన విధానాన్ని అనుసరించాలి. ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి మద్దతును తెలియజేయాలి. అన్నదమ్ములలాగ విడిపోయి సమైక్యంగా అభివృద్ధికి కృషి చేయాల్సి వుంటుంది.

కోస్తా, రాయలసీమ పెట్టుబడులు తెలంగాణ వనరులను, ప్రజల

శాంతియుతంగా పోరాడుతున్న తెలంగాణా ఉద్యమకారులపై ప్రభుత్వం పాశవిక నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నది. ఈ నిర్బంధం తీరు ఎంత క్రూరంగా ఉందో అర్థం చేసుకోవడానికి మచ్చుకు ఫిబ్రవరి 14, 15 తేదీలలో ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల, జర్నలిస్టులపై పోలీసులు ఉన్మాదుల్లా విరుచుకుపడిన వైనం చూస్తే అర్థమవుతుంది.

శ్రీకృష్ణ కమిటీ విధి-విధానాలకు వ్యతిరేకంగా రాజీనామా చేసిన ఎం.ఎల్.ఎ.లను అభినందిస్తూ, మిగతా వారిని కూడా రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 14న సాయంత్రం ఉస్మానియా విద్యార్థులు ఒక ప్రదర్శనను తలపెట్టారు. శాంతియుతంగా జరుగుతున్న ఈ ప్రదర్శనపై పోలీసులు విరుచుకుపడి విచక్షణారహితంగా లాఠీఛార్జీ చేసారు. బాష్ప వాయు గోళీలు ప్రయోగించారు. రబ్బరు తూటాలతో కాల్పులు జరిపారు. అర్ధరాత్రి వరకు సాగిన ఈ దమనకాండలో మహిళా విద్యార్థులపై కూడా పథకం ప్రకారం విచక్షణారహితంగా హింసను ప్రయోగించారు. మహిళా విద్యార్థులు మిలిటెంట్‌గా పాల్గొంటున్నందుకు ఒక్క మహిళా పోలీసు కూడా లేకుండా మహిళల హాస్టళ్ల మీద దాడి చేసి వారినే టార్గెట్‌చేసి విచక్షణా రహితంగా కొట్టారు. ఈ హింసాకాండలో అనేక మంది విద్యార్థులు గాయపడ్డారు. మహిళా విద్యార్థులతో సహా అనేక మంది విద్యార్థులకు కాళ్లూ, చేతులు విరిగాయి. తలలు పగిలాయి.

పథకం ప్రకారమే ఈ దమనకాండకు కుట్ర పన్నిన ప్రభుత్వం, పోలీసులు మీడియాను అనుమతివ్వలేదు. అంటే తమ పాశవిక దమనకాండను బయటి ప్రపంచానికి తెలియకూడదనుకున్నారు. అందుకే ఆ సమయంలో కరెంటు కూడా కట్ చేసారు. బయట వారిని ఎవరినీ లోనికి రానీయలేదు. మొత్తంగా ఉస్మానియా యూనివర్సిటీని ఒక వార్ జోన్‌గా, కాన్సెంట్రేషన్ క్యాంపుగా మార్చివేశారు. తమ వృత్తి ధర్మం ప్రకారం కవర్ చేయడానికి వెళ్లిన జర్నలిస్టులపై కూడా ఇదే స్థాయిలో ఉన్మాదాన్ని ప్రదర్శించారు. వాళ్ల తలలు పగలగొట్టారు. రోడ్డు మీద పడేసి బూటు కాళ్లతో తన్నారు. వాళ్ల వాహనాలనూ, కెమెరాలనూ, తదితర సామాన్లను ధ్వంసం చేశారు. పోలీసుల హింసను ప్రతిఘటించడంలో భాగంగా విద్యార్థులు రాళ్లు విసరగా పోలీసులు అత్యంత క్రూరంగా నర్సింగ్ అనే విలేఖరిని తమకు కవచంగా ఉపయోగించుకున్నారు.

నక్సలైట్లను అణచడం కోసం ప్రత్యేకంగా తయారుచేసిన గ్రేహౌండ్స్ బలగాలు ఈ హింసాకాండను జరిపాయి. తెలంగాణ ఉద్యమకారులపై అందులోనూ విద్యార్థులపై, జర్నలిస్టులపై గ్రేహౌండ్స్‌ను ప్రయోగిస్తుందంటే ప్రభుత్వానికి తెలంగాణా ఉద్యమం పట్ల ఉన్న వైఖరి స్పష్టమవుతుంది.

14న జరిగిన హింసాకాండపై పెద్ద ఎత్తున నిరసన వచ్చినప్పటికీ 15న ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లిన జర్నలిస్టులపై పోలీసులు మళ్లీ విరుచుకుపడ్డారు.

ఫిబ్రవరి 22న ఢిల్లీలో రెండు వేల మంది లాయర్లు శ్రీకృష్ణ కమిటీని రద్దు చేయాలనీ, తెలంగాణా బిల్లు పెట్టాలనీ, జై తెలంగాణ అంటూ ఢిల్లీ వీధుల్లో నినదించి, జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేశారు. పార్లమెంటు ముట్టడికి హై సెక్యూరిటీ జోన్‌లోకి ప్రవేశించారు. లాయర్లపై వాటర్ క్యానన్‌లు ప్రయోగించి, 200 మందిని అరెస్టు చేసిన పోలీసు చర్యను అన్ని సంఘాలూ, పార్టీలు ఖండించగా, తెలంగాణ ప్రాంతమంతటా దీనికి నిరసనగా ఆందోళనలు చేపట్టారు. లాయర్ల సాహసోపేతమైన నిరసనకు ప్రజలందరూ హర్షం ప్రకటించారు.

శ్రమశక్తిని దోపిడీ చేస్తున్నది నిజం. అటువంటి కొద్దిమంది విషయంలో కఠినంగా వుండకతప్పదు. నాలుగున్నర కోట్ల ఆంధ్ర ప్రజలకు, మూడు కోట్ల 10 లక్షల తెలంగాణా ప్రజలకు మధ్య విభేధాలు లేవు. విడిపోవడం వలన జరిగే నష్టమూలేదు. ఇప్పుడు వున్న ఆందోళన, నష్టాలు తగ్గి సుఖ శాంతులు నెలకొంటాయి. అంతకన్నా ప్రజలు కోరుకునేది ఏముంటుంది? సమస్యలు చిన్న చిన్నవి వున్నా సామరస్యంగా వాటిని పరిష్కరించుకోగలం. మద్రాసు నుండి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. అలాగే అనేక రాష్ట్రాల విభజన జరిగింది. సామరస్యంగా సుహృద్భావంతో పరస్పర అంగీకారంతో సహకార ధోరణితోను విడిపోవడం జరిగింది. ఇక్కడా అలాగే జరగాల్సి వుంది. అప్పుడే అందరి సమస్యలతోపాటు ముస్లిం ప్రజల ప్రత్యేక సమస్యలు సరిగా పరిష్కారమవుతాయి. స్థానిక ఆదివాసీ ప్రజల హక్కులు, దళితుల సున్నిత సమస్యలు పరిష్కారమవుతాయి. అందుకు ప్రత్యేక తెలంగాణా పోరాటాన్ని భౌగోళిక తెలంగాణ విడిపోవడంతోనే ఆపివేయడం కాకుండా ప్రజాస్వామిక తెలంగాణ ఏర్పడే వరకు పోరాటాన్ని కొనసాగించవలసి వుంటుంది. రాష్ట్రం స్వయం ఆధారితంగా అభివృద్ధి సాధించాలంటే స్థానిక వనరులపై ఆధారపడాలి. సామ్రాజ్యవాదులను, ఎస్.ఇ.జడ్‌లను అనుమతించకుండా గట్టి నిర్ణయాలు చేయాల్సి వుంటుంది. రాష్ట్రంలో ఫాసిస్టు నిర్బంధాన్ని నిలిపివేసి ప్రజల ప్రజాస్వామిక హక్కులను, పౌరహక్కులకు గ్యారంటీ వుండేలా చర్యలు చేపట్టాలి. ప్రజావ్యతిరేక విధానాలను విడనాడి వివిధ రకాల ప్రభుత్వ భూములను పేద ప్రజలకు పంపిణీ చేయాలి. తెలంగాణలో వలసలను, ఆత్మహత్యలను,

*(మిగతాది 32వ పేజీలో...)*

# ఉవ్వెత్తున ఎగసిన నారాయణపట్నం ప్రజా పోరాటాన్ని ఎలుగెత్తి చాటుదాం!
# నవంబర్ 20న ప్రజలపై జరిపిన కాల్పులను ముక్తకంఠంతో ఖండిద్దాం!!
# అమరులు కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రుల వారసత్వాన్ని కొనసాగిద్దాం!!!

ఒడిషాలోని కాశీపూర్, కళింగనగర్, పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్, సింగూరు, లాల్‌గఢ్ పోరాటాల ఒరవడిలో నారాయణపట్నం ప్రజలు భూమి సమస్య కేంద్రంగా, స్థానిక దోపిడీ వర్గాలకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, విముక్తి లక్ష్యంతో సాంప్రదాయక ఆయుధాలు చేపట్టి వేలాది మంది ప్రజలు వందలసార్లు నిరసన పోరాటాలతో ఉద్యమానికి వాడిని, వేగాన్ని అందించారు. ఇది 21వ శతాబ్దంలో ముందుకొచ్చిన ప్రత్యేక ఆర్థిక మండళ్ల సమస్యకాదు. ప్రత్యేకంగా నిర్వాసిత సమస్యకాదు. కానీ ఇది అస్తిత్వ సమస్యే. బ్రిటీష్ కాలం నుండి భారతదేశంలో జరుగుతున్న ఆందోళనలో భాగంగా ఒడిషా ఆదివాసీ ఆందోళనలూ కనబడుతాయి. 1914లోనే ఒడిషాలోని దసపల్లా ప్రాంతంలో కోందులు (కుయి) బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. అలాగే 1817 నుండి 1942 వరకు ఒడిషాలో జరిగిన ఆరు ఆదివాసీ తిరుగుబాట్లలో 'లక్ష్మణ్ నాయక్' నాయకత్వంలో జరిగిన కోరాపుట్ పోరాటం చరిత్రలో ప్రసిద్ధి చెందినది. భారతదేశానికి 'స్వాతంత్ర్యం' వచ్చిన తరువాత కూడా ఒడిషాలో వెనుకబాటుతనం, కోరాపుట్ కరువు పరిస్థితి, ఆదివాసీలపట్ల నిర్లక్ష్యం యధావిధిగానే కొనసాగుతూ దోపిడీ అణచివేతలు మరింత పెరిగాయి. 1970లలో శ్రీకాకుళ ఉద్యమ ధాటికి భయపడి పారిపోయి వచ్చిన భూస్వామ్య, వ్యాపార వర్గాలు కోరాపుట్ ప్రాంతంలో స్థిరపడి స్థానిక ప్రజలను విపరీతంగా దోచుకోవటం మొదలుపెట్టారు. వీరికి తోడు ఆంధ్రప్రదేశ్, ఒడిషా రాష్ట్రాలకు చెందిన ఆదివాసేతరులు, కోస్తా ప్రాంత వాసులు ఇక్కడకు వచ్చి ఆదివాసీ భూములను చేజిక్కించుకుని వారి భూముల్లో వారినే కూలీలుగా పని చేయిస్తూ రాజకీయ ఆధిపత్యాన్ని, సంపదను పెంచుకుంటున్నారు. ఆదివాసీల భూములు వారికే చెందాలని 2/56 చట్టం ఉన్నా దాన్ని అమలుచేసిన దాఖలాలు అసలే లేవు. అధికంగా దోచుకునేందుకు, తిరగబడకుండా చేసేందుకు సారాను పారించి ఆదివాసీలను మత్తులో ముంచుతున్నారు వారి బతుకులను ఛిద్రం చేస్తున్నారు.

కరువు, దారిద్ర్యం నిత్యం విలయతాండవం చేసే తమ బతుకుల్లో మార్పు కోసం కోల్పోయిన భూమిని తిరిగి పొందటానికి ఆదివాసీ ప్రజలు ఉద్యమిస్తున్నారు. ఇప్పుడిక్కడ అనేక దశాబ్దాలుగా సారా వ్యతిరేక పోరాటం, భూవిముక్తి పోరాటం జమిలిగానే, మిలిటెంట్‌గానే నడుస్తున్నాయి. దానికి 'ఛసి ములియా సంఘం' నాయకత్వం వహిస్తున్నది. ప్రజాస్వామికంగా వందల గ్రామాల ప్రజలను కలుపుకుంటూ కదిలిస్తూ వెల్లువలా ఉద్యమాన్ని విస్తరింప చేస్తున్నది.

## నారాయణపట్నంలో నవంబర్ 20న కాల్పుల ఘటనకు నేపథ్యం

2004 నుండి ఛసి ములియా సంఘం కార్యకలాపాలు ఆంధ్ర–ఒడిషా సరిహద్దు ప్రాంతమైన నారాయణపట్నంలో విస్తరించాయి. ఈ సంఘం ఆధ్వర్యంలో 2009 జనవరిలో నారాయణపట్నం బ్లాక్ సెంటర్లో ప్రభుత్వ, ప్రయివేట్ సారా, బ్రాంది దుకాణాలపై ప్రజలు పెద్ద ఎత్తున దాడులు చేశారు. ప్రతి గ్రామంలో యువకులు, మహిళలతో సారా వ్యతిరేక కమిటీలు ఏర్పడ్డాయి. అక్రమంగా సారా వండుతున్నా, రవాణా చేస్తున్నట్లు తెలిసినా ధ్వంసం చేశారు. అలా నాలుగు నెలల కాలంలోనే బ్లాక్‌లో సారాను బంద్ చేశారు. అలా సారా పోరాటంతో సంఘటితమైన ప్రజలు తమను దోపిడీ చేసి అక్రమంగా భూములు కాజేసిన భూస్వాములపై పోరాటాన్ని ఎక్కుపెట్టారు. భూమిపై  హక్కు కోసం నినదిస్తూ నారాయణపట్నం బ్లాక్ సెంటర్లో 2009 జూన్ 12న ఆరు పంచాయితీలకు చెందిన వంద గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు కదిలి భూస్వాముల భూముల్లో ఎర్రజెండాలు పాతారు. సమిష్టిగా దుక్కులు దున్నారు. జూలై 5 నుండి 10వ తేదీల మధ్య ఆ భూములను పంపకాలు చేసుకున్నారు. సుమారు మూడు వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకున్నారు.

ఈ పోరాటంలో అడ్డుగా నిలిచిన ప్రజా పీడకులనూ, సారా వ్యాపారులనూ,  భూస్వాములను గ్రామాల నుండి వెళ్లగొట్టారు. మరికొద్ది మంది సంఘం నిబంధనలకు లోబడి భూములను అప్పగించారు. అలా సాధించిన విజయాలూ, పొందిన ఫలితాలు ప్రజలకు ఎంతో వుత్తేజాన్నిచ్చాయి. ప్రజల శక్తి ముందు ఏ శక్తీ నిలువలేదనే బలమైన విశ్వాసాన్ని పొందారు. అయితే భూములను కోల్పోయిన భూస్వాములు, సారా కాంట్రాక్టర్లు మళ్లీ తమ అధికారం కోసం కుట్రలు పన్నుతూనే వున్నారు. ప్రజల సంఘటిత శక్తినీ, ప్రజలకు

నాయకత్వం వహిస్తున్న సంఘాన్ని అణచివేయకుండా తమ అధికారాన్ని కాపాడుకోలేమని భావించి అనేక రకాలుగా సంఘంపై నిర్బంధాన్ని తీసుకువచ్చారు. అందులో భాగంగా ఏర్పడినవే 'శాంతి కమిటీలు', 'నాగరిక సురక్షా సమితి'లు. ఈ శాంతి కమిటీ 2009 మే 5న ఆదివాసీ ఛసి ములియా సంఘానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నాలుగు వేల మందితో నారాయణపట్నం శాంతి అభియాన్ పేరుతో పెద్ద ఫూరేగింపు నిర్వహించింది. మరుసటి రోజు నుండి సంఘ నాయకుల ఇళ్లపై, సంఘం బలంగా వున్న గ్రామాలపై దాడులు చేశారు. పది మంది సంఘ నాయకుల ఇళ్లను ధ్వంసం చేశారు. ప్రజలు ఈ దాడులను కూడా ధైర్యంగా, సంఘటితంగానే ఎదుర్కొన్నారు. తమ గ్రామాలపై దాడికి వచ్చిన శాంతి సంఘం మూకపై సాంప్రదాయక ఆయుధాలతో ప్రతిఘటించగా ఆ మూకలోని ఒక వ్యక్తి మరణించడంతో శాంతి సంఘం వెనుదిరిగింది.

అలా సాంప్రదాయక ఆయుధాలతో మిలిటెంట్‌గా కదులుతున్న ప్రజలపైకి శాంతి కమిటీకి, భూస్వాములకు మద్దతుగా ప్రభుత్వం పోలీసు బలగాలను దింపింది. వందల మంది సి.ఆర్.పి.ఎఫ్. బలగాలు నారాయణపట్నంలో మోహరించి నిరంతరం పాట్రోలింగ్‌లు చేస్తూ, గ్రామాలలోకి వెళ్లి ప్రజలను బెదిరించటం, మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ ఇళ్లలోకి చొరబడి సోదా చేయటం, అరెస్టులు చేయటం మొదలుపెట్టారు. దీనికి నిరసనగా ఆగ్రహించిన ప్రజలు పోలీసుల జులుం నశించాలని నినాదాలు చేస్తూ సుమారు మూడు వేల మందికిపైగా ప్రజలు నారాయణపట్నం పోలీస్ స్టేషన్‌ను, సి.ఆర్.పి.ఎఫ్. కంపెనీ మకాం వేసిన భవనాన్ని చుట్టుముట్టి నిలదీశారు. ప్రజల శక్తికీ, ఆగ్రహానికి పోలీసులు తలవంచక తప్పలేదు. చివరకు పోలీసులు క్షమాపణ కోరి, క్షమాపణ పత్రం రాసి ఇవ్వటంతో ప్రజలు శాంతించారు.

జూన్ 18న పాలూరు ఆంబుష్‌లో 10 మంది పోలీసులు చనిపోయిన సంఘటనలో మావోయిస్టులకు సహకరించారనే పేరుతో సంతకు వచ్చిన వాళ్లను అరెస్టు చేయటం, గ్రామాలపైకి దాడులకు రావటాన్ని నిరసిస్తూ ప్రజలు రోడ్లకు అడ్డంగా చెట్లను నరికారు. అన్ని రోడ్లు స్తంభించిపోవటంతో చివరకు నారాయణపట్నంలో మోహరించి వున్న పోలీసు బలగాలకు ప్రభుత్వం హెలికాప్టర్ ద్వారా ఆహార పదార్థాలను అందించవలసిన పరిస్థితి ఏర్పడింది.

2009 అక్టోబర్‌లో ఆదివాసీ ఛసి ములియా సంఘ నాయకులు లింగ, సింగన్న, రాంపాధలను అరెస్టు చేయాలనీ, వారి ఫోటోలతో ముద్రించిన పోస్టర్లను నారాయణపట్నం పోలీస్ స్టేషన్ గోడలపై అంటించారు. దానికి నిరసనగా రెండు వేల మంది కదిలి స్టేషన్‌ను చుట్టుముట్టారు. అప్పుడు కూడా పోలీసులు క్షమాపణ చెప్పి 'ఆ పోస్టర్లు తాము వేయలేదని', 'మీకు మేము విరోధం కామనీ, 'మీపై దాడులకు రామనీ' హామీ పత్రాలు రాసి ఇచ్చారు. ఇలా... ఎన్నోసార్లు నారాయణపట్నంలో సభ, ప్రదర్శన, నిరసన పోరాటం, నిర్బంధ ప్రతిఘటనా... ఏది జరిగినా అన్ని గ్రామాల నుండి వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

ఈవిధంగా సారా వ్యతిరేక ఉద్యమంగా మొదలైన ఆదివాసీ ఛసి ములియా సంఘం పోరాటం క్రమంగా ఊపందుకుని విస్తరిస్తూ, పోరాటంలో ఆటంకంగా నిలిచే ఏ శక్తులనైనా ధైర్యంగా ఎదుర్కోగలమనే నమ్మకాన్ని కలిగించింది. ఆ బలమైన విశ్వాసంతోనే ప్రజలు తాము పోరాడి సాధించుకున్న భూముల్లో కోతకొచ్చిన పంటలను సమిష్టిగా కోసుకోవడానికి 2009 నవంబర్ నెలలో సమాయత్తమయ్యారు.

రైతుకూలీ సంఘం పిలుపుకు వేలాది ప్రజలు సంఘటితం కావటంతో అక్కడి దోపిడీ వర్గాల్లోనూ, పోలీసు బలగాల్లోను భయాలు నెలకొన్నాయి.

ప్రజలు పోరాడి సాధించుకున్న భూములలో ఏడాదిపాటు ఇంటిల్లిపాదీ శ్రమపడి బంగారంలా పండించిన పంట కోతకు ఎంతో ఉత్సాహంతో ప్రజలు సిద్ధం అవుతున్న సమయంలో, 2009 నవంబర్ 20న ఉదయం 10 గంటల సమయానికి నారాయణపట్నంకు రెండు కి.మీల దూరంలో వున్న 'దుంబగూడ' అనే గ్రామానికి పోలీసులు వెళ్లారు. అక్కడ వ్యవసాయ పనులు చేసుకుంటున్న ప్రజలను మావోయిస్టులకు సహకరిస్తున్నారంటూ, వాళ్లు ఎక్కడున్నారో చెప్పండంటూ బెదిరించారు. మహిళలతో అసభ్యంగా మాట్లాడుతూ, ఛసి ములియా సంఘాన్ని దుర్భాషలాడుతూ ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడారు. దాంతో ఆ గ్రామ ప్రజలు ఈ విషయాన్ని తమ సంఘ నాయకుడైన నాచిక లింగకు తెలియజేశారు. విషయం తెలిసిన వెంటనే... ప్రజలు నారాయణపట్నం చేరుకోవాలని సంఘ నాయకుడు లింగ పిలుపునిచ్చాడు. దాంతో అప్పటికప్పుడే అందుబాటులో వున్న గ్రామాల ప్రజలు, సంఘ నాయకులు సుమారు రెండు వందల మంది నారాయణపట్నం స్టేషన్‌కు చేరుకున్నారు. ఇంకా దూర ప్రాంత ప్రజలు కొండల నుండి కాలి నడకన తరలి వస్తూనే వున్నారు.

పోలీసుల దౌర్జన్యాలపై ఆగ్రహావేశాలతో అప్పటికే నారాయణపట్నం చేరుకున్న రెండు వందల మంది 'దుంబగూడకు పోలీసులు ఎందుకు వెళ్లారు?', 'ప్రజలపై ఎందుకు దౌర్జన్యం చేస్తున్నారు?', 'ఇప్పటివరకు ఎన్ని హామీ పత్రాలు రాసిచ్చారో గుర్తులేదా...' వీటన్నింటికి సమాధానం చెప్పాలని నినాదాలు చేశారు. అయితే ఏమాత్రం పట్టించుకోకుండా ప్రజలను మరింత రెచ్చగొట్టేలా స్టేషన్ గేట్‌కు తాళం వేసి పోలీసులు లోపలకు వెళ్లిపోవడంతో

## నారాయణపట్నంలో పోరు జ్వాలలను రగిలించిన కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రులకు జోహార్లు

అడవిపై హక్కు ఆదివాసీలకేననీ, భూమిపై పీడిత ప్రజల హక్కు సాధించేవరకు పోరాటమే మార్గమని నమ్మి భూపోరాటంలో అడ్డు నిలిచిన భూస్వాములకూ, పెత్తందార్లకూ, పోలీసులకు ఎదురునిలిచి అత్యంత ధైర్యసాహసాలతో ప్రజలకు ముందుండి నాయకత్వం వహించి 2009 నవంబర్ 20న నారాయణపట్నం కాల్పుల్లో అసువులుబాసిన కామ్రేడ్ కేంద్రుక సింగన్న 30 ఏళ్ల క్రితం పేద ఆదివాసీ కువ్వి తెగలో పుట్టాడు. తను పుట్టిన ఊరు పొడపొదర్. ఊహ తెలిసిన నాటినుండి తమ గ్రామంలోను, చుట్టుపక్కల గ్రామాలలోనూ ఆదివాసేతర దోపిడివర్గ, భూస్వాములు, ఫారెస్టు అధికారులు, షావుకార్లు చేస్తున్న దోపిడీ దౌర్జన్యాలను చూశాడు. తనూ అనుభవించాడు. చిన్నప్పటి నుండీ తిరుగుబాటు మనస్తత్వంతో దోపిడిని ఎదిరించాడు. అలా 2004లో నారాయణపట్నంలో ఏర్పడిన ఆదివాసీ ఛసి ములియా సంఘంలో కార్యకర్తగా చేరి క్రమ క్రమంగా ప్రజల్లో గొప్ప మిలిటెంట్ నాయకుడిగా ఎదిగాడు. ప్రజలు సాయుధం కాకుండా అధికారం సాధించలేమని గుర్తించి 'గెనవ బాహిని సంఘం' పేరుతో యువతీ యువకులను సాంప్రదాయక ఆయుధాలతో సాయుధంచేసి 'ప్రజా రక్షక దళాలు'గా నిర్మించి ఆ సైన్యానికి నాయకత్వం వహించాడు. అన్ని మిలిటెంట్ చర్యలలో, దాడులలో ముందుంటూ ప్రజల్లో గొప్ప ధైర్యాన్నీ, ఉత్సాహాన్ని నింపాడు. 'సింగన్న వుంటే మనం ఖచ్చితంగా గెలుస్తాం...' అనేది ప్రజల్లో బలమైన నమ్మకం. సింగన్నకు తూటాలు తగలవనీ, తుపాకులు పేలవనీ, ఆయనను ఏ శక్తీ ఏమీ చేయలేదని ప్రజలు అమాయకంగా నమ్మేవారంటే ప్రజల్లో ఆయనపట్ల వున్న విశ్వాసాన్ని అర్థం చేసుకోవచ్చు.

కామ్రేడ్ నాచిక ఆంద్రు బలియపుట్ గ్రామంలో పేద ఆదివాసీ కువ్వి తెగలో పుట్టాడు. ఛసి ములియా సంఘ కార్యక్రమాలు మొదట ప్రారంభమయింది ఆ గ్రామంలోనే. ఆ సంఘ నాయకుడు నాచిక లింగ తన బంధువే కావటంతో తనూ చిన్న వయసు నుండే సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. అలా ఏర్పడిన గెనవ బాహినీ సంఘంలో తనూ సభ్యుడయ్యాడు. నవంబర్ 20న నారాయణపట్నంలో జరిగిన నిరసన కార్యక్రమంలో తనూ పాల్గొని పోలీసు కాల్పులలో అమరుడయ్యాడు. అమరుడయ్యేనాటికి తన వయసు 25 సంవత్సరాలు.

కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రులు ఆదివాసీ పోరాట చరిత్రలో, ఆదివాసీ తిరుగుబాట్లలో అసువులుబాసిన అనేక మంది ఆదివాసీ నాయకుల వారసత్వాన్ని కొనసాగిస్తూ... అమరత్వంలో వారి సరసన నిలిచారు. ఆ అమరులకు జోహార్లు చెబుతూ వారి పోరాట వారసత్వాన్ని కొనసాగిద్దామని శపథం చేద్దాం.

ప్రజలు మరింత కోపోద్రిక్తులయ్యారు. సంఘ నాయకుడు సింగన్నతోపాటు మరో పది మంది 'గెనవ బాహిని' కార్యకర్తలు గేటు తాళాలు బద్దలుగొట్టి స్టేషన్ లోపలకు దూసుకువెళ్లారు. అంతకుముందు అనేకసార్లు హామీ పత్రాలు రాసిచ్చిన స్టేషన్ ఆఫీసర్‌ను పట్టుకుని నిలదీశారు. తమపైకి తుపాకులను ఎక్కుపెట్టిన పోలీసులతో తోపులాట జరిగింది. అంతలోనే స్టేషన్ పై అంతస్తులోనూ, కిందా వున్న పోలీసులు ఒక్కసారిగా విచక్షణా రహితంగా ప్రజలపైకి కాల్పులు జరిపారు. గేటు బయటవున్న కా. ఆంద్రు తలకు తూటా తగిలి అక్కడికక్కడే మరణించగా, స్టేషన్ లోపల వున్న కా. సింగన్నపై దగ్గర నుండే కాల్పులు జరపటంతో గాయపడి బయటకు వస్తూ గేటు వద్ద పడిపోయాడు. అనంతరం గాయపడిన కామ్రేడ్ సింగన్నను పోలీసులు క్రూరంగా గొడ్డలితో నరికి చంపేశారు. పోలీసు కాల్పుల్లో కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రులు అమరులవగా అనేక మంది తూటాలు తగిలి గాయాలపాలయ్యారు. ఊహించని ఈ సంఘటనతో నెత్తురోడుతున్న గాయాలతో ఆందోళనతో ప్రజలు చెల్లా చెదురయ్యారు.

భూమి కోసం ఉద్యమిస్తున్న ఛసి ములియా సంఘంపై పోలీసులు పథకం ప్రకారమే రెచ్చగొట్టి తమ వద్దకు రప్పించి, కాల్పులు జరిపి కామ్రేడ్స్ సింగన్న, ఆంద్రులను హత్య చేశారు. కా. సింగన్న హత్యతో ప్రజలూ, కార్యకర్తలు ఎటువంటి ఆందోళనలకూ, విధ్వంసాలకు పాల్పడకుండా, ప్రతిఘటించకుండా వుండటం కోసం 144 సెక్షన్‌ను విధించారు. హై అలర్ట్ ప్రకటించారు. 21న తెల్లవారుజాము 3 గంటలకల్లా నాలుగు కంపెనీల అదనపు పోలీసు బలగాలనూ, తెల్లవారినాక మరో మూడు కంపెనీల బలగాలను నారాయణపట్నంలో దించారు. పాఠశాలలూ, హాస్టళ్లలో విద్యార్థులను ఖాళీ చేయించి పోలీసులతో నింపారు. సంఘం ఆఫీస్‌ను సీల్ చేశారు. సంఘ కార్యకర్త గుంప (ఎస్.సి.) ఇంటిని కూలగొట్టారు. నారాయణపట్నంలో ఆదివాసీలు అడుగుపెట్టే పరిస్థితే లేదు. కనీసం తమ ప్రియతమ నాయకుల శవాలను తెచ్చుకోవాలన్నా పురుషులు ఎవరు వెళ్లినా అరెస్టులు చేస్తారనే దాంతో 22వ తేదీ రాత్రికి మహిళలు మాత్రమే వెళ్లి శవాలను తెచ్చుకున్నారు. 23న చుట్టూ పోలీసు పహారా మధ్యనే వేలాది మంది ప్రజలు పోలీసుల ఆటంకాలను తొలగించుకుంటూ తమ ప్రియతమ నాయకుల అంత్యక్రియలను జరుపుకున్నారు. నారాయణపట్నంలో ఆదివారం సంత జరగలేదు. కువ్వి వాళ్లనూ, పురుషులను కనిపిస్తే అరెస్టులు చేస్తున్నారనే భయం. ఇక తూటాలు తగిలి గాయాలైన వాళ్ల పరిస్థితి మరింత దీనంగా మారింది. వాళ్లకు

## దేవ్‌మాలి పర్వత ప్రాంతానికి విస్తరించిన పోరాటం

నారాయణపట్నం భూపోరాటంతో ఉత్తేజితులైన దేవ్‌మాలి పర్వత ప్రాంత ప్రజలు తమని నిర్వాసితులుగా మార్చే బాక్సైట్ గనుల విస్తరణ కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వ, సామ్రాజ్యవాద కుట్రలకు వ్యతిరేకంగా ఛసి ములియా సంఘం నాయకత్వంలో ఉద్యమించటానికి సిద్ధమవుతున్నారు. కోరాపుట్ జిల్లా పొట్టంగి బ్లాక్‌లోని కొటియా, తురియా, కంటి పంచాయితీలలో చాలా పెద్ద పర్వత శ్రేణులున్నాయి. వీటిని 'దేవ్‌మాలి' పర్వతాలంటారు. ఈ పర్వతాల్లో బాక్సైట్ ఖనిజ నిక్షేపాలున్నాయి. ఈ పర్వతాలు సముద్ర మట్టానికి 4,385 అడుగుల ఎత్తున వున్నాయి. వీటి వైశాల్యం 17 చ.కి.మీ. ఈ కొండల్లో 3,700 లక్షల టన్నుల బాక్సైట్ నిల్వలున్నట్లు శాస్త్రజ్ఞుల అంచనా. కోరాపుట్ జిల్లాలో మిలిగూడ బ్లాక్‌లో 'పంచపట్టి మహల్' పర్వత శ్రేణులున్నాయి. ఇందులో బాక్సైట్ నిల్వల తవ్వకాలను నాల్కో కంపెనీ చేపట్టి గత 30 సంవత్సరాల నుండి ఖనిజాలను తవ్వి నాల్కో ఫ్యాక్టరీ దామన్‌జోడికి తరలిస్తున్నది. 'దేవ్‌మాలి' పర్వతాలను కూడా నాల్కో యాజమాన్యం లీజుకి తీసుకుంది. దేవ్‌మాలి పర్వత శ్రేణులపై పక్కారోడ్ల నిర్మాణం విశ్రాంతి భవనాల నిర్మాణం పూర్తయి వున్నాయి. మైనింగ్ తవ్వకాలను ఏ రోజైనా ప్రారంభించేందుకు సిద్ధంగా యాజమాన్యం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకుంది. చుట్టుపక్కల గ్రామాల ప్రజలను ఖాళీ చేయాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. ఇది అక్కడి ప్రజలకు జీవన్మరణ సమస్యగా ముందుకు వచ్చింది. ఈ ప్రజలకు ఆదివాసీ ఛసి ములియా సంఘం అండగా నిలబడి పోరాటానికి ప్రజలను సిద్ధం చేస్తున్నది. 2009 ఏప్రిల్‌లో అన్ని సెక్షన్ల పీడిత ప్రజలను కలుపుకుని 'దేవ్‌మాలి సురక్షా సమితి'ని ఏర్పాటుచేసి 12 వేల మంది ప్రజలతో బహిరంగ సభ జరిపి పోరాటానికి పిలుపునిచ్చింది. దేవ్‌మాలి పర్వతాలు కాపాడుకోవాలని ఆదివాసీలను నిర్వాసితులను చేస్తున్న దళారీ నిరంకుశ బూర్జువా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చింది. ఇలా ఆదివాసీ ఛసి ములియా సంఘం అనేక ప్రజా సమస్యలపై ప్రజలను సంఘటితం చేస్తూ, అత్యంత ధైర్యసాహసాలతో, పీడిత ప్రజల అండదండలతో అభివృద్ధి అవుతూ నేడు కోరాపుట్ జిల్లా ఆరు బ్లాకులలోకి విస్తరించింది. భూమి, భుక్తి, విముక్తి కోసం అత్యంత ధైర్యసాహసాలతో పోరాటాన్ని విస్తరిస్తున్న ఆదివాసీ ఉద్యమాలపై ప్రభుత్వం క్రూరమైన నిర్బంధాన్ని ప్రయోగించి అణచివేయాలని చూస్తున్నది. అయినా ప్రజలు అజేయులని చరిత్ర తేల్చేసిన సత్యాన్ని నిరూపిస్తూ నారాయణపట్నం ప్రజల పోరాటం మునుముందుకే పోతుంది.

వైద్యం చేసే వాళ్లెవరు?... అలా నేటికీ నారాయణపట్నం సంతకు మహిళలు, ముసలి వాళ్లే వెళుతున్నారు.

ఇక నారాయణపట్నంలో తిష్ట వేసిన పోలీసుల దినచర్య చూస్తే... తెల్లవారితే పోలీసులూ, శాంతి కమిటీ మూకలు కలిసి మూడు నాలుగు బృందాలుగా సంఘం బలంగా వున్న ఏదో ఒక గ్రామంపైకి దాడికి వెళుతున్నారు. శాంతి కమిటీ మూకలు పోలీసులకు రూట్ గైడ్‌లుగా వుంటూ, గ్రామాలపై దాడులలో ముందుంటూ ప్రజలను హింసిస్తున్నారు. ఒక గ్రామానికి ఎన్నిదార్లు వుంటే అన్ని దార్లలోనూ వెళ్లి తెల తెలవారుతుండగానే గ్రామం, ప్రజలు ఇంకా మేల్కొనకముందే గ్రామాన్ని చుట్టుముట్టి ప్రజలు ఎటూ తప్పించుకోకుండా గాలిలోకి కాల్పులు జరిపి భయానక యుద్ధ వాతావరణం సృష్టిస్తున్నారు. దొరికిన వాళ్లను దొరికినట్టే పట్టుకుని కర్రలతో, తుపాకీ మడమలతో విచక్షణా రహితంగా కొడుతున్నారు. అడ్డువచ్చే మహిళలను, పిల్లలను, కళ్లు కనబడని ముసిలివాళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా తలలు పగిలేలా కొడుతున్నారు. 'ఇప్పుడు రమ్మనండి మీ సింగన్నను', 'వచ్చి అడ్డుకోమనండి' అని ఎగతాళి చేస్తూ దుర్భాషలాడుతూ 'సంఘాన్ని విడచిపెడతామని ప్రమాణాలు చేయండని' బెదిరిస్తున్నారు.

ఇంట్లో వున్న తిండి గింజలన్నీ కిందపోసి ఎండ్రిన్ కలిపారు. వండుకున్న అన్నం కుండల్లో, ఆహార పదార్థాల్లో గుడాకు నమిలి వుమ్మేశారు. పైసా పైసా కూడబెట్టుకొని దాచుకున్న డబ్బులను దోచుకున్నారు. వ్యవసాయ పనిముట్లయిన కత్తి, గొడ్డలి, గునపం, పార వంటి వాటిని తీసుకుపోయారు. ఎర్రజెండాలు, ఎర్రబట్టలు కనిపిస్తే పిచ్చెక్కినట్లు కాల్చివేస్తున్నారు. అలా గ్రామాలపై పడి బీభత్సాన్ని సృష్టించి, దొరికిన పురుషులను, యువకులను కొట్టి అరెస్టు చేసి తీసుకెళ్లటమే పోలీసుల, శాంతి మూకల దినచర్య. అలా నారాయణపట్నం సంఘ నాయకుడు నాచిక లింగ ఇంటిపై, కౌరుబడి పంచాయితీ నాయకుడు రాంపాధ గ్రామంపైన దాడి చేయటంతో పాటు రోజుకో గ్రామం చొప్పున నారాయణపట్నం పంచాయితీ గ్రామాలన్నింటిపైనా వరుసగా దాడులు చేశారు. పదుల సంఖ్యలో అరెస్టులు చేశారు. ఒకవైపు పోలీసులు, శాంతి కమిటీ మూకలు దాడులు, అరెస్టులు చేస్తూనే మరోవైపు 'ఆపరేషన్ లింగా', 'వాంటెడ్ లింగా' పేరుతో కూంబింగ్‌లు చేస్తూ, లింగతోపాటు మరో 18 మందిని అరెస్ట్ చేస్తామనీ, సంఘ నాయకులు, కార్యకర్తలు స్టేషన్‌కు వచ్చి సరెండర్ కావాలనీ, నాచిక లింగ ఫోటోతో పోస్టర్లు వేసి పట్టిచ్చిన వాళ్లకు రివార్డులిస్తామని ప్రకటించి ప్రజల్లో తీవ్రమైన భయాందోళనలనూ, మానసిక ఒత్తిడిని కలిగిస్తున్నారు.

ఈ నిర్బంధానికి, అరెస్టులకు వ్యతిరేకంగా నారాయణపట్నం ప్రజలకు మద్దతుగా వివిధ ప్రజాసంఘాలు దక్షిణ ఒడిషాలో బంద్‌కు పిలుపునిచ్చాయి. ప్రజలు స్వచ్ఛందంగా బంద్‌ను విజయవంతం చేసినా... బంద్ విఫలమయిందని మీడియా అబద్ధపు ప్రచారాన్ని చేసి ప్రజల మనోబలాన్ని దెబ్బతీయాలని ప్రయత్నించింది. నారాయణపట్నంలో పరిస్థితిని తెలుసుకోవటానికి వచ్చిన వివిధ ప్రజాస్వామిక మేధావులను, ఛత్తీస్‌గఢ్, ఢిల్లీ, మద్రాసు, భువనేశ్వర్, జార్ఖండ్, బీహార్ లాంటి రాష్ట్రాల నుండి వచ్చిన మహిళా ప్రతినిధులను నారాయణపట్నం, బందుగామ్‌ల్లో అనేక ఆటంకాలు కల్పించి శాంతిసేన పోలీసులు వెనక్కు పంపించేశారు. నారాయణపట్నంకు వస్తున్న తపన్‌మిశ్రోతో పాటు మరో వ్యక్తిని మావోయిస్టులుగా ముద్రవేసి అరెస్టు చేశారు. ప్రజలకు వచ్చే ఆహార సరఫరాలను నారాయణపట్నంకు రానివ్వకుండా బందుగాం, సిమిలిగూడలలో శాంతి కమిటీలు వాహనాలను నిలిపివేశారు. ఇలా... నారాయణపట్నం ప్రజలకు ఎటువంటి సహాయ సహకారాలను, మద్దతును అందనివ్వకుండా ప్రభుత్వం, పోలీసులు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నారు.

ప్రభుత్వం, పోలీసులు, శాంతి కమిటీలు కలిసి చేస్తున్న దాడులలో, విధ్వంసంలో... ఇళ్లను, ఆస్తులను, పంటలను, కుటుంబ సభ్యులను కోల్పోయిన ప్రజలు మరింత కసితో తమ అస్తిత్వాన్ని కాపాడుకోవటం కోసం నూతన పోరాట మార్గాన్ని అన్వేషిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో ముసలివాళ్లు మాత్రం వెళ్లి సరెండర్లు అవుతున్నా సంఘ నాయకులు, గెనవ బాహినీ యువతీ యువకులు మాత్రం ప్రజల రక్షణలోనే, ప్రజలకు ధైర్యాన్ని చెబుతూ భవిష్యత్ కార్యక్రమానికి పథకాలను వేస్తున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో మహిళలు, ముసలివాళ్లు మాత్రమే వుంటూ సెంట్రీలు చేస్తున్నారు. 'పోరాట భూములలో పంటల కోతలకు రావాలనీ, కోసిన పంటలో సగభాగం భూస్వాములకు ఇవ్వాలనీ, అనంతరం భూములను వదిలిపెట్టాలనే ఒప్పందాన్ని ప్రభుత్వం, పోలీసులు ప్రకటించారు. ఈ ప్రకటన గురించి ఏ గ్రామంలో చర్చించినా ప్రజలు మాట్లాడేది ఒకటే మాట... "మాకు చేతనైతే, బలం వుంటే మా శ్రమ, గొడ్ల శ్రమను మేము తెచ్చుకుంటాం. లేకపోతే ఆ పంట అక్కడే కుళ్లిపోవాలి. లేదా ధ్వంసం చేస్తాం కానీ వాడికి మేము వాటా ఎలా ఇస్తాం"... అంటున్నారు. "ఈరోజు సింగన్నను చంపామని విర్రవీగుతూ మమ్మల్నీ, మా సంఘాన్ని చూసి భూస్వాములు, షావుకార్లు నవ్వుతున్నారు. రేపు మళ్లీ మేము కూడా నవ్వే రోజులు వస్తాయి" అని ధైర్యంగా విశ్వాసంతో ప్రకటిస్తున్నారు. "ప్రాణం పోయినా, మా నెత్తురు ఏరులైపారినా... ఆ పంటను, భూములను వదిలేది లేదు. కాల్పులు జరిపి ఎంతమందిని చంపుతారో చూస్తాం... అవసరమైతే ఆ భూముల్లోనే ప్రాణం విడుస్తాం..." అంటూ పంటల కోతలకు సిద్ధం అవుతున్నారు. సాంప్రదాయక ఆయుధాలతో ప్రతిఘటనకు పూనుకుంటున్నారు. వేలాది మంది డిసెంబర్ 23 నుండి పంటల కోతలను ప్రారంభించారు. దీనికి ఆటంకం కల్పించటానికి వచ్చిన పోలీసులపై డిసెంబర్ 24న పి.ఎల్.జి.ఎ. చేసిన ఆంబుష్‌లో ఒక ఎస్.ఓ.జి. పోలీసు చనిపోగా ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. ఇందులో శత్రువును మట్టికరిపిస్తూ కామ్రేడ్ మంగ్లి అనే మహిళా సభ్యురాలు కూడా అమరురాలైంది. ఇలా ఎన్నో ఆటంకాలు నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే ప్రజలు మరింత పట్టుదలగా సంఘటితంగా పంటల కోతలు కొనసాగిస్తూనే వున్నారు.

ఆదివాసేతరులలో వున్న పీడిత ప్రజలను కూడా కలుపుకుని, వర్గ శత్రువులను ఒంటరి చేస్తూ ఈ పోరాటం మరింత పటిష్టం అవుతుందని ఆశిద్దాం. నారాయణపట్నం ఆదివాసీ పీడిత ప్రజలు చేస్తున్న ఈ పోరాటానికి ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు మద్దతు తెలుపవలసిన అవసరం వున్నది. ★

---

*(...16వ పేజీ తరువాయి)*

అమెరికా వందల బిలియన్ డాలర్లు ఇస్తానని మొదట్లో వాగ్దానం చేసి కూడా వెనక్కి తగ్గింది. అన్నీ చేయగలిగి కూడా (క్యోటో ఒప్పందంపై సంతకం చేసి కూడా) ప్రపంచాన్ని ప్రమాదపు సుడిగుండంలోకి బలవంతంగా తోసివేస్తున్న సామ్రాజ్యవాద దేశాల స్వార్థపర మార్కెట్ విధానాలను ముక్తకంఠంతో ప్రపంచ ప్రజలు నిరసించాల్సి వుంది. సదస్సు దగ్గర పర్యావరణ విధ్వంసకులకు వ్యతిరేకంగా వేలాది మంది ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. 18 వందల మందికిపైగా అరెస్టు అయ్యారు. అమెరికా 2050కి 80 శాతం తగ్గిస్తానని గొప్పలు చెప్పినా ఎవ్వరూ విశ్వసించని పరిస్థితి. అమెరికా జీవనసరళి మారాలి. అది అసాధ్యం. పెద్ద దేశాల పెదధోరణి, వాతావరణ పరిరక్షణ ముసుగులో వాటి వ్యాపార కాంక్ష అందరికీ స్పష్టమే. ప్రపంచ వనరులను కొల్లగొడుతూ, పర్యావరణాన్ని ధ్వంసం చేస్తున్న దోపిడీ విధానాలను సమూలంగా తొలగించకుండా పర్యావరణ పరిరక్షణ సాధ్యంకాదు. అందుకే ప్రకృతి పరిరక్షణ కూడా వర్గపోరాట సమస్యతోనూ, పెట్టుబడిదారీ (సామ్రాజ్యవాదంతోసహా) విధానాన్ని ఓడించి సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని నిర్మించే సమస్యతో ముడిపడి వుందన్న వాస్తవాన్ని అందరూ గుర్తించాలి. ★

**రష్యాతో అనేక అణువిద్యుత్ కేంద్రాలు ఏర్పరచడానికి భారత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలను వ్యతిరేకిద్దాం!**

# 'సహకార వ్యవసాయం' కాదు కార్పోరేట్ వ్యవసాయం

పేద ప్రజల భూములను కొల్లగొట్టి, బహుళజాతి సంస్థలకూ, పెత్తందార్లకు కట్టబెట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒక కొత్త ఎత్తుగడ ఎత్తుతున్నది. సహకార వ్యవసాయం అనే ఆకర్షణీయమైన పేరుతో కొత్త పథకాన్ని రచిస్తున్నది. దీన్ని సమర్థించుకోవడానికి అనేక అంశాలను పేర్కొన్నది. రాష్ట్రంలో వ్యవసాయ కమతాలు నానాటికి చిన్నవిగా మారుతున్నాయి. చిన్న కమతాల వ్యవసాయం లాభసాటిగా వుండదు. ఉత్పాదకత తక్కువగా వుండి చిన్న రైతులకు వనరుల కొరత వున్నది. వారికి పెట్టుబడి పెట్టే ఆర్థిక స్తోమత వుండదు. యంత్రాలతో వ్యవసాయం చేయలేరు. వారికి నూతన వ్యవసాయ సాంకేతిక విజ్ఞానం అందడంలేదు. వీరు ఈ విజ్ఞానాన్ని వినియోగించుకొని అమలు చేయలేరు. అధిక లాభాలు ఇచ్చే వాణిజ్య పంటలు పండించలేరు. ఎగుమతికి అనువైన పంటలను పండించరు. అందువల్ల వారికి చేతి నిండా పని లేదు. వారి వ్యవసాయం నష్టాలతో కూడుకొని వున్నది. కాబట్టి వీరిని ఒడ్డుకు చేర్చేందుకు వీరి అన్ని సమస్యలను పరిష్కరించడానికి రైతుల ఆదాయాలు పెంచడానికి వారి భూముల్ని ఏకం చేసి, వాటిని వ్యవసాయ క్షేత్రాలుగా మార్చాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోంది.

## ప్రభుత్వం చెబుతున్న 'సహకార వ్యవసాయం' సారాంశం

2009 అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి వస్తే సహకార సేద్యం ప్రారంభిస్తానని తన ఎన్నికల ప్రణాళికలోనే ప్రకటించింది. అందుకు అనుగుణంగానే 2009 జూన్ 8వ తేదీన కొత్త శాసన సభ సమావేశాలలో గవర్నర్ ప్రసంగంలో "సహకార సేద్యం" ప్రస్తావన వచ్చింది. తర్వాత 2009 జూన్ 28న అఖిలపక్ష సమావేశాలలో ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి 'సహకార వ్యవసాయం' ప్రారంభించనున్నట్లు స్పష్టంగా ప్రకటించాడు. చిన్న కమతాల వల్ల ఉత్పాదకత శక్తి తగ్గిపోయి రైతుల ఆదాయం పెరగడం లేదు. పెట్టుబడులు పెరగటంలేదు. కనుక ఉత్పాదక శక్తి తగ్గిపోతోంది. కాబట్టి రైతుల్ని సహకార సంస్థలలో చేర్చి లేదా కంపెనీగా చేర్చి లేదా సొసైటీగా ఏర్పాటు చేయాలి. ఇలా రైతులు తమ భూములు కంపెనీ సహకార క్షేత్రంలో కలిపితే అవి భారీ వ్యవసాయ క్షేత్రాలు అవుతాయి. వీటికి బ్యాంకులు భారీగా రుణాలు ఇస్తాయి. దానితో పెద్ద ఎత్తున పంటలు పండించడం, వ్యవసాయాను బంధంగా పరిశ్రమలూ, ప్రాసెసింగ్, ఇతర వ్యాపారాలు చేసుకొని భారీ ఆదాయాలు గడించ వచ్చని ఊహా స్వర్గాలు చూపిస్తున్నారు. "సేద్యానికి సహకారం-రైతన్నకి బంగారం" పేరిట ప్రభుత్వం నిలువెత్తు ప్రకటనలు ఇచ్చింది.

దీని ప్రకారం ఏర్పడే సొసైటీ లేదా కంపెనీకి రైతులు తమ భూముల్ని బదలాయించి భూమిపై హక్కులతో సహా బదిలీ చేయాలి. అందుకు పెట్టుబడిలో వాటా కల్పిస్తారు. ఆ క్రమంలో రైతు ఎప్పుడయినా సరే సహకార సంస్థ నుంచి తప్పుకోవాలనుకుంటే తన వాటాను ఇతర సభ్యులకు గానీ, ప్రభుత్వానికి గానీ అమ్ముకొని తప్పుకోవచ్చు. అలాగే ఏర్పడే సంస్థయే వ్యవసాయ పనులు నిర్వహిస్తుంది. గిడ్డంగులు ఏర్పాటు చేస్తుంది. ఇందులో ప్రభుత్వ జోక్యం వుండదు. ఇది స్థూలంగా సహకార వ్యవసాయం ప్రతిపాదనలోని సారాంశం. దీనివల్ల జరిగే పరిణామాలేమంటే

- రైతులకు తర తరాలుగా వున్న కొద్దిపాటి భూమి మీద వున్న హక్కు కోల్పోవాల్సి రావటం.
- సహకార సంఘానికి రైతు తన భూమిని సంపూర్ణంగా స్వాధీనం చేయటం వల్ల పరిహారంగా భూమి విలువ ఆధారంగా వాటి ధనం కేటాయించబడుతుంది.
- రైతుకి తన భూమిని అవసరమైనప్పుడు ఎవరికైనా అమ్ముకొనే స్వేచ్ఛ వుండదు. ఆ సహకార సంఘానికి లేదా ఇతర సభ్యులకు అమ్ముకోవాలి.
- రైతు హోదా యజమాని నుండి కూలీగా మారుట.

## దేశంలో వ్యవసాయం పరిస్థితి

మనది వ్యవసాయ ప్రధాన దేశం. నూటికి డెబ్బై శాతం పైగా ప్రజలు గ్రామాల్లోనే జీవిస్తున్నారు. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా వుంది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం చిన్న, సన్నకారు రైతులు పెరుగుతున్న మాట వాస్తవమే. అయినా వీరి చేతిలో వున్న భూమి 40 శాతం మాత్రమే. అందులో నిస్సారమైన భూమియే ఎక్కువ. పెద్ద కమతాలుగా వున్నవారు సంఖ్యరీత్యా తక్కువే అయినా వీరి చేతిలో 60 శాతం భూమి వుంది. ఉత్పాదకత లేదని చెప్పుకుంటున్న స్థితిలోనే 230.4 మిలియన్ టన్నుల ఆహార ధాన్యాలను రైతాంగం పండించిందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి ప్రకటించాడు. భారత వ్యవసాయ రంగం అనేక ఆటుపోట్లను ఎదుర్కొంటున్నప్పటికీ ఈ ఉత్పత్తిని వెలికి తీయడం గమనించాలి.

వ్యవసాయరంగ కార్యకలాపాలు సజావుగా సాగితే గ్రామీణ

ప్రాంతంలో ఏటా 5.66 లక్షల కోట్ల ఆదాయం ఉత్పత్తి అవుతుంది. ఆర్థిక సంక్షోభం నుండి కంపెనీలను బయట పడవేయడానికి ప్రభుత్వం ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలకంటే ఇది నాలుగు రెట్లు ఎక్కువ. ఈ అయిదున్నర లక్షల కోట్ల రూపాయల ఆదాయం వుంటేనే వినిమయ వస్తువుల పరిశ్రమలు మూడు పువ్వులూ ఆరు కాయలుగా విరజిల్లుతున్నాయని 'అసోచం' నిర్వహించిన అధ్యయనం కూడా తెలియజేసింది. దేశానికి ఇంత ఆదాయాన్ని సమకూర్చి తిండిని అందిస్తున్న రైతాంగం నష్టాలపాలవడం, ఆత్మహత్యలు కోసుకోవటం, పాలకుల తప్పుడు విధానాలు, రైతు వ్యతిరేక విధానాల ఫలితమే తప్ప మరొకటి కాదు.

## చిన్న కమతాలు నష్టమా?

జాతీయాదాయంలో వ్యవసాయ రంగం వాటా నానాటికీ తగ్గిపోతుండటానికి, ప్రభుత్వం నిత్యం ప్రకటించే ఉత్పత్తి లక్ష్యాలను చేరుకోక పోవడానికి రైతులు, చిన్న కమతాలు కారణమా? ప్రభుత్వ విధానాలు కారణమా?

దున్నేవారికి భూమి లేకపోవడం, ప్రకృతి వైపరీత్యాలతో నిత్యం వ్యవసాయం ఒడిదుడుకులను ఎదుర్కోవడం, వ్యవసాయ రంగానికి ప్రభుత్వ పెట్టుబడులు లేకపోవడం, రుణ సౌకర్యాలు తగినంత లేకపోవడం, సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు, మందులు రైతుకు అందుబాటులో లేకపోవడం, నీటి సౌకర్యం లేకపోవడం, ఇన్ని కష్టాలు పడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం మొదలైనవి వ్యవసాయ సంక్షోభానికి కారణాలుగా వున్నాయి. ప్రభుత్వం రైతుకు చేయూతనిచ్చి ఆదుకోవల్సింది పోయి తమ నేరాన్ని రైతుల మీదికీ, చిన్న కమతాల మీదికి నెడుతున్నది. చిన్న కమతాల సేద్యం నష్టాలు, శ్రమతో కూడుకున్నది కనుక దీనికి లాభసాటి పరిష్కారం సహకార సేద్యమే అంటూ రోగమొకటయితే మందొకటి వేసినట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తున్నది.

చిన్న కమతాల సేద్యంలో ఉత్పాదకత తక్కువగా వున్నదనీ, అది లాభదాయకం కాదనీ చెప్పడం ఉత్త అబద్ధం. మన దేశంలో, రాష్ట్రంలో చిన్న కమతాల సేద్యం గురించి అనేక అధ్యయనాలు జరిగాయి. ఆర్థిక వేత్తల అధ్యయనం ప్రకారం చిన్న కమతాల్లోనే సమర్థవంతంగా వనరుల వినియోగం జరుగుతోంది. చిన్న రైతుల పొలాల్లో ఎకరా దిగుబడులు ఎక్కువగా వున్నాయి. దీనికి ప్రధాన కారణం – చిన్న కమతాల్లో కుటుంబ వ్యవసాయం జరుగుతోంది. కుటుంబంలోని వారంతా కష్టపడి పని చేస్తారు. వనరుల దుర్వినియోగం వుండదు. మన దేశంలోనే కాదు ప్రపంచ దేశాలన్నింటిలోనూ చిన్న కమతాల్లో ఉత్పాదకత ఎక్కువ అని అధ్యయనాలు తెలుపుతున్నాయి. జపాన్, చైనా, తైవాన్, దక్షిణ కొరియా, వియత్నాం, మలేషియా, థాయిలాండ్ మొదలయిన దేశాల్లో కమతాల పరిమాణం మన కన్నా చాలా చాలా చిన్నవి. కానీ ఉత్పాదకత మూడు రెట్లు ఎక్కువ. కాబట్టి చిన్న కమతాలు అసమర్థమైనవనీ, ఉత్పాదకత తక్కువని చెప్పడం తప్పు. దుష్ప్రచారంతో ప్రజలను దగా చేయడమే. ఆసియా దేశాల్లో చిన్న కమతాల్లో ఉత్పాదకత మనకన్నా అనేక రెట్లు ఎక్కువగా వుండడానికి కారణం ఆ దేశాల్లోని ప్రభుత్వాలు చిన్న రైతాంగానికి అందిస్తున్న సహాయం, వారి అభివృద్ధికి రూపొందించి అమలుచేస్తున్న విధానాలే, రాష్ట్ర ప్రభుత్వం చిన్న కమతాల నష్టాలను గురించి చెప్పడం అందుచేతనే సహకార వ్యవసాయమని చెప్పడం, మోసపూరితం. చిన్న రైతులకు అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తే వారి భూముల్లో బంగారు పంటలు పండించగలరనడం అతిశయోక్తి కాదు.

## 'సహకార వ్యవసాయం' పరిణామాలు

ప్రభుత్వ ప్రతిపాదనలను విశ్లేషిస్తే ఇది కంపెనీ వ్యవసాయం అని మనకు స్పష్టంగా తెలుస్తోంది. రైతులు తమ భూములతో పాటు వాటిపై హక్కును కూడా కంపెనీ/సొసైటీకి బదిలీ చేయాలి. కంపెనీ/సొసైటీ వ్యవసాయ కార్యకలాపాలు కొనసాగిస్తుంది.

వాటాలు/షేర్లు, షేర్ హోల్డర్లు వుంటే అది కంపెనీ. సభ్యులుంటే అది సహకార సంఘం (సొసైటీ). సహకార సంఘంలో అందరికీ సమాన ప్రతిపత్తి, ప్రజాస్వామ్యం వుంటుంది. కంపెనీలో ఎవరికి ఎక్కువ షేర్లు వుంటే వారి మాటే చెల్లుతుంది. వారికే ఎక్కువ లాభాలు వుంటాయి. ప్రభుత్వం చెబుతున్న దాని ప్రకారం రైతుల భూములకు నాణ్యతను బట్టి విలువ కడుతారు. ఆ విలువను బట్టి రైతులకు వాటాలు (షేర్లు) ఇస్తారు. దీంట్లో వున్న మతలబు ఏమిటి? సాధారణంగా పెద్ద రైతులకు లేదా ధనిక రైతులకు నాణ్యమైన, సారవంతమైన, ఎక్కువ విస్తీర్ణమైన భూములు వుండడం వల్ల ఎక్కువ వాటాలు ఇస్తారు. చిన్న రైతులకు అతి కొద్ది వాటాలు దక్కుతాయి. వాటాల సంఖ్య లేదా విలువను బట్టి డివిడెండ్లు లభిస్తాయి. అంటే ఈ కంపెనీ సేద్యం నుంచి పెద్ద రైతులే లాభపడతారు. చిన్న రైతులకు తక్కువ షేర్లు వుంటాయి కాబట్టి దక్కేది నామమాత్రమే. నష్టాలు వస్తే వారికి దిక్కెవరు?

ప్రభుత్వం మరో విషయం స్పష్టం చేసింది. రైతు కంపెనీ/సొసైటీ నుండి వైదొలగాలంటే తన భూమిని కంపెనీలోనే ఇతర వాటాదారులకు అమ్ముకోవచ్చు లేదా కంపెనీకో, ప్రభుత్వానికో అమ్ముకోవచ్చు. దీన్ని అవకాశంగా తీసుకొని ఒక ధనవంతుడు లేదా వ్యాపారి లేదా పెట్టుబడిదారుడు ఒక ఎకరం భూమి కొని వాటాదారుడు అవుతాడు. ఆ తర్వాత ఇతర చిన్న రైతులను ప్రలోభ పెట్టో, బెదిరించో, అదిరించో వారి వాటాలను కొనేయవచ్చు. రైతు భూమిని కోల్పోతాడు. పెట్టుబడిదారుడు అధిక షేర్లుకొని భూకేంద్రీకరణను తీసుకొని

రావచ్చును. నయా జమీందారుగా రూపాంతరం చెందవచ్చును.

కంపెనీ సేద్యం వల్ల ఏర్పడే భారీ వ్యవసాయ క్షేత్రాల్లో ప్రభుత్వమే చెబుతున్నట్లు భారీ యంత్రాలతో వ్యవసాయం జరుగుతుంది. అందువల్ల శ్రమ శక్తికి అవకాశాలు సన్నగిల్లుతాయి. రైతులూ, వ్యవసాయ కూలీలు ఉపాధి కోల్పోతారు. ఆదాయాలు అడుగంటుతాయి. లాభాలే పరమావధిగా పని చేసే కంపెనీ సేద్యంలో వాణిజ్య పంటలు అధికంగా పండించడంచేత ఆహార ధాన్యాల వుత్పత్తి తగ్గి ఇప్పటికే వున్న ఆహార సంక్షోభాన్ని అది మరింత తీవ్రం చేస్తుంది. ఆహార భద్రత కొరవడి పేద ప్రజలు ఆహారం కొరకు కటకటలాడాల్సి వస్తుంది. భారీ వ్యవసాయ క్షేత్రాల్లో అత్యధికంగా రసాయనాల వినియోగం వల్ల భూములు చెడిపోతాయి, ఆహారం కలుషితం అవుతుంది, పర్యావరణం క్షీణిస్తుంది.

కంపెనీకో, సొసైటీకో భూములు ధారాధత్తం చేసిన రైతులకు ప్రయోజనం వుండవచ్చు, వుండకపోవచ్చు. కానీ భూమిలేని కౌలు రైతులు సహకార సేద్యం ప్రవేశ పెడితే భారీగా నష్టపోతారు. రాష్ట్రంలో కౌలు సేద్యం, కౌలు రైతుల సంఖ్య విపరీతంగా పెరిగింది. కౌలు సేద్యం మీద జీవనం సాగించే వీరి జీవనోపాధికి ఇది గొడ్డలి పెట్టు. అలాగే రైతుల పొలాల్లో పని చేసుకుంటూ బతుకుతున్న వ్యవసాయ కూలీలూ, చేతి వృత్తులవారు మొదలయిన వారందరూ కూడా వుపాధి కోల్పోతారు. దళితులు, వెనుకబడిన వర్గాల వారే అత్యధికంగా వ్యవసాయ కూలీలుగా మారారు. పేద ప్రజల జీవితాలు చిన్నా భిన్నం అవుతాయి. ఒక్కసారి కంపెనీలో ప్రవేశిస్తే తిరిగి బయటపడడం కుదరదు. రైతులు తమ భూముల్ని ఇతర వాటాదారులకో, సొసైటీకో, కంపెనీకో అమ్ముకోవాల్సిందే. అంటే రైతులు శాశ్వతంగా భూములు కోల్పోతారు. జీవన భద్రత కోల్పోతారు, జీవనోపాధి కోల్పోతారు. రైతాంగ వ్యవస్థే నశిస్తుంది. ఇది కుటుంబ వ్యవస్థను కూడా దెబ్బతీస్తుంది. సహకార వ్యవస్థ కుటుంబ వ్యవస్థపై ఆధారపడి వుంది. సన్నకారు వ్యవస్థ కుటుంబ వ్యవస్థ విడదీయరానివి. ఒకటి కూలిపోతే రెండవది కూడా కూలిపోతుంది.

చిన్న, పెద్ద రైతులందర్నీ కలపడం వల్ల పెద్ద వాటాదారులు, ధనిక రైతులు, అగ్ర కులాల ఆధిపత్యం పెరుగుతుంది. యాజమాన్య కమిటీల, బ్యూరోక్రాట్ల పెత్తనం కింద రైతులు నలిగిపోతారు. రాజకీయ జోక్యం అధికమవుతుంది. అవినీతి ప్రబలుతుంది. జవాబుదారీ తనం వుండదు. గ్రామాల్లోని రాజకీయ కక్షలూ, కార్పణ్యాలు సహకార వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీస్తాయి. కంపెనీ వ్యవసాయంలో ప్రజాస్వామ్యం వుండదు. అంతేగాకుండా తర తరాల అనుభవం, చొరవ, స్వతంత్రత కలిగిన చిన్న, సన్నకారు రైతులు కంపెనీ మేనేజ్‌మెంట్ నిర్ణయం మేరకు పంట వేయాలి, పని చేయాలి. వారు భూమికి దూరం చేయబడి చివరికి తమ పొలంలోనే కూలీలుగా మారవల్సిన దుస్థితి ఏర్పడుతున్నది. లేదా పట్టణాలకు తరిమివేయబడతారు. ఇప్పటికే పాలకులు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా చిన్నా, మధ్య తరగతి పరిశ్రమలు మూతపడి లక్షలాది కార్మికులు వీధుల్లోకి నెట్టబడుతున్నారు. బతుకుదెరువు లేక తిరిగి వారే పల్లెలవైపు మరలుతున్న ధోరణి పెరుగుతున్నది. మొత్తం మీద దేశంలో నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుంది.

## కార్పోరేట్ వ్యవసాయం కోసమే సహకార వ్యవసాయం ప్రతిపాదన

పెట్టుబడిదారీ వర్గానికి వ్యవసాయంపై కన్ను పడడంతో కాంట్రాక్ట్ వ్యవసాయం వచ్చింది. రైతులు మాగాణి (తరి) భూములు కంపెనీకి కౌలుకిచ్చి ఆ భూముల్లో కూలీలుగా పని చేస్తూ, సామ్రాజ్యవాద సంస్థలు కోరిన పంటలు పండించారు. అంటే కాంట్రాక్టు వ్యవసాయం ఇప్పుడు మరింత ముందుకు అడుగులు వేస్తూ కార్పోరేట్ వ్యవసాయం కోసం ప్రయత్నిస్తున్నారు. అందుకు నేరుగా చెప్పకుండా 'సహకార వ్యవసాయం' అంటున్నారు.

నేటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ యుగంలో దళారీ పాలకులు ప్రపంచ బ్యాంకు ప్రజా వ్యతిరేక సంస్కరణలను నెత్తి నెత్తుకొని మోస్తున్నారు. బడా కంపెనీల, బహుళజాతి కంపెనీల ప్రయోజనాలకు అనుగుణంగా వ్యవసాయాన్ని పరిశ్రమలకు తోడ్పడే విధంగానూ కార్పోరేట్ వ్యవసాయ విధానాల ద్వారా భూమి బడా పారిశ్రామిక వేత్తల చేతుల్లో కేంద్రీకరించేందుకు గానూ చర్యలు ముమ్మరం చేస్తున్నారు. అందులో భాగమే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు తెస్తున్న సహకార వ్యవసాయం ప్రతిపాదన తప్ప మరొకటి కాదు. ఇప్పటికే ఆర్థిక, సర్వీసు (బ్యాంకింగ్, బీమా తదితర) రంగాల్లోకి విదేశీ పెట్టుబడులు చొరబడ్డాయి. శాస్త్ర సాంకేతిక రంగాల్లోకి సహితం బహుళ జాతి సంస్థలు చొరవబడి ఆధిపత్యం నెరపుతున్న నేపథ్యంలో సహకార వ్యవసాయం పేరుతో జరిగే కంపెనీ వ్యవసాయం రైతు ప్రయోజనాల కోసం మాత్రం కాదు. విపరీత లాభాల కోసం వ్యవసాయోత్పత్తులను వ్యాపారీకరించిన విదేశీ గుత్త సంస్థలు భారత వ్యవసాయ రంగంలో కార్పోరేట్ వ్యవసాయం ప్రవేశపెట్టాలని ప్రపంచ బ్యాంకు ద్వారా ప్రతిపాదించి వున్నాయి. ఇప్పటికే ప్రపంచ బ్యాంకూ, ఐ.ఎం.ఎఫ్.లు భారత కేంద్ర ఆహార సంస్థను ప్రజా పంపిణీ వ్యవస్థలను నిర్వీర్యం చేయాలని ధాన్య సేకరణా, సరుకుల పంపిణీ వ్యవస్థలను ప్రయివేటు రంగానికి అప్పగించాలని పాలకులపై ఒత్తిడి చేస్తూ క్రమంగా అమలు జరిపిస్తున్నాయి. దీని కొనసాగింపుగా ఇప్పుడు వ్యవసాయ రంగాన్ని కార్పోరేట్ సంస్థలకూ, బహుళ జాతి కంపెనీలకు అప్పగించాలని ప్రపంచ బ్యాంకు ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నది. దీని ఫలితమే నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న సహకార వ్యవసాయం.

ఇప్పటికే వ్యవసాయంలోకి కార్పోరేట్ సంస్థలను ఆహ్వానించడానికి వీలుగా కాంట్రాక్టు వ్యవసాయ బిల్లు, ప్రయివేట్ మార్కెట్ బిల్లును ప్రభుత్వం తెచ్చింది. కాంట్రాక్టు వ్యవసాయం, సెజ్‌లు, పారిశ్రామిక కారిడార్, సహకార వ్యవసాయం పేరుతో చిన్న కమతాలను ధ్వంసం చేసి భూ కేంద్రీకరణను పెంచి సన్నా, చిన్నకారు రైతులను భూముల నుండి నెట్టివేసి కంపెనీ నిర్వహణ పేరుతో నయా జమిందారీ వ్యవస్థను సృష్టించే ప్రయత్నం ప్రభుత్వం చేస్తున్నది.

అమెరికాలో వ్యవసాయం వ్యాపారీకరించడంలో పది గుత్త సంస్థలు కార్పోరేట్‌గా ఏర్పడ్డాయి. అన్ని దేశాల మార్కెట్లను ఈ కంపెనీల ఆహారోత్పత్తులే ముంచెత్తాయి. ఇది వ్యవసాయ వ్యవసాయోత్పత్తుల వ్యాపారంలో 70–90 శాతం చేజిక్కించుకొని గుత్తాధిపత్యం చెలాయిస్తున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్‌ల ఆధ్వర్యంలోని 11 బహుళజాతి గుత్త సంస్థలు భారత్ వంటి వర్ధమాన దేశాల్లో అర్జెంటీనా, ఉరుగ్వే, కొన్ని ఆసియా దేశాల్లో వ్యవసాయ భూముల్ని కొనేస్తున్నాయి. రైతాంగ ప్రయోజనాల్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయి. బిలియన్ల డాలర్ల ఆస్తులు పోగేసుకుంటున్నాయి. ఇవి నిర్ణయించే, సాధించే ధరలపై భారత్ వంటి వర్ధమాన దేశాల పంటల వునికి రైతాంగ ప్రజల బతుకులు ఆధారపడి వున్నాయని మరవరాదు.

ఈ నేపథ్యంలో వస్తున్నదే సహకార వ్యవసాయ ప్రతిపాదన. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నమూనాగా ప్రవేశ పెడుతున్నానని చెప్పినా తుదకు మన దేశంలో సంభవించబోయే పరిణామం ఇదే. దేశంలో చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతు వర్గాలు రద్దవుతాయి. భూస్వాములు, స్వదేశీ, విదేశీ గుత్త సంస్థలే వ్యసాయంలో మిగులుతాయి. చిన్న, సన్నకారు రైతులు, వ్యవసాయ కూలీలకు ఆత్మహత్యలే గతి కాబోతున్నాయి.

## సహకార వ్యసాయంపై కొన్ని వాదనలు

సహకార వ్యవసాయంపై చర్చ జరుగుతున్న సందర్భంలో నెహ్రూ చేసిన ప్రయత్నం రష్యా, చైనా దేశాల్లో అమలుచేసిన సమిష్టి వ్యవసాయం గురించి కొన్ని వాదనలు వినిపిస్తున్నాయి.

రెండవ ప్రపంచ యుద్ధానంతరం దేశ వ్యాపితంగా ప్రజా పోరాటాల వెల్లువ పెల్లుబికింది. రష్యా, చైనాలు సోషలిస్టు దేశాలుగా అవతరించాయి. ప్రపంచ వ్యాప్తంగానూ భారత దేశంలోనూ ప్రజలపై కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలూ, సోషలిస్టు నినాదాలు వేస్తున్న ప్రభావం నుంచి ప్రజలను పక్కకు మళ్లించడానికీ, ప్రజా ఉద్యమాల తీవ్రతను తగ్గించడానికి, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలను కాపాడడానికి నెహ్రూ కాంగ్రెస్ తరహా 'సోషలిజం'ను, గ్రామాభ్యుదయం వంటి నినాదాలను తెరపైకి తెచ్చాడు. సోషలిస్టు తరహా సహకార వ్యవసాయం అవసరమని పార్లమెంటులో 17వ రాజ్యాంగ సవరణ బిల్లు తెచ్చే ప్రయత్నం చేయగా చరణ్‌సింగ్, ఎన్.జి.రంగా లాంటి భూస్వామ్య శక్తులు ప్రతిఘటించడంతో ఆ బిల్లును ఉపసంహరించుకున్నారు.

ఇక రష్యా, చైనా అనుభవాలను చూస్తే సోషలిస్టు దేశంలో ప్రభుత్వ సహకారంతో, ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యంతో సోషలిస్టు చైతన్యంతో చేసిన సహకార వ్యవసాయానికి భారత పాలకులు ప్రవేశపెట్టే సహకార వ్యవసాయానికి పోలికే లేదు. సోషలిస్టు సహకార వ్యవసాయంలో ప్రభుత్వానికి, కో ఆపరేటివ్‌లకు మధ్య నిరంతర సమన్వయం వుంటుంది. ఉత్పత్తి, పంపిణీలపై నిరంతర పర్యవేక్షణ వుంటుంది. అదనపు ఉత్పత్తి ప్రజలకు పంపిణీ చేయబడుతుంది. ప్రజల వికాసానికి తోడ్పడుతుంది. మానవ శ్రమకు తోడ్పడే విధంగా యాంత్రీకరణ ప్రవేశ పెట్టబడుతుంది. అంతిమంగా మనిషి అభివృద్ధి వైపు పురోగమించే విధంగా సోషలిస్టు దేశాలలో సహకార వ్యవసాయం వుంటుంది. ఆ మేరకు కామ్రేడ్ మావో నాయకత్వంలో చైనాలో సహకార వ్యవసాయ క్షేత్రాలు ఏర్పాటు చేసి, అభివృద్ధి చేసి విజయం సాధించిన ఘటనలు చరిత్ర నమోదు చేసింది.

మహోపాధ్యాయుడు కామ్రేడ్ మావో మరణాంతరం డెంగ్ సియావో పెంగ్ అధికారానికి వచ్చిన తర్వాత క్రమంగా పెట్టుబడిదారీ సంస్కరణలు ప్రవేశపెట్టాడు. కో ఆపరేటివ్ వ్యవసాయంలో తలెత్తిన లోపాలను పరిష్కరించకుండా ప్రోత్సాహకాల పేరుతో, వ్యక్తి భాగస్వామ్యం పేరుతో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించాడు. వ్యవసాయంలో వచ్చిన అదనపు ఉత్పత్తి కొంతమంది వ్యక్తులపరమయింది. దీని పర్యవసానాలు, ఫలితాలు తప్పక సంక్షోభం వైపు తీసుకుపోతాయి. ప్రస్తుత ప్రపంచ వ్యాప్త ఆర్థిక సంక్షోభంలో అవి స్పష్టంగా కనిపిస్తూనే వున్నాయి.

నెహ్రూ ఏ పరిస్థితుల్లో సహకార వ్యవసాయాన్ని ప్రతిపాదించాడో మనం పైన చూశాం. నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చే సహకార వ్యవసాయం కంపెనీ వ్యవసాయం మాత్రమే. ఈ సహకార వ్యవసాయంలో రైతులు కాగితాలపై సభ్యులుగా, వాటాదారులుగా వుంటారు. భూమి కంపెనీ యాజమాన్యం కింద వుంటుంది. దానికి పెట్టుబడులూ, లాభాలు తప్ప రైతుల ప్రయోజనాలు వుండవు. బహుళజాతి సంస్థలు పెట్టుబడి లాభాలు తరలించుకుపోతాయి. వుత్పత్తి పంపిణీ విషయంలో ప్రజలకు చెందేది శూన్యం. అదనపు ఆదాయం కొన్ని కంపెనీల పరమవుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రపంచ బ్యాంకు మార్గదర్శకత్వంలో సంస్కరణలనూ, సూచనలను బరితెగించి అమలుచేస్తున్నది.

## భూ సంస్కరణలకు శాశ్వత సమాధి

దున్నేవారికే భూమి నినాదంతో సాగిన తెలంగాణ సాయుధ

పోరాటాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా అణచివేసింది. రెండవవైపు ప్రజా ఉద్యమాలను పక్కదారి పట్టించడానికి భూ సంస్కరణల చట్టం తెచ్చింది. భూ సంస్కరణల చట్టం మన దేశంలో ప్రహసనంగా మారింది. భూస్వాముల ప్రయోజనాలు దెబ్బ తినకుండా, అసలు మిగులు భూములు అనేవి లేకుండానూ, ఉన్నా తక్కువ వుండే విధంగా సీలింగ్ పరిమితులను అతి జాగ్రత్తగా నిర్వహించింది. పేదలకు చాలా తక్కువ భూములు పంచింది. సారవంతమైన భూములు భూస్వాముల చేతుల్లో వుండగా రాళ్లు, రప్పల భూములు, బీడు భూములు పేదలకు పంచింది. అవి కూడా తిరిగి భూస్వాముల చేతుల్లోకి పోయాయి.

భూసంస్కరణల వలన తూర్పు ఆసియా దేశాల్లో 25 నుండి 40 శాతం మిగులు భూములు పంపిణీ జరిగితే భారత దేశంలో రెండు శాతం భూమి కూడా పంపిణీ జరగలేదంటే భూసంస్కరణలు ఎంత ప్రహసనంగా మారాయో అర్థమవుతుంది. సమగ్ర భూసంస్కరణలు అమలు చేయాలనీ, రైతు కూలీ ప్రజాసంఘాలు నేటికీ ఆందోళనలు చేస్తున్నా చట్టం కాగితాలకే పరిమితమై వుంది.

ఇప్పుడు ప్రపంచ బ్యాంకు సంస్కరణల రెండవ దశ అమల్లో సెజ్‌లకూ, పారిశ్రామిక కారిడార్‌లకూ, గనుల ప్రాజెక్టులకూ, భారీ ప్రాజెక్టులకూ, ఐ.టి. పార్కులకు వందల వేల ఎకరాలు అప్పగించడానికి 'భూసంస్కరణల చట్టం, భూపరిమితి చట్టం' దళారీ పాలకులకు అవరోధంగా, 'అభివృద్ధి'కి ఆటంకంగా కనిపిస్తున్నాయి. అందుకోసం కాగితాలకు పరిమితమైన చట్టాలను కూడా పూర్తిగా రద్దు చేయాలనే ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయి. ఇందుకు అన్ని రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు ఆరాటపడుతున్నాయి.

ఇప్పటికే దేశంలో భూసంస్కరణల చట్టాన్ని అటకెక్కించి సెజ్‌లు, కారిడార్‌లు, కంపెనీ వ్యవసాయం పేరుతో లక్షల ఎకరాలను కార్పోరేట్ సంస్థలకూ, బహుళజాతి కంపెనీలకు పాలకులు అప్పగించారు. మౌళిక సదుపాయల పేరుతో ప్రభుత్వమే వేల కోట్ల రూపాయలు వారికి దోచి పెడుతున్నది. దీనికి అడ్డుగా వున్న పాత చట్టాలనూ, నిబంధనలను తుంగలో తొక్కి తను చేయాలనుకుంటున్న పని చేసుకుపోతోంది. సెజ్‌ల పేరుతో ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములను పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకుంది. దీనిపై అనేక ఆందోళనలు జరిగాయి. ఇప్పుడు ప్రభుత్వం చేయబోతున్న ఈ సహకార వ్యవసాయంలో కూడా సన్న చిన్నకారు రైతులేగాక ఇతర రైతులు కూడా భూములు కోల్పోతారు.

భూసంస్కరణలు అమలు చేయకపోగా సహకార వ్యవసాయం పేరుతో చిన్న, సన్నకారు రైతులు భూములతో పాటు అసైన్డ్ భూములు కూడా కంపెనీలకు అప్పజెప్పబోతున్నది. పేద ప్రజలకు నామమాత్రంగా లభించిన ప్రయోజనాలు కూడా భవిష్యత్‌లో కోల్పోయే ప్రమాదం వుంది. భూసంస్కరణల ద్వారా భూపంపకం జరిగినా చిన్న కమతాలుగా విడగొట్టాల్సి వస్తుందనే పేరుతో ప్రభుత్వ భూములు, మిగులు భూములు, దేవాలయ భూములు, తదితర పేద ప్రజలు సాగుచేసుకునే భూములను ప్రభుత్వం కంపెనీలపరం చేసే ప్రమాదం వుంది. దేశ ప్రజల ప్రయోజనాలకు భిన్నంగా భూసంస్కరణల చట్టాన్ని ఈ సహకార వ్యవసాయం శాశ్వతంగా భూస్థాపితం చేయబోతున్నది.

## రైతాంగ కర్తవ్యాలు

గ్రామీణ భారతంలో నూటికి డెబ్భై శాతం వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్న రైతాంగం నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు ప్రజా వ్యతిరేక ఆర్థిక సంస్కరణల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. ఎంతటి కష్ట నష్టాలకైనా ఓర్చి రైతాంగం తమకున్న కొద్దిపాటి భూములనే అంటిపెట్టుకొని జీవిస్తున్నారు. అటువంటి రైతాంగం యొక్క మౌలిక సమస్యలను పరిష్కరించకుండా వ్యవసాయంలో నష్టాలకు 'సహకార వ్యవసాయం' పేరిట కార్పోరేట్ వ్యవసాయాన్ని పరిష్కార మార్గంగా చూపుతూ ప్రభుత్వం మోసపూరిత ఎత్తుగడలు అవలంభిస్తున్నది. వీటిపట్ల మొత్తం రైతాంగం, రాష్ట్ర ప్రజానీకం అప్రమత్తంగా వుండాలి. ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గ ప్రయత్నాలను తీవ్రంగా ప్రతిఘటించాలి. సహకార వ్యవసాయ క్షేత్రాల ఏర్పాటు జీవోను వెంటనే వుపసంహరించుకోవాలని, సమగ్ర భూసంస్కరణలను అమలుజరిపి దున్నేవారికి భూమి పంచాలనీ, పేద, మధ్యతరగతి రైతాంగ (కౌలుదారులతో సహా) రక్షణకు, వ్యవసాయ రంగ రక్షణకు చర్యలు చేపట్టాలనీ, వ్యవసాయంలో సామ్రాజ్యవాద, బహుళజాతి కంపెనీల, కార్పోరేట్ కంపెనీల జోక్యాన్ని రద్దు చేయాలనీ, సబ్సిడీలతో వుత్పాదకాలను అందించాలనీ, రుణాలు, గిట్టుబాటు ధరలు, బీమా సౌకర్యం, మార్కెట్ సౌకర్యం, సాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతాంగం సమైక్యంగా పోరాడాలి. వారికి ప్రజలంతా అండదండగా నిలిచి కార్పోరేట్ వ్యవసాయం, సెజ్‌లు, కారిడార్‌లు, సహకార వ్యవసాయం పేరుతో భూములనూ, స్వదేశీ, విదేశీ బహుళజాతి సంస్థలకు ధారాదత్తం చేసి దేశంలోని గణనీయమైన రైతాంగ జనాభాను లేకుండా రూపుమాపేందుకు కుట్ర పన్నుతున్న ప్రభుత్వ దుర్మార్గ విధానాలకు వ్యతిరేకంగా సమరశీల పోరాటం నిర్వహించాలి.

వ్యక్తిగత ఆస్తి స్వభావం గల దోపిడీ వ్యవస్థలో సహకార విధానం అసాధ్యం. సమాజ శ్రేయస్సు, సమిష్టి ప్రయోజనాలకన్నా స్వంత ప్రయోజనాలనే పెంచి పోషించే దోపిడీ వ్యవస్థ ఉనికిలో వుండగా సహకారం అనేది ఒక ఎండమావి. ప్రజల స్వచ్ఛంద శ్రమ, భాగస్వామ్యం, సమిష్టి చైతన్యం వెల్లివిరిసే సోషలిస్టు వ్యవస్థలోనే సహకారం సజీవంగా విరజిల్లుతుంది. ★

# కోపెన్‌హెగెన్ సదస్సు సాధించినది శూన్యం

2009 డిసెంబర్ 7 నుండి 17 వరకు పదకొండు రోజుల పాటు 193 దేశాలకు చెందిన పదిహేను వేల మంది ప్రతినిధులు, నాలుగు వేల మంది జర్నలిస్టులు పాల్గొన్న ప్రపంచ పర్యావరణ సదస్సు ఎటువంటి ఒప్పందానికి రాకుండానే ఉసూరుమనిపించింది. ఐక్యరాజ్యసమితి జనరల్ సెక్రెటరీ బాన్‌కిమూన్ 2100 సంవత్సరం నాటికి భూగోళ ఉష్ణోగ్రత తీవ్రత 3 డిగ్రీల సెంటీగ్రేడ్ పెరుగుతుందనీ, దాని వలన తీవ్ర పరిణామాలు వుంటాయని ఆవేదన వ్యక్తం చేశాడు. బాలే కార్యాచరణకు, 1997 నాటి క్యోటో ప్రోటోకాల్ అమలుకు భిన్నంగా యు.ఎన్.ఎఫ్.సి.సి.సి. సూత్రాలకు వ్యతిరేకంగా కోపెన్‌హెగెన్ ముసాయిదా వుందని సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్ (సి.ఎస్.ఇ.) శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ముసాయిదాలోని అంశాలు అసమగ్రంగా వున్నాయనీ, క్యోటో విషయాల ప్రస్తావన లేదని అన్నారు. ప్రపంచంలో 200 దేశాలు వుండగా కేవలం అయిదు దేశాలు ఈ రకంగా ఒప్పందాలు చేసుకోవడమేమిటని నిరసన వ్యక్తం చేశారు. ఒబామా వ్యవహారశైలినీ, అర్ధరాత్రి బేసిక్ దేశాలతో (భారత్, దక్షిణ ఆఫ్రికా, చైనా, బ్రెజిల్) మంత్రాంగం ఏమిటనీ, బేసిక్ దేశాల మధ్యలోకి అర్ధాంతరంగా ఎటువంటి సమాచారం లేకుండా దూసుకురావడమేమిటని ఆశ్చర్యపోతున్నారు. అంతర్జాతీయ తనిఖీకి ఆమోదముద్ర వేయాలని ఒత్తిడి చేయడానికే ఒబామా అలా వ్యవహరించాడు. నిజానికి కోపెన్‌హెగెన్ సదస్సు కార్యక్రమ రూపకల్పనలో అమెరికా అధ్యక్షుడు ఒబామాకు ఎటువంటి సంబంధమూ లేదు. సదస్సులో జరిగిన చర్చలతీరు అమెరికాను కలవర పెట్టడంతో అప్పటికప్పుడు తన కార్యక్రమాలను మార్చుకొని కోపెన్‌హెగెన్‌కు వచ్చాడు. అనేక ఆర్థిక, రాజకీయ ఒప్పందాల ద్వారా తన చెప్పుచేతల్లో నడుస్తున్న భారత్, బ్రెజిల్, దక్షిణ ఆఫ్రికా దేశాల అండతో చైనాను కూడా ఒప్పించి సదస్సులో అనుకూల ఒప్పందం చేయించటానికి ఒబామా తీవ్ర ప్రయత్నం చేశాడు. ఇంత కష్టపడినా జి–77తో సహా పేద దేశాలన్నీ ఒప్పందం పేరుతో విడుదల చేసిన ముసాయిదాను వ్యతిరేకించాయి. భారత్ కూడా తీవ్రమయిన ప్రతిఘటనను ఎదుర్కొనవలసి వచ్చింది. జి–77 విచ్ఛిన్నమవుతుందా అనే పరిస్థితి కూడా వచ్చింది. చివరి రోజున ఉదయాన్నే 26 పారిశ్రామిక దేశాలు ప్రత్యేకంగా సమావేశమవడాన్ని కూడా సదస్సులో మిగిలిన దేశాలన్నీ వ్యతిరేకించాయి. ఒబామా చక్రవర్తిలా వ్యవహరిస్తున్నాడనీ, పేద దేశాలను కొనాలని చూస్తున్నాడనీ సూడాను, క్యూబా, బొలీవియా, వెనిజులా దేశాలతో సహా చాలా దేశాలు ఆగ్రహాన్ని వ్యక్తం చేశాయి. ఇది అత్యంత దారుణమైన ఒప్పందమనీ, ఆత్మాహుతి ఒప్పందమని మాట్లాడాయి. ఇంతకీ అందులో వున్నది మాత్రం 'పరిశీలించాలి' అన్నదే. 193 దేశాల అధినేతలు ఏకాభిప్రాయానికి రాలేకపోయినప్పటికీ గుడ్డిలో మెల్లలా ఆమోదించిన 'పరిశీలించాలి' అనే ఒప్పందంను భారత్‌తో సహా మూడు వర్ధమాన దేశాలు మాత్రమే ఆమోదించాయి. మిగిలిన అన్ని దేశాలు వ్యతిరేకించాయి. ప్రయాణాలను వాయిదా వేసుకుని విస్తృతంగా చర్చలు జరిపిన ఆ రాజకీయ ఒప్పందంలోని అంశాలు ఇవి:

1. ప్రపంచ పారిశ్రామికీకరణ తర్వాత భూతాపం రెండు డిగ్రీల సెంటిగ్రేడ్‌లకు పరిమితం చేయాలి. 2. ఉద్గారాల గరిష్ఠ సంవత్సరం ప్రకటించాలి. 3. ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలు, చర్యలు 2010 ఫిబ్రవరి నాటికి ప్రకటించాలి. 4. సార్వభౌమాధికారానికి విఘాతం కలుగనిరీతిలో అంతర్జాతీయ సంప్రదింపులు, విశ్లేషణలు చేపట్టాలి. 5. దీర్ఘకాల చర్యలకు పది వేల కోట్ల రూపాయలు, స్వల్పకాల చర్యలకు మూడు వేల కోట్ల రూపాయలు వర్ధమాన దేశాలకు ఇవ్వాలి.

ఈ ఒప్పందాన్నే 'ఫలవంతమైన చర్చలుగా' మన పర్యావరణశాఖ మంత్రి జైరాం రమేష్ సంతృప్తి వ్యక్తం చేశాడు. భారత్ వైఖరిని మాత్రం అనేక దేశాల నేతలు విమర్శించారు. అత్యధిక దేశాలు విమర్శించిన వాస్తవాన్ని కప్పిపెడుతూ ఏవో కొన్ని దేశాలు మాత్రమే వ్యతిరేకించాయనీ ప్రధాని ప్రత్యేక దూత శ్యామ్‌శరణ్ నమ్మబలుకుతున్నాడు. ప్రధాని మాట్లాడుతూ 'అమెరికా పారదర్శకంగా వుండాలని' విజ్ఞప్తి చేశాడు. అంటే అమెరికా పారదర్శకంగా లేదని పరోక్షంగా చెప్పడమే. పారదర్శకతలేని విషయాన్ని గొప్ప విషయంగా, భేషైన ఒప్పందంగా మాట్లాడడంలోనే మన పాలకుల కుటిలనీతి వుంది.

1977 నాటి క్యోటో ఒప్పందంలోని ముఖ్యమైన విషయాలు: 1. ఉద్గారాల తగ్గింపు బాధ్యత ప్రధానంగా అభివృద్ధి చెందిన దేశాలదే. 2. సాంకేతిక పరిజ్ఞానం ఇవ్వడం ద్వారా ఉద్గారాల తగ్గింపుకు అభివృద్ధి చెందిన దేశాలు తోడ్పడాలి.

ఈ స్ఫూర్తికి భిన్నంగా ఉద్గారాల తగ్గింపు బాధ్యతను వర్ధమాన దేశాలపై నెట్టివేయడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇవ్వకపోవడం, పైగా అంతర్జాతీయ పర్యవేక్షణను కోరడం ద్వారా ఆధిపత్యాన్ని కొనసాగించడం, క్యోటో ఒప్పందానికి తూట్లు పొడవడంతప్ప వేరుకాదు. ఇంతాచేసి భారత సార్వభౌమాధికారానికి నష్టం కలిగేలాగ అంగీకరించలేదని మన ప్రధాని మన్మోహన్‌సింగ్ నమ్మబలకడమేగాక గతంలో ప్రపంచ బ్యాంకు, ప్రపంచ వాణిజ్య సంస్థలతో చేసుకున్న ఒప్పందాలతో కూడా భారత సార్వభౌమాధికారానికి ఎప్పుడూ నష్టం

చేయలేదని దబాయిస్తున్నాడు. నిజానికి అమెరికన్ సామ్రాజ్యవాదంతో, ప్రపంచ ఆర్థిక సంస్థలతో చేసుకున్న ఒప్పందాలన్నీ భారతదేశ సార్వభౌమత్వానికి విఘాతం కలిగించేవే. మరికొన్ని విషయాల్లో ద్వైపాక్షిక సమావేశాల్లో (30 దేశాలతో విడి విడిగా) చేసుకున్న ఒప్పందాలు అంతర్జాతీయ ఒప్పందాలకు లోబడేలాగ మారిపోతున్నాయి. గతంలో అంతర్జాతీయ వేదికలపై కాదన్న అంశాలపై విడివిడిగా వివిధ దేశాలతో ఒప్పందం చేసుకోవడంతో పైకి ఎంతో పట్టుదలగా కనబడినా లోలోపల అనుసరించే లోపాయికారీ విధానాల వలన సామ్రాజ్యవాద ఎత్తుగడలకు భారతదేశ ఆర్థిక ప్రయోజనాలను అంతిమంగా రాజకీయ (సార్వభౌమాధికార) ప్రయోజనాలను బలిపెడుతున్నారు. కోపెన్‌హెగెన్ సదస్సులో ఇది మరింతగా బయల్పడింది.

2100 నాటికి భూగోళ ఉష్ణోగ్రత మూడు డిగ్రీలకు పెరిగితే రాబోయే పరిణామాలు ఎలా వుంటాయి? రుతువులు క్రమం తప్పిపోతాయి, భీకరమైన తుఫానులు, భయానక వరదలు, ఆమ్ల వర్షాలు సంభవిస్తాయి. 1960 నుండి 2002 నాటికి కార్బన్ వాయువుల విడుదల మూడు రెట్లు పెరిగింది. ప్రతి సెకనుకు వెయ్యి టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుంది. ప్రతిరోజూ 150 రకాల జీవ జాతులు అంతరించిపోతున్నాయి. వాతావరణంలో అసమతుల్యత ఏర్పడి గాలి, వెలుతురుల్లో మార్పులు కలుగుతున్నాయి. కరువు దుర్భిక్షాల కారణంగా తాగునీరు, సాగునీరు అడుగంటిపోవడంతో ప్రాణుల ఆకలి తీర్చే పచ్చదనం తరిగిపోతున్నది. కొత్త కొత్త, వింత వింత రోగాలు, మానసిక ఒత్తిడులు మొత్తంగా జీవరాశి మనుగడకే పెను ప్రమాదం ఏర్పడుతుంది. మంచు పర్వతాలు కరిగి సముద్ర మట్టం ఏడు మీటర్లు పెరుగుతుంది. మన దేశంలో తీర ప్రాంతంలో జీవిస్తున్న అయిదు కోట్ల మంది ప్రాణాలకు ప్రమాదం సంభవించవచ్చు, చిన్న చిన్న ద్వీపాలు మునిగిపోవచ్చు.

కాలుష్యాల విడుదలలో అమెరికాదే ప్రథమ స్థానం. తర్వాతి స్థానాలు కెనడా తదితర పారిశ్రామిక దేశాలవి. ఉదాహరణకు గత అరవై సంవత్సరాల కాలంలో 5 వేల 70 కోట్ల టన్నుల ఉద్గారాలను అమెరికా విడుదల చేసింది. పారిశ్రామికీకరణను ఆలస్యంగా ప్రారంభించిన చైనా 1 వేయి 570 కోట్ల టన్నులు, భారత్ 420 కోట్ల టన్నుల కాలుష్యాన్ని విడుదల చేశాయి. ఇందులో థర్మల్ విద్యుత్ వలన విడుదలయ్యే కార్బన్ కాలుష్యం శాతం అధికంగా వుంది. దీనికి ప్రత్యామ్నాయంగా చెబుతున్న అణువిద్యుత్ మరింత ప్రమాదకరం. ఒక్కో అణువిద్యుత్ కేంద్రం అణుబాంబుతో సమానం. అణుబాంబు సృష్టించే విధ్వంసం ఎంతగా వుంటుందోననడానికి నాగసాకీ, హిరోషిమాలు సజీవ తార్కాణాలు. రష్యాలో చెర్నోబిల్ ఘటన కూడా మనకు తెలుసు. 2050 నాటికి 5 లక్షల మెగావాట్ల అణువిద్యుత్ లక్ష్యాన్ని భారత ప్రధాని మన్మోహన్‌సింగ్ ప్రకటించాడు. దీని వల్ల భారతదేశం అణు వ్యర్థాల పెంటకుప్పగా మారుతుంది. దేశం అణుప్రమాదం వైపు ఎంత వేగంగా పరుగెడుతున్నదో మనం అర్థం చేసుకుని ప్రతిఘటించాలి.

భారతదేశం లాంటి సమశీతల ప్రాంతంలో ఎటువంటి వుద్గారాలులేని సౌర విద్యుత్ అపారంగా లభిస్తుంది. మనకు జలవనరులు అధికంగానే వున్నాయి. జల విద్యుత్ ఉత్పత్తిలో కూడా ఉద్గారాలు చాలా తక్కువగా వెలువడుతాయి. కావలసిన గాలి, మంచి వాతావరణం మనకు వుంది. పవన విద్యుత్తును కూడా తయారు చేసుకోవచ్చు. కావలసినంత సముద్రతీరం వుంది. అలల నుండి కూడా విద్యుత్‌ను తయారు చేయవచ్చు. జీవ ఇంధనాలు, భూగర్భ ఉష్ణశక్తి నుండి కూడా విద్యుత్తును పొందవచ్చు. ఇన్ని అనుకూలతలున్నా అణువిద్యుత్ వైపుకు వెళ్లడం ప్రమాదకరం.

'క్యోటో ఒప్పందాన్ని కొనసాగించాలి, వాతావరణాన్నేకాదు వ్యవస్థనే మార్చాలి' అనే నినాదాలు డెన్మార్క్ వీధుల్లో సదస్సు ప్రతినిధులను ఆకర్షించాయి. వెనిజులా అధ్యక్షుడు ఛావెజ్ లాంటి వాళ్లు 'వినాశకరమైన పెట్టుబడిదారీ వ్యవస్థ జీవితానికే చరమగీతం పాడుతుంది" అని వాఖ్యానించారు. అమెరికావాసులు ప్రతి ఒక్కరు యేటా 20 టన్నులకు పైగా ఉద్గారాలను విడుదల చేస్తున్నప్పటికీ 17 శాతం తగ్గించడానికి ఆ దేశం అంగీకరించింది. చైనాలాంటి తక్కువ ఉద్గారాలు (3.05 టన్నులు) విడుదల చేస్తున్న దేశాలు 40 శాతం తగ్గించడానికి, భారత్ (1.34 టన్నులు మాత్రమే) 20 శాతం తగ్గించటానికి ఒప్పుకున్నాయి.

అంతర్జాతీయ భద్రత, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భూగోళ వాతావరణం ప్రమాదంలో పడతాయని శలవిస్తున్న ఒబామా ఉద్గారాల తగ్గింపు విషయంలో మాత్రం వర్థమాన దేశాలకన్నా చాలా వెనుకబడే వున్నాడు. కోపెన్‌హెగెన్ సమావేశాలు అనుకున్న లక్ష్యాలను సాధించలేకపోవటానికి ఇదే ప్రధాన కారణం.

పారిశ్రామికీకరణ ప్రారంభం నుండి ఈనాటి వరకు జరిగిన పర్యావరణ విధ్వంసానికి (కాలుష్యానికి) ప్రధాన కారకులు అభివృద్ధి చెందిన దేశాలే. అభివృద్ధి చెందిన సాంకేతిక పరిజ్ఞానంతో పర్యావరణ రక్షణకు అవసర చర్యలు చేపట్టగల సామర్థ్యం, ఆర్థిక వనరులు వాటికి వున్నాయి. అణువిద్యుత్ కేంద్రాలు నెలకొల్పినా పరిరక్షించుకోగల స్థితిలో వున్నాయి. ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు పెద్ద మొత్తంలో ఆర్థిక సహకారాన్ని అందించగల స్థితిలో సంపన్న దేశాలున్నాయి.

*(మిగతాది 9వ పేజీలో...)*

# మాల్స్ నుండి స్కూల్సుకు తరలివస్తున్న కార్పోరేట్ పెట్టుబడులు విద్యార్థుల, టీచర్ల భవిష్యత్‌తో చెలగాటం

కిరాణా, పండ్లు, చెప్పులు, ఎలక్ట్రానిక్స్, దుస్తులు, ఔషధాలతో సహా అన్నిరకాల గృహోపకరణ సామాగ్రి లభించే రక రకాల మాల్స్ పేరుతో మహానగరాలు, పట్టణాలు, చిన్న చిన్న టౌన్లలోనూ పాగావేసిన దళారీ పెట్టుబడి, బహుళజాతి కంపెనీల పెట్టుబడులు ఇప్పుడు విద్యా రంగాన్ని ముంచెత్తుతున్నాయి. ఇప్పటికే ఈ పెట్టుబడులు విద్యారంగంలో వున్నాయి. కనుక విద్య ఇప్పటికే పేద ప్రజలకు అందని మానైంది. ఇక ఇప్పుడు విద్యారంగం భవిష్యత్ ఎలా వుండబోతుంది?

రిలయన్స్, యశ్‌బిర్లా, గోయెంకా గ్రూపు, జీ టెలీ, జెమ్స్ ఎన్‌రాన్‌తో సహా ఇంకా ఇతర సంస్థలు వేల సంఖ్యలో హైటెక్ స్కూళ్లను తెరవడానికి రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. దేశీయ సంస్థలతోపాటు విదేశీ సంస్థలు కూడా మిలియన్ల డాలర్ల పెట్టుబడులతో ఈ రంగంలో అడుగిడటానికి ఉత్సాహంగా వున్నాయి. పబ్లిక్ ఈక్విటీ సంస్థలు కోట్ల రూపాయల పెట్టుబడితో కోచింగ్ రంగంలో తమ పాగావేసేశాయి. ఈ పెట్టుబడి ఫ్రీ స్కూల్, కె-12 (కె.జి నుండి 12 వరకు) స్కూల్స్ నుండి సూపర్ స్పెషాలిటీ విద్యను భోదించే విశ్వవిద్యాలయాల వరకు విద్యకు సంబంధించిన ఏ విభాగాన్నీ విడువకుండా అన్నింట్లోకి ప్రవేశించనున్నది. ఈ పెట్టుబడులు మాల్స్ పేర రిటైల్ రంగంలో ప్రవేశించి తొమ్మిది కోట్ల మంది జీవనోపాధిని దెబ్బతీశాయి. ఈ భారీ మాల్స్ వ్యాపారంలో పోటీపడలేక దివాళాతీసి, ప్రత్యామ్నాయ ఉపాధిలేక అనేకమంది చనిపోయారు. ఈ పెట్టుబడులు ఏరంగంలో ప్రవేశించినా, ఆ రంగాన్ని మింగివేయడం వీటి సహజ లక్షణం. అటువంటి పెట్టుబడి విద్యారంగంలోకి ప్రవేశిస్తే విద్యావిధానం తీరు తెన్నులు ఎలా వుంటాయి? అసలు మన విద్యా విధానం పయనం ఎటువైపు? కార్పోరేట్ విద్యలో సామాన్య ప్రజల స్థానం ఎక్కడ?

సామ్రాజ్యవాదం ఆర్థిక మాంద్యంలో కూరుకుపోయి ఆయా ప్రభుత్వాలు ప్రకటించిన ఉద్దీపన ప్యాకేజీలలో ఇప్పుడిప్పుడే పట్టాలపైకి ఎక్కుతున్న ఆర్థిక వ్యవస్థలకు ఇంకా పూర్తి స్పష్టత కలుగలేదు. అవి కోలుకోవడానికి ఇంకా రెండు, మూడు సంవత్సరాలు పట్టవచ్చునని విశ్లేషకులు అంచనా వేస్తుంటే, మరోవైపు స్టాక్ మార్కెట్ కుదుపులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వణికిస్తూనే వున్నాయి. ఇటువంటి పరిస్థితులలో సామ్రాజ్యవాద, దళారీ నిరంకుశ వర్గానికి (ద్రవ్య పెట్టుబడి) మరింత లాభదాయకమైన రంగం కావాలి. నేడు అలాంటి రంగం విద్యారంగమే. ఈ రంగంలో మార్జిన్లు ఎక్కువగా వుంటాయి. మాంద్యం భయాలు అంతగా వుండవు (ఇప్పటి వరకు స్పెక్యులేటివ్ (జూద) మార్కెట్‌లోకి ప్రవేశించలేదుకదా) కాబట్టి విద్యను వ్యాపార సరుకుగా మారిస్తే లాభాలే... లాభాలు. ప్రస్తుత నయా ఉదారీకరణ విధానాల వలన, ద్రవ్య పెట్టుబడి ఎటుకదలటానికైనా ఎటువంటి అడ్డంకులూ లేవుకదా! ఎప్పుడైనా, ఎక్కడికైనా పోవటానికి తలుపులు తెరిచే వున్నాయి. కాబట్టి స్వేచ్ఛగా ఈ రంగంలో పాగా వేయడానికి దళారీ కాపిటల్ వస్తోంది.

నేడు భారీ పెట్టుబడులలో విద్య పూర్తి ప్రయివేటీకరణ వైపు ప్రయాణిస్తున్నది. కానీ ఈ ప్రయివేటీకరణకు అంకురార్పణ రాజీవ్ గాంధీ ప్రభుత్వ హయాంలో నూతన విద్యా విధానంతోనే జరిగింది. ఈ నూతన విద్యా విధానం ప్రవేశంతో పల్లె పల్లె, గల్లీ గల్లీలలో పుట్టగొడుగుల్లాగా కాన్వెంట్ స్కూల్స్ పుట్టుకొచ్చాయి. రెసిడెన్షియల్ కాలేజీలు, ప్రయివేట్ ఇంజనీరింగ్, మెడికల్, ఐ.టి., వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విశ్వవిద్యాలయాలు, కోచింగ్ సెంటర్స్ లెక్కకు మిక్కిలిగా వెలిశాయి. ఈమధ్యకాలంలో అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు కూడా వచ్చాయి. ఆంధ్రప్రదేశ్‌లో వై.ఎస్. ప్రభుత్వం 18 యూనివర్సిటీలకు అనుమతిచ్చింది. (వీటికి భూమి, ఇంకా ఇతర మౌలిక సదుపాయాల కల్పన బాధ్యత ప్రభుత్వాలదే అనే విషయం మర్చిపోవద్దు). ఈ విద్యా సంస్థలలో విద్య భారీ అమ్మకపు సరుకుగా మారి సామాన్యులకు అందని ద్రాక్ష చందంగా మారింది. ఒకవైపు ఉచిత నిర్బంధ విద్య, అందరికీ విద్య అనే ప్రచారాలతో ప్రభుత్వం ప్రజలను ఊదరగొడుతూనే వుంది. 'స్వాతంత్ర్యా'నంతరం అందరికీ విద్యను ప్రాథమిక హక్కుగా గుర్తించింది. అందరికీ విద్యను అందించడానికి 6-14 సంవత్సరాల పిల్లలకు నిర్బంధ ఉచిత విద్య అంటూ దళిత, వెనుకబడిన కులాలకు, ఆదివాసీలకు సంక్షేమ హాస్టళ్లు ఏర్పరిచి రిజర్వేషన్లు కల్పించి విద్యావంతులను చేసే విధానాలను చాలా కొద్దిమేరకే అయినా ప్రభుత్వాలు అనుసరించాయి. (దీని అమలులోని లోటుపాటుల్లోకి వెళ్లడం ఈ వ్యాసం ఉద్దేశ్యంకాదు). అయితే సామ్రాజ్యవాదం నూతన ఆర్థిక విధానాలలో భాగంగా సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమలులోకి తెచ్చినప్పటి నుండి ప్రభుత్వాలు వ్యయాలు తగ్గించుకోవాలనే పేరుతో మెల్ల మెల్లగా సంక్షేమ రంగాల నుండి తప్పుకుంటూ వస్తున్నాయి.

అందులో భాగంగా మన దేశంలో కూడా ప్రభుత్వాలు విద్యా రంగంలోకి ప్రయివేటు సంస్థలను అనుమతించి, ప్రభుత్వ హాస్టళ్లను తగ్గించడం, స్కూళ్లను తగ్గించడం, టీచర్ల రిక్రూట్‌మెంట్ ఆపివేయడం చేసింది. మరోవైపు ప్రతిభ పేరుతో గురుకుల ఆశ్రమ పాఠశాలలను పెట్టింది. ఇంకోవైపు ప్రయివేట్, ప్రభుత్వ ఉమ్మడి యాజమాన్యంలో స్కూల్స్ పెట్టి, విద్యను క్రమ క్రమంగా సరుకుగా మార్చింది. ప్రభుత్వ విద్యను అటకెక్కించింది.

ప్రభుత్వ విద్య నామమాత్రం కావడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు క్షీణిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాలలో విద్య అంటేనే చులకన భావం ఏర్పడింది. ఎంత ఖర్చయినా ప్రయివేట్ స్కూళ్లలో తమ పిల్లలను చదివించటం హోదాకు చిహ్నంగా మారింది. మరోవైపు ప్రభుత్వ రంగంలో వ్యాపించిన అవినీతి, బాధ్యతారాహిత్యం (ఇవి నేడు విశ్వవ్యాపితం)తో పాఠశాలలు అంతంత మాత్రంగా నడుస్తున్నాయి. మారుమూల గ్రామాలలో ప్రాథమిక పాఠశాలలు దాదాపుగా మూతపడే వుంటాయి. ఆదివాసీల కోసం, వికాసం కోసం ఏర్పాటుచేసిన పాఠశాలలు అసలు నడువనే నడువవు. పాఠశాలకు హాజరు కాకుండానే ఎక్కువ మంది టీచర్లు నెలవారీ జీతాలు ఎంచక్కాగా జేబుల్లో వేసుకుంటారు. ఒడిషా రాష్ట్రంలోనైతే పాఠశాలలకై వేసిన రేకు షెడ్డులు దాదాపు గొడ్లచావిడిలుగా మారాయి. ఒకవైపు ప్రభుత్వ విధానాలు విద్యను నీరుకార్చుతూ వుంటే, మరోవైపు యంత్రాంగంలోని బాధ్యతారాహిత్యంతో ప్రభుత్వ విద్య కుంటుపడింది.

ప్రభుత్వ విద్య పరిస్థితి అలావుంటే, ప్రభుత్వం ప్రతిరోజూ ప్రసార సాధనాల్లో ప్రతి కార్యక్రమానికి ముందూ, వెనుకా "పాపా బాబూ బడికి–అమ్మా, నాన్నా పనికి, బడి బాట బడి బాట ఇది సర్వశిక్ష అభియాన్ సందేశం" అంటూ ప్రచారం పేరుతో, పిల్లలు విద్యావంతులు కాకపోవడానికి తల్లిదండ్రులను దోషులుగా నిలబెడుతున్నది. ప్రతి సంవత్సరం సంక్షేమ హాస్టళ్లను ఎత్తివేస్తూ, విద్యపై బడ్జెట్ నిధులను తగ్గిస్తూ ప్రభుత్వ విద్యను గాలికి వదిలి ప్రయివేట్ సంస్థలకు నిచ్చెన మెట్లుగా మారుతూ విద్య అందరి ప్రాథమిక హక్కు అంటుంది. విద్యారంగంలోకి కార్పొరేట్ పెట్టుబడులకు స్వాగతం పలుకుతుంది. విద్యలోకి కార్పొరేట్ ప్రభువుల ఆగమనం చూద్దాం.

రిలయన్స్ గ్రూప్ ఇప్పటికే జామ్‌నగర్, సూరత్, వడోదర, ముంబై, నాగోథోనే, పాతాళగంగలో స్కూళ్లు నడుపుతున్నది. అయితే ఇవి ప్రధానంగా తమ కంపెనీల్లో పనిచేస్తున్న ఉద్యోగుల, స్థానికుల అవసరాలు తీర్చడానికే ఏర్పాటుచేశారు. ప్రస్తుతం ఈ మోడల్స్‌ను వాణిజ్య స్థాయికి విస్తరించాలనేది వీరి యోచన. జీ టీవి వ్యవస్థాపకుడు సుభాష్‌చంద్ర వచ్చే మూడు నాలుగేళ్లలో 350 కోట్ల రూపాయలతో మూడు వందల స్కూళ్లను ఏర్పాటుచేసే సన్నాహంలో వున్నాడు. ఇప్పటికే ఈ గ్రూపు కిడ్స్ పేరుతో 275 నగరాలలో ప్రీ స్కూల్స్‌ను నిర్వహిస్తున్నది. ఇంక ఐ.టి., టి.వి., ఫిల్మ్ రంగాల్లో శిక్షణ, యానిమేషన్ శిక్షణ కేంద్రాలను నిర్వహిస్తున్నది. యశ్‌బిర్లా గ్రూపు 2012 నాటికి రెండు వందల ప్రీ స్కూల్స్‌ను, వంద కె–12 స్కూల్స్‌ను, పదిహేను సూపర్ స్పెషాలిటీ కాలేజీలను, ఇరవై టీచర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్లను ఏర్పాటు చేయటానికి 500 కోట్ల రూపాయల పెట్టుబడి పెట్టనున్నట్లు ప్రకటించింది. ఇప్పటికే ఇది గ్లోబ్‌టంటర్ పేరుతో ప్రీస్కూల్స్‌ను నిర్వహిస్తున్నది.

దుబాయ్ సంస్థ గ్లోబల్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (జెమ్స్) హర్యానాలో ఇటీవలే స్థానిక రియాల్టీ సంస్థతో కలిసి భారీ హైటెక్ స్కూల్స్‌ను ప్రారంభించింది. దాదాపు భారత్‌లో ఏడు స్కూల్స్ నిర్వహిస్తున్న ఈ సంస్థకు ఆఫ్రికా, బ్రిటన్, గల్ఫ్ దేశాల్లో స్కూల్స్ వున్నాయి. ఎవరాన్ ఎడ్యుకేషన్ లిమిటెడ్ వచ్చే కొద్దియేళ్లలో రెండు వందల కె–12 స్కూల్స్, అయిదు వందల స్కిల్స్ డెవలప్‌మెంట్ సెంటర్స్, పది ఇంజనీరింగ్ కాలేజీలు, ఇరవై ఏడు బిజినెస్ స్కూల్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. మేనేజ్‌మెంట్ విద్యకు సంబంధించిన కోచింగ్ సంస్థ "టైమ్" ఇప్పటికే తృష్ణ పేరుతో ప్రీస్కూల్స్ నిర్వహిస్తున్నది. ఈ సంస్థ కూడా పెద్దయెత్తున పాఠశాల విద్యలోకి విస్తరించే ప్రయత్నాల్లో వుంది. ఐ.ఐ.టి. కోచింగ్ సంస్థ ఫిట్జ్ దేశవ్యాప్తంగా యాభై అధునాతన స్కూల్స్‌ను ప్రారంభించే సన్నాహాల్లో వుంది.

ఇటీవలి కాలంలో ప్రయివేట్ ఈక్విటీ సంస్థలు భారీ ఎత్తున విద్యా రంగంలో పెట్టుబడులు పెట్టాయి. అయితే వీటి పెట్టుబడులు ప్రధానంగా కోచింగ్ రంగంలోనే పెట్టాయి. కోచింగ్ సంస్థలపై ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణ వుండదు కాబట్టి పబ్లిక్ ఈక్విటీ (పి.ఇ.)లు అటువైపు మొగ్గుచూపుతున్నాయి. ముంబైకి చెందిన ప్రయివేట్ పి.ఇ. సంస్థ మ్యాట్రిక్స్ పార్టనర్, ఢిల్లీకి చెందిన ఐ.ఐ.టి. కోచింగ్ సంస్థ ఫిట్జ్‌లో 16 శాతం వాటా కోసం వంద కోట్లమేర పెట్టుబడి పెట్టింది. ఫ్రాంక్లిన్ టెంపుల్‌టన్ అనే పి.ఇ. రాజస్థాన్‌లోని కోటా కేంద్రంగా పనిచేస్తున్న కెరియర్ పాయింట్‌లో 50 కోట్ల రూపాయలమేర పెట్టుబడి పెట్టింది. ఢిల్లీకి చెందిన కెరియర్ లాంచర్ అనే మరో సంస్థలో ఇంటెల్ క్యాపిటర్ మరో 50 కోట్లమేర పెట్టుబడి పెట్టింది. హెల్ఫిక్ పి.ఇ. ఫండ్ ముంబైకి చెందిన మహేష్ ట్యుటోరియల్స్‌లో 60 కోట్ల రూపాయలతో 30 శాతం వాటాల్ని తీసుకుంది. ఇదే ఈ– లెర్నింగ్ సొల్యూషన్స్‌లో మరో 50 కోట్ల పెట్టుబడి పెట్టింది. రెండు సంవత్సరాలక్రితమే ఇంగ్లీషు భాష శిక్షణా సంస్థ వేటాలో ఎస్.ఎ.ఐ.ఎఫ్. ఫార్వర్డ్ అనే సంస్థ కోటి డాలర్లమేర పెట్టుబడి పెట్టింది. వందల కోట్ల రూపాయల పెట్టుబడులతో కార్పోరేట్ సంస్థలు, పబ్లిక్ ఇష్యూలు

ఇబ్బడి ముబ్బడిగా విద్యా రంగంలో వచ్చాయి. ఇంకా రావటానికి సన్నాహాలు చేస్తున్నాయి. అంటే వీటిలో మార్జిన్లు ఎంత వుంటాయో ఊహించుకోవచ్చు. మొత్తంగా నేడు ప్రయివేట్ విద్యా రంగంలోకి 40 శాతం మార్జిన్లు ప్రభుత్వ రంగంలో 25 శాతం మార్జిన్లు ఎక్కడికీ పోవని విశ్లేషకుల అంచనా. వీరు విద్యారంగంలోకి రావటంలో మరొక కారణం కూడా వుంది. ఇప్పటివరకు ప్రయివేట్ విద్యా సంస్థలు చారిటబుల్ ట్రస్ట్‌ల కింద నమోదు చేసుకుని ఆదాయపు పన్ను నుండి మినహాయింపు పొందుతున్నాయి. ప్రస్తుతం వీటిపై పన్ను విధించాలనే చర్చ వున్నా, ఒకవేళ పన్ను విధించినా అది మళ్లీ విద్యార్థులపైనే వేయవచ్చు.

మరి మొత్తంగా చూస్తే ఇవి విశ్వవిద్యాలయాలు, ఐ.టి. రంగాలలో, కోచింగ్ రంగంలో ప్రధానంగా వస్తున్నాయికదా అన్పించవచ్చు. కాని అవి ప్రీస్కూల్స్ నుండి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల్లోకి రావటానికి సర్వ సన్నాహాల్లో వున్నాయి. కొన్ని ప్రవేశించాయి కూడా. వీటి ఆగమనానికి ప్రభుత్వం కూడా సుముఖంగానే వుంది. విద్యారంగాన్ని ఒంటిచేత్తో విస్తరణ చేయడం సాధ్యంకాదు కాబట్టి ప్రయివేట్ భాగస్వామ్యం తప్పనిసరి అని కొత్త నమూనాను ప్రకటించటానికి రంగం సిద్ధం చేస్తుంది. అంతేకాదు కంపెనీ చట్టంలోని 25కు సవరణచేసి దుకాణాల స్థాయిలో పాఠశాలల ఏర్పాటుకు వీలు కల్పించాలనే యోచనలో కూడా వుంది. ప్రభుత్వ పెట్టుబడులతో కలిస్తే అవసరమైన మౌలిక సదుపాయాలు, అనుమతులు అన్నీ అదే కల్పిస్తుంది. అంతేకాకుండా కొద్ది పెట్టుబడి చేతుల్లో వుంటే సరిపోతుంది. మిగతాది బయటి నుండి సమీకరించుకోవచ్చు. కాబట్టి ఏమాత్రం బాధలేకుండా కోట్ల లాభాలతో జేబులు నింపుకోవచ్చు. కార్పొరేట్ విద్యలో 'అందరికీ విద్య' అనే లక్ష్యం ఎక్కడ? విద్యారంగాన్ని కార్పొరేట్ బాబుల చేతుల్లో పెడ్తూ, మరోవైపు పేదలను విద్యావంతులనుచేసే లక్ష్యానికి తమ ప్రభుత్వం కట్టుబడి వుందని ప్రచారం చేసుకుంటున్నది. విద్య సరుకుగా మారినప్పటి నుండి నేటివరకు చూస్తే విద్యావ్యయం రోజు రోజుకూ పెరుగుతూ వస్తున్న విషయం మనం చూస్తున్నదే. నేడు ఇంటర్నేషనల్ స్కూలు బోర్డు వున్న స్కూల్‌లో చదివిస్తే కేజీ నుండి 12వ తరగతి వరకూ దాదాపు కోటి రూపాయలు ఖర్చవుతున్నట్లు చెబుతున్నారు. మరి ఆపై చదువులకు ఒక్కొక్క సంవత్సరానికి లక్షల్లో ఖర్చు వుంటుంది. మరీ ఇంత ఖర్చుపెట్టి పిల్లలను చదివించగలిగిన స్తోమతు ఏ వర్గానికి వుంటుంది. ఇప్పటి వరకు మధ్యతరగతి వర్గం ఏదో ఒకమేరకు తమ పిల్లలను ప్రయివేట్‌గా చదివించగలిగే పరిస్థితి వుండేది. మరి ప్రస్తుత మాంద్యంలో ఉన్నత మధ్యతరగతి కూడా తమ ఉద్యోగాలు కోల్పోయి ఉపాధి ప్రశ్నార్థకంగా మారిన పరిస్థితులలో సాధారణ మధ్యతరగతి, ఉన్నత మధ్యతరగతి వర్గపు పిల్లలు కూడా విద్యకు దూరమవుతున్న పరిస్థితే నేడు కన్పిస్తున్నది. ఇక ప్రీస్కూల్స్ కూడా కార్పోరేటీకరించ బడుతున్నాయి కదా! ప్రీ స్కూల్స్‌ను ప్రయివేటీకరించాలనే యజ్ఞం ఈనాటిదికాదు. పదేళ్లకు ముందు నుంచే అంగన్‌వాడీలు, బాల్వాడీలను ప్రయివేటీకరించే జరుగుతున్నాయి. ఇప్పటివరకు అంగన్‌వాడీలు, బాల్‌వాడీలు గ్రామాలలో పేద వాళ్ల వీధులలో వుండి పేద పిల్లలకు పౌష్టికాహారం, విద్యను అందించేవి. దీని ద్వారా పేద పిల్లలకు ఏదో ఒకమేరకు పోషకాహారం, ఆలనా పాలనా దొరికేది. కొద్దిమంది పేద వాళ్లకు జీవనోపాధి లభించేది. ఈ హైటెక్ ప్రీస్కూలు అంగన్‌వాడీ ఉద్యోగుల జీవనోపాధిని హరిస్తాయి. మరోవైపు పేద పిల్లలకు అందే పోషకాహారము అంగట్లో సరుకుగా మారి ఉన్నతవర్గాల పిల్లలకు అందుతుంది. ఇప్పటికే పోషకాహార లేమితో తనువులు చాలిస్తున్న పేద పిల్లల మరణాల శాతం మరింతగా పెరుగుతుంది.

విద్యను ధనిక వర్గాలకు మినహా అందరికీ దూరం చేస్తూ, మరోవైపు పేద విద్యార్థుల చదువులను ప్రభుత్వం పట్టించుకుంటుందనీ, ప్రధానమంత్రి 15 సూత్రాల పథకంలో భాగంగా మెరిట్ స్కాలర్‌షిప్‌లు, కోచింగ్ ఫండ్సు పేద విద్యార్థులకు అందించి వారి చదువులు ఆగిపోకుండా ఆపద్బాంధవుడిలా ఆదుకుంటున్నదనీ ప్రచార హోరుతో అదరగొడుతుంది. ఇక పేద విద్యార్థులు నిశ్చింతగా వున్నత విద్యను అభ్యసించవచ్చు అంటుంది. కాని కోట్లకు పెరిగిపోతున్న విద్యావ్యయంలో ఎంత ప్రభుత్వం భరిస్తుంది? ఎంత మందికి ఇస్తుందనేది ప్రశ్నేకదా! అంగన్‌వాడీలను మూసివేసే ప్రయాణంలో వుండి చిన్న పిల్లలు అంగన్‌వాడీలకు, పెద్ద పిల్లలు స్కూలుకు అని కూడా ప్రచారం చేస్తున్నది. ఈ ప్రచార హోరులో తాను రాజమార్గంలో విద్యను కార్పోరేటీకరిస్తున్న విషయాన్ని ప్రజల చైతన్యంలోకి రాకుండా చేస్తుంది. విద్యారంగం ఎటుపోతే మనకేమి మనకు ప్రభుత్వ పథకాలు ఉన్నాయనే భ్రమలలో ప్రజలను ముంచెత్తుతున్నది. విద్య పేద, మధ్య తరగతి వర్గాలకే కాక ఉన్నత మధ్యతరగతికి కూడా దూరమవుతున్న వాస్తవాలను మరుగుపరుస్తుంది. ఈ విద్య కార్పోరేటీకరించబడటంలో నేడు ప్రయివేట్ రంగంలో వున్న వేలాది చిన్న మధ్య ప్రయివేట్ స్కూల్స్ అన్నీ మూతపడటం ఖాయం. అందులో టీచర్లుగా, ఇంకా ఇతర బాధ్యతలలో వున్న ఉద్యోగస్తులందరు నిరుద్యోగులవుతారు. కొద్దిమంది మాత్రం ఈ కార్పొరేట్ సంస్థలలో చదువుకున్న కూలీలుగా మారి మేధో దోపిడీకి గురవుతారు. విద్యలో కూడా పోలరైజేషన్ జరుగుతుంది.

కార్పోరేటీకరించబడుతున్న విద్య స్పెక్యులేటివ్ మార్కెట్‌లోకి వచ్చే క్రమం మొదలైంది. పెట్టుబడుల సేకరణకు స్పెక్యులేషన్ మార్కెట్‌లోకి వచ్చిన విద్య స్టాక్ మార్కెట్ జూదంలో విద్యార్థుల భవిష్యత్‌తో జూదం ఆడుతుందనటంలో సందేహమేమీ వుండాల్సిన అవసరంలేదు. ★



# వందేళ్ల భూంకాల్ వారసత్వాన్ని కొనసాగిస్తాం!

## గ్రీన్‌హంట్‌ను తిప్పికొడతాం!!

### ప్రతిన పూనిన దండకారణ్య వీర ప్రజానీకం

ఈ ఫిబ్రవరి 10 నుంచీ 16 వరకూ దండకారణ్య విప్లవ ప్రజానీకం వందేళ్ల 'భూంకాల్' వారాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకున్నారు. ఆదివాసీ పోరాట చరిత్రలోనూ, దండకారణ్య పోరాట చరిత్రలోనూ 'భూంకాల్'కు అత్యంత ప్రాధాన్యత వుంది. మొత్తంగా మన దేశ పోరాట చరిత్రలోనూ దీనికి చాలా ప్రాధాన్యత వుంది.

దేశవ్యాప్తంగా ఆదివాసీలకు సంపద్వంతమైన పోరాట చరిత్ర వుంది. దండకారణ్య ఆదివాసీలు సైతం తమ వీరోచిత పోరాటతత్వంతో నూతన అధ్యాయాలు జోడించి ఈ చరిత్రను సుసంపన్నం చేశారు. మౌర్య వంశ సామ్రాజ్య విస్తారకుడు, యుద్ధోన్మాది అయిన అశోకుడు చేసిన భీకర యుద్ధంలో లక్ష మంది ప్రజలు చనిపోగా, లక్షన్నర మంది ప్రజలు క్షతగాత్రులయ్యారని చరిత్ర చెబుతుంది. ఏరులుగా పారిన నెత్తురును చూసి చలించిపోయిన అశోకుడు యుద్ధాన్ని ఆపివేశాడని కూడా పాలకుల చరిత్ర చెబుతుంది. అయితే పురోగమిస్తున్న అశోకుడి రథ చక్రాలను అడ్డుకున్నది దండకారణ్యం వీర ప్రజానీకమే! పాలకులు చెప్పే చరిత్రలో ఈ వాస్తవం తొక్కిపెట్టబడినా శిలా శాసనాల్లో దీనికి ఆధారాలున్నాయి.

1774 నుండి 1910 వరకూ దండకారణ్యంలోని విశాల బస్తర్ ప్రాంతంలో పది పెద్ద తిరుగుబాట్లు జరిగాయి. 1824 నుండే ఇక్కడ బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తిరుగుబాట్ల పరంపర ప్రారంభమైంది. బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా జరిగిన ఆదివాసీ పోరాటాల్లో ప్రథమ స్థానం దండకారణ్య ఆదివాసీలదేననడం ఎంత మాత్రమూ అతిశయోక్తి కాదు. ఇటువంటి పోరాటాలకు 1910లో ప్రజా రాజ్య స్థాపన లక్ష్యంతో జరిగిన 'భూంకాల్' తలమానికం వంటిది. అయితే అణగారిన వర్గాలు సృష్టించిన చరిత్రను పాలకవర్గాలు లిఖిత చరిత్రగా నమోదు కానీయలేదు, లేదంటే వక్రీకరించాయి. కొందరు చరిత్రకారులు వీటిని లిఖిత చరిత్రలో నమోదు చేసినా, వాటిని ప్రచారం కాకుండా పాలకవర్గాలు అడ్డుకున్నాయి. అందుకే వీరోచితంగా జరిగిన భూంకాల్ గురించి దండకారణ్యేతర ప్రజానీకానికి తెల్సింది చాలా తక్కువ. దేశవ్యాప్తంగా ప్రచారం కావాల్సి వుండిన 'భూంకాల్' మాడ్ కేంద్రంగా జరిగింది. అయితే ఈ 'మాడ్'ను ప్రభుత్వం అబూర్ఝ్ మాడ్‌గా వ్యవహరిస్తుంది. 'అబూర్ఝ్' అంటే 'తెలియని' లేదా 'అర్థం కాని' అని అర్థం. వందేళ్ల క్రితమే ఇంత పెద్ద పోరాటానికి కేంద్రంగా వుండిన ఈ ప్రాంతం ప్రభుత్వానికి తెలియని ప్రాంతం ఎలా అవుతుంది? ఈ ప్రాంతం ఉనికినే ప్రయత్నపూర్వకంగా విస్మరించే పాలకవర్గాలు ఇక ఈ ప్రాంతపు చరిత్రను ఎలా వెలుగులోకి రానిస్తాయి? అయితే పాలకవర్గాలు తొక్కిపట్టిన ఈ చరిత్ర ఇక్కడి ప్రజానీకంలో మాత్రం విస్తృత ప్రచారంలో వుంది. ఒక తరం నుంచి మరో తరానికి మౌఖికంగానే ఇది అందించబడుతోంది. ప్రస్తుతం ఇక్కడ కొనసాగుతున్న విప్లవోద్యమం, ఈ ప్రాంతపు గత చరిత్రను కూడా లిఖితపరుస్తోంది. ఈ క్రమంలోనే 'అబూర్ఝ్' అనే అవమానకరమైన విశేషణాన్ని తీసిపారేసి 1999 నుండి 'మాడ్'గా వ్యవహరిస్తున్నది. ఈ ప్రభావంతో ప్రస్తుతం బూర్జువా మీడియా సైతం 'మాడ్'గానే వ్యవహరిస్తున్నది.

భూంకాల్ అంటే విస్తృత ప్రకంపన అనీ, సామూహిక తిరుగుబాటు అనీ అర్థం. బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడిందిది. 1854 నాటికి బస్తర్ పూర్తిగా బ్రిటీష్ వాళ్ల ప్రత్యక్ష పాలనలోకి వెళ్లిపోయింది. ఈ పాలనలో బస్తర్ ఆదివాసీలు విపరీతమైన పీడనకు గురయ్యారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు రూపొందించిన నూతన అటవీ చట్టాలు ఈ అడవి బిడ్డలకు, అడవి మీదున్న జన్మహక్కును హరించివేశాయి. రకరకాల పన్నుల భారంతో వీరి జీవితాలు ఉక్కిరి బిక్కిరయ్యాయి. నూతనంగా రంగ ప్రవేశం చేసిన అబ్కారీ శాఖ ఈ పీడనను మరింత పెంచింది. ఈ దోపిడీ పాలనను నిరాటకంగా కొనసాగించడం కోసం పోలీసు వ్యవస్థ బలోపేతమయింది. పన్నులు, శిక్షలు, జైళ్లు, అత్యాచారాలు ఆదివాసీల జీవితాల్లో విడదీయలేని భాగమయ్యాయి.

స్వేచ్ఛా జీవులైన ఆదివాసీలు సహజంగానే ఈ పీడనను వ్యతిరేకించారు. " వారికి (ఆదివాసీలకు) ఈ కొత్త అటవీ చట్టాలు గానీ, పోలీసుల జోక్యంగానీ, పాఠశాలలు గానీ, వెట్టి చాకిరి గానీ నచ్చలేదు. తమ జీవన పద్ధతుల్లో ప్రవేశపెట్ట బడుతున్న మార్పు గురించి బస్తర్‌లో ఎల్లెడలా ప్రజానీకం చర్చించుకుంటున్నారు. వీటన్నింటిపైన, అడవిపైన తమకు అనుల్లంఘనీయమైన హక్కు వుందనీ, ఇందులో ఎటువంటి జోక్యమైనా సరే తమకు గిట్టబోదని

ఈ అడవి బిడ్డలు–ఆదివాసీలు– భావిస్తున్నారు. అడవులపై సర్వాధికారాలు తమవేనని ఈ విషయంలో జోక్యం కలుగ జేసుకునే హక్కు ఎవరికీ లేదని వారు భావిస్తున్నారు" అని ఆనాటి బ్రిటీష్ వున్నతాధికారి స్లైడెన్ అన్న మాటలను చూస్తే నాటి బ్రిటీష్ అణచివేత, ప్రజల వ్యతిరేకతా, రెండూ అర్థమవుతాయి. ఈ నేపథ్యంలోనే అణచివేత తిరుగుబాటుకి తప్పక దారితీస్తుందనే సత్యాన్ని చాటుతూ బస్తర్ ప్రజానీకం 'భూంకాల్'ను చారిత్రక రంగంపైకి తెచ్చారు. బ్రిటీష్ పాలనను అంతం చేసి ప్రజా రాజ్యాన్ని స్థాపించడమే 'భూంకాల్' లక్ష్యంగా వుండింది.

'భూంకాల్'కు తగిన సన్నాహాలు చేయడం కోసం 1909 అక్టోబర్‌లో ఏర్పాటు చేసిన సభలో భూంకాల్‌ను ప్రకటించారు. గుండాదూర్, అయితు మహరా వంటి మాంజీ, ముఖియాలు ఇందులో పాల్గొన్నారు. కుటుంబ కలహాలతో అధికారానికి దూరమైన రాజ కుటుంబీకులు లాల్ కాలేంద్ర సింగ్ (మాజీ దివాన్), రాణీ సుబరన్ కుంవర్ తదితరులు కూడా ఈ సభలో పాల్గొన్నారు. వేలాది మంది ప్రజలు గుండాదూర్‌ను తమ నేతగా ఎన్నుకున్నారు. నాడు బస్తర్‌లో 84 పరగణాలు వుండేవి. ఇందులోని 48 పరగణాల్లో భూంకాల్ వీరోచితంగా జరిగింది. భూంకాల్‌ను విజయవంతంగా నడపడానికి ప్రతీ పరగణాకు విడి విడిగా నాయకులను ఎన్నుకున్నారు.

ఈ సభలో లాల్ కాలేంద్రసింగ్, రాణి సుబరన్ కుంవర్ తదితర నేతలు ఆదివాసీల చారిత్రక వీర పోరాటాలను శ్లాఘించారు. రాణి సుబరన్ కుంవర్ " ఆంగ్లేయుల నమ్మిన బంటు అయిన ప్రధాని (దివాన్)కి వ్యతిరేకంగా మీరు వెంటనే పోరాటం ప్రారంభించండి. వారి ఉద్యోగులందరినీ బయటకు గెంటండి. వారంతా బస్తర్ ప్రజా శత్రువులు. వారు వారి స్వభావరీత్యానే బస్తర్‌ను తుడిచి పెడుతున్నారు. వీరి పోషకులైన ఆంగ్లేయ రాజులను మట్టిగరిపించండి" అని వుద్వేగంగా మాట్లాడింది.

భూంకాల్‌కు సంబంధించిన సమగ్రమైన యుద్ధ పథకం అత్యంత పకడ్బందీగా తయారైంది. శత్రువుకు అంతుపట్టకుండా పూర్తి రహస్యంగా అది ప్రజల్లోకి పోయింది. వారి యుద్ధ పథకంలోని ముఖ్యాంశాలు:

1. బస్తర్‌ను కబ్జా చేసిన వలసవాదులపై వారికి అంతుపట్టని వేగంతో ఆకస్మిక దాడులు చేయాలి. ప్రజా దాడులు శత్రువును ఊపిరి సలుపుకోనీయకూడదు.
2. దేశంలోని యితర ప్రాంతాలతో బస్తర్‌ను కలిపే కమ్యూనికేషన్ (టెలిఫోన్, టెలిగ్రాఫ్, పోస్టల్) వ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలి.
3. పొరుగు ప్రాంతాలతో బస్తర్‌ను కలిపే రోడ్లను నష్టపరచాలి. దీనితో బ్రిటీష్ వాడి సైన్యాల రాకను అడ్డుకోవాలి.
4. ముందు నుండే ప్రభుత్వోద్యోగులను ఖైదీలుగా బంధించి పెట్టుకోవాలి. అవసరమైనపుడు వారిని యుద్ధ ఖైదీలుగా చూపే అవకాశాన్ని వినియోగించుకోవాలి. ఖైదీలు ప్రతిఘటిస్తే వారిని హతమార్చాలి.

1910 జనవరిలో తాడోకిలో మరోసారి సభ జరిగింది. నేల తల్లి విముక్తికి తమ ప్రాణాలనూ, ఆస్తులను తృణ ప్రాయంగా అర్పిస్తామని ప్రజలంతా ఈ సభలో ప్రతిజ్ఞ చేశారు. తాడోకిలోని దేవి మందిరంలో పూజింప బడిన అనంతరం ఒక కటార్ (కత్తి వంటిది) ప్రజల చేతికి వచ్చింది. ఈ కటార్ ఒకరి చేతి నుండి మరొకరి చేతికీ, ఒక ఊరునుండి మరొక వూరికీ, ఒక పరగణా నుండి మరొక పరగణాకు మొత్తం 48 పరగణాలు శత్రువు దృష్టిలో పడకుండా యుద్ధ సందేశాన్ని అందిస్తూ ప్రయాణించింది. ఇది ప్రయాణించిన గ్రామాలన్నీ కదనరంగంలో కదం కలిపాయి.

ఫిబ్రవరి 1న జగ్దల్‌పూర్‌పై దాడితో భూంకాల్ ప్రారంభమైంది. జగ్దల్‌పూర్ దివాన్‌ను చంపాలనే ఉద్దేశ్యంతో ఇక్కడ దాడి చేయగా దివాన్ తప్పించుకున్నాడు. ఇక్కడ వందలాది సేనలను భూంకాల్ యోధులు చంపేశారు. విదేశీయులను తన్ని తరిమేశారు. రోడ్లను దిగ్బంధించి బయటి ప్రపంచంతో సంబంధాలను తెంచివేసి జగ్దల్‌పూర్ మాదేనని ప్రకటించారు.

ఫిబ్రవరి 2న చింగ్‌పాల్ బజార్‌పై దాడి చేసి వశపరుచుకున్నారు. ఫిబ్రవరి 4న కుకనార్ బజార్‌పై దాడి చేశారు. 5న కరంజి, మారెంగ, తోకపాల్‌లపై దాడి చేశారు. ఫిబ్రవరి 7 అత్యంత చారిత్రక దినం. గీదంలో గుండాదూర్ తదితరుల నాయకత్వంతో జరిగిన సభలో గీదం కేంద్రంగా మాడియా రాజ్యం ఏర్పడిందని ప్రకటించారు. ఇదే రోజు రాణి సుబరన్ కుంవర్ "బస్తర్‌లో నేటితో బ్రిటీష్ రాజ్యం అంతమైంది. ఈ రోజు మనమంతా తిరిగి మన రాజ్యాన్ని ఏర్పరుచుకోవడానికి ప్రతిన బూనుదాం" అని ప్రకటించింది. ఈ ప్రకటన వెలువడిన వెంటనే తిరుగుబాటుదారుల చేతికి వచ్చిన తొలి కేంద్రం గీదం. ఇలాంటి మరెన్నో కేంద్రాల్లో తమ అధికారాన్ని నెలకొల్పాలని ఈ ప్రకటనకు జోడించారు.

ఈ ప్రకటన బస్తర్ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. ప్రజా వీరుల దాడులు మరింత ఉధృతమయ్యాయి.

ఫిబ్రవరి 8న కుటృపై దాడి చేసి ప్రజల అధికారాన్ని నెలకొల్పారు. 9న దంతెవాడపై దాడి చేశారు. ఇదే రోజు కువ్వకొండలో ముగ్గురు పోలీసులను చంపేశారు. ఇదే రోజున మాడ్‌లో కమాండర్ దూరి (మాడ్‌లో రగులుతున్న పోరాటాన్ని అణచివేయడానికి నియమితుడైన ఇంగ్లీష్ అధికారి) సేనపై దాడి చేసి ఒక హవల్దార్‌ను చంపేశారు.

భూంకాల్‌లో ముఖ్య భూమికను పోషించిన చోటా డోంగర్, కుతుల్ గ్రామాలపై దాడి చేసి కుతుల్‌లోని పోలీసు స్టేషన్‌ను తగులబెట్టారు. అందులోని పోలీసులందరినీ చంపేశారు. ఇలా అప్రతిహతంగా భూంకాల్ పురోగమిస్తూ మద్దేడ్, భూపాల్ పట్నం, జేగురుగొండ, ఊసూరులపై దాడి చేశారు. ఇలా జగ్దల్‌పూర్ మినహా మొత్తం బస్తర్ భూంకాల్ వీరుల చేతికొచ్చింది. మొత్తంగా 40 రోజులు ప్రజా రాజ్యాధికారం కొనసాగింది.

భూంకాల్‌ను అణచివేయడానికి నాటి బ్రిటీష్ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగించింది. కేవలం సాంప్రదాయక ఆయుధాలతో పోరాడుతున్న ప్రజలపైకి ఆధునిక సాయుధ బలగాలను ఉసిగొల్పింది. సెంట్రల్ ప్రోవిన్స్‌కు చెందిన రెండు వందల సాయుధ బలగాలు, మద్రాస్‌కు చెందిన డిప్యూటీ సూపరింటెండెంట్ పిళ్లై నాయకత్వాన 150 మంది సాయుధ బలగాలు, మేజర్ బ్లోయిస్ జాన్సన్ నాయకత్వంలో 70 మంది బలగాలు, 22వ బెటాలియన్‌కు చెందిన పంజాబ్ హంతక దళాలే కాక జబల్‌పూర్, విశాఖపట్నం, జైపూర్ (ఒడిషా), నాగ్‌పూర్‌ల నుండి సాయుధ బలగాలు బస్తర్‌లో దిగాయి.వీటితో పాటు రాయ్‌పూర్ నుండి వచ్చిన 150 మంది పోలీసు బలగాలు కల్సి వున్నాయి.

ఈ పాశవిక సాయుధ బలగాలు 'భూంకాల్'ను అణచివేయడంలో భాగంగా, పోరాడే ప్రజలపై విచక్షణా రహితంగా హింసను ప్రయోగించాయి. భూంకాల్ వీరులు ఎన్నో చోట్ల ఈ బలగాలతో వీరోచితంగా తలపడ్డారు. చోటే డోంగర్, కుతుల్, జగదల్‌పూర్‌లలోనూ, జగదల్‌పూర్ సమీపంలోని ఖడక్ ఘాట్, నేతనార్, ఆల్‌నార్‌లలోనూ భూంకాల్ వీరులు వీరోచిత యుద్ధానికి తలపడ్డారు. అయితే ఆధునిక ఆయుధాలతో తలపడలేక ఎందరో వీరులు నేలకొరిగారు. ఎన్నోచోట్ల నెత్తురు ఏరులై పారింది.

ఈ పోరాటంలో పెద్ద ఎత్తున హత్యాకాండకూ హింసకూ గురైన గ్రామాల్లో మాడ్‌లోని నేల్‌నార్ ఒకటి. గుర్రాలపై వచ్చిన ఇంగ్లీష్ వాళ్లు ఈ గ్రామాన్ని చుట్టు ముట్టి చాలామందిని కాల్చి చంపారు. గర్భవతులను పొట్టలు కోసి చంపారు. ఎలుకలను కొయ్యకు గుచ్చి కాల్చినట్టుగా, పసిపిల్లల్ని కొయ్యకు గుచ్చి కాల్చేవారనీ ప్రజలు ఇప్పటికీ ఆవేదనతో చెప్తుంటారు. ఈ గ్రామం పక్కన గుహలో దాగిన ప్రజలను సజీవంగా కాల్చి చంపారు. ఈ హత్యాకాండలో కాలువలు గట్టిన రక్తంలో ఇంగ్లీష్ వాళ్లు ఒక మర్రి మొక్కను నాటి ఈ చెట్టు బతకకుండా చచ్చిపోతే పోరాటం కూడా పూర్తిగా నాశనం అవుతుందని చెప్పారట. కానీ నాటి పోరాటవీరుల రక్తంలో నాటిన ఆ మొక్క వీరుల త్యాగాలకు సాక్షిగా, పెరిగి, పెద్దదయి, మహావృక్షమై భవిష్యత్ విజయాలకు హామీగా, నేటికీ నిలిచి వుంది.

1910 మార్చి 29న సోను మాంజీ అనే విద్రోహి ఇచ్చిన సమాచారంతో బ్రిటీష్ ప్రభుత్వ సేన ఆల్‌నార్ గ్రామంలో విశ్రాంతి తీసుకుంటున్న భూంకాల్ వీరులపై దాడి చేసింది. ఈ దాడిలో అనేక మంది చనిపోయారు. మరెందరో గాయపడ్డారు. ఈ దాడి నుంచి గుండాదూర్ తప్పుకున్నాడు. మరెప్పుడూ ఆయన శత్రువు చేతికి చిక్కలేదు.

ప్రభుత్వ రికార్డులు చెప్తున్న లెక్కల ప్రకారం, భూంకాల్ సమయంలో మొత్తం 78 మందిని బ్రిటీష్ ప్రభుత్వం అరెస్ట్ చేసి రాయ్‌పూర్ జైల్లో పెట్టింది. వీరిలో అయిదుగురికి జీవిత ఖైదును విధించింది. వీరిలో 27 మంది జైల్లోనే అమరులయ్యారు. లాల్ కాలేంద్రసింగ్, రాణీ సుబరన్ కుంవర్‌లు కూడా జైల్లోనే మృత్యువాత పడి అమరులుగా చరిత్రలో నిలిచిపోయారు.

ఈ పాశవిక నిర్బంధకాండ మూలంగా భూంకాల్ ఓటమికి గురయింది. అయితే ఈ ప్రజల్లోని స్వేచ్ఛా కాంక్ష ఓడిపోలేదనడానికి నేడు బస్తర్ కేంద్రంగా జరుగుతున్న దండకారణ్య విప్లవ పోరాటాలే నిదర్శనం. తెలియని ప్రాంతంగా పాలకవర్గాలు మరుగుపర్చాలనుకున్న మాడ్ ప్రాంతం, నేడు దేశ సరిహద్దులను దాటుకొని ఎందరికో తెల్సిన ప్రాంతం అయిందంటే ప్రజల్లోని ఈ స్వేచ్ఛా కాంక్షనే కారణం. భూంకాల్ వారసత్వం కొనసాగుతున్నదనడానికి ఇంత కంటే నిదర్శనం లేదు.

ఈ ప్రజల్లోని స్వేచ్ఛా కాంక్షకు శాస్త్రీయ సైద్ధాంతిక అవగాహనను అందించి పోరులో కదిలిస్తున్న మావోయిస్టు పార్టీ గతంలో జరిగిన ఆదివాసీ వీరోచిత పోరాటాలన్నింటికీ చరిత్రలో సముచిత స్థానాన్ని కల్పించడానికి కృషి చేస్తున్నది. అందులో భాగంగా ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 10న భూంకాల్ దినాన్ని సమరోత్సాహంతో జరుపుకోవాలని 2004లో ప్రజలకు పిలుపునిచ్చింది. అప్పటి నుండీ ప్రతీ సంవత్సరం దండకారణ్య వ్యాప్తంగా విప్లవ ప్రజానీకం భూంకాల్ దివస్‌ను జరుపుకుంటున్నారు. భూంకాల్‌కు వందేళ్లు నిండిన సందర్భంగా భూంకాల్ వారాన్ని జరుపుకోవాలనే పార్టీ పిలుపు మేరకు ప్రజలంతా అత్యంత స్ఫూర్తి దాయకంగా భూంకాల్ వారాన్ని జరుపుకున్నారు. విప్లవోద్యమం బలంగా వున్న అటవీ ప్రాంతంలోనే కాక జగదల్‌పూర్ పట్టణంలోనూ ముప్పయి వేల మంది ప్రజలతో, ఫిబ్రవరి 10న పెద్ద ఎత్తున ప్రదర్శన, సభ జరగడం అనేది విశేషంగా చెప్పుకోతగింది.

నాడు బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భూంకాల్ ఎక్కుపెట్టబడింది. అయితే నేడు అనేక సామ్రాజ్యవాద దేశాలు దండకారణ్యాన్ని కొల్లగొట్టడానికి పథక రచన చేస్తున్నాయి. ఈ దోపిడీకి

⇨

# చలి మరణాలకు బాధ్యులెవరు?

ఈ చలి కాలం దేశ వ్యాప్తంగా దాదాపు 500 మంది ప్రాణాలను బలి తీసుకుంది. ఎండా కాలం వడదెబ్బకీ, వానా కాలం వరదల దెబ్బకి ప్రాణాలు పోవడం ఇప్పటికే సహజమైన విషయమే అయింది. చలి కాలంలో ఇన్ని ప్రాణాలు పోవడం కొన్ని దశాబ్దాల కాలంలో ఇది మొదటిసారి కావచ్చు. హిమాలయ ప్రాంతాల నుంచి వీచిన చలి గాలుల వల్ల ఈ జనవరిలో దేశంలోని పలు రాష్ట్రాలు వణికి పోయాయి. కొన్ని రాష్ట్రాలు గడ్డ కట్టుకుపోయాయి. సహజంగానే వుత్తర భారతం విపరీతంగా చలి ప్రభావానికి గురైంది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా, హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ, జమ్మూ-కాశ్మీర్‌లలో మంచు కురిసి ప్రజల జీవితం నరకప్రాయం అయింది. పంజాబ్, హర్యానా, ఉత్తర ప్రదేశ్‌లలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 2-8 డిగ్రీల మధ్య నమోదు కాగా, హిమాచల్‌ప్రదేశ్, జమ్మూ-కాశ్మీర్‌లలో మైనస్‌కు పడిపోయాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ ఉష్ణోగ్రత 11-17 డిగ్రీలకు పడిపోయి కొన్ని ప్రాణాలు గడ్డకట్టుకు పోయాయి.

ఐరోపా, అమెరికా దేశాల్ని కూడా చలి తీవ్రంగా వణికించింది. చైనాను గత ఆరు దశాబ్దాల్లో ఎరుగని మంచు తుఫాను ముంచెత్తింది. మంగోలియాలో మైనస్ 40 డిగ్రీలకు ఉష్ణోగ్రతలు పడిపోయాయి.

మొత్తంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలను వణికించిన చలి వేల సంఖ్యలో మానవ ప్రాణాలనూ, లక్షల సంఖ్యలో పశు పక్షాదులను పొట్టన పెట్టుకుంది.

పొగ మంచు కమ్మేసి పరిసరాలు కనబడక రోడ్డూ, రైలూ, విమాన సర్వీసులకు కొన్ని రోజులపాటు తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. పలు రోడ్డూ, రైలు ప్రమాదాలు కూడా చోటు చేసుకున్నాయి. నదులు గడ్డకట్టడం వల్ల ప్రపంచ వ్యాప్తంగా పలు విద్యుత్ కేంద్రాలు మూతపడ్డాయి. మన దేశంలోనూ హిమాచల్ ప్రదేశ్‌లో నదులూ, సరస్సులు గడ్డకట్టుకుపోయి జల విద్యుత్ ఉత్పత్తి దారుణంగా పడిపోయింది. అమెరికాలో న్యూజెర్సీ అణు విద్యుత్ కేంద్రం మూతపడిపోయింది. ఈ రకంగా చలి ఆర్థిక వ్యవస్థలను కూడా కుదిపేసింది.

నిజానికి ఎండా, వానా, చలిల నుండి రక్షించుకునేంతగా మానవ విజ్ఞానం ఎప్పుడో ఎదిగింది. ఆ మేరకు మానవులు ప్రకృతిని ఎప్పుడో జయించారు. అయితే ఎదుగుతున్న మానవ విజ్ఞానం ప్రకృతిని రోజు రోజుకూ మరింతగా అర్థం చేసుకుంటూ, దాన్ని మానవ మనుగడకు మరింతగా వినియోగించుకునే మార్గంలో ప్రయాణించకుండా, తమ స్వార్థ ప్రయోజనాల కోసం ప్రకృతిని ధ్వంసం చేస్తూ తమ వినాశనాన్ని కొని తెచ్చుకొనే మార్గంలో ప్రయాణిస్తోంది.

పెరుగుతోన్న భూ తాపమే ఈ విపత్తుకు కారణమని శాస్త్రజ్ఞులు తెలియజేశారు. పరిశ్రమలు ఉత్పత్తి చేస్తున్న ఉద్గారాలు పారిశ్రామికీకరణలో భాగంగా జరుగుతున్న అడవుల నాశనం, ప్రకృతి విధ్వంసం వల్ల భూ తాపం విపరీతంగా పెరిగిపోతున్నది. ఇటీవల కోపెన్‌హేగెన్‌లో పర్యావరణంపై జరిగిన సదస్సు సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఈ విషయాలన్నీ చర్చనీయాంశాలు అయ్యాయి. పెట్టుబడిదారీ దేశాలు ఇదే మార్గంలో ప్రయాణిస్తే ప్రపంచ భవితకు పెను ముప్పు వాటిల్లక తప్పదు.

పెట్టుబడిదారీ దేశాలు, మొత్తంగా దోపిడీ వర్గాలు అనుసరిస్తున్న వైఖరి వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నది ఒక అంశమైతే, ఈ వైపరీత్యాల వల్ల ఎవరు బలవుతున్నారు అనేది మరొక అంశం. ధనిక దేశాల స్వార్థ ప్రయోజనాలకు అత్యధికంగా బలవుతున్నది పేద దేశాలే, పేద దేశాల్లోనూ పేద ప్రజలేనన్నది నిర్వివాదాంశం.

మన దేశం విషయానికి వస్తే చలి ప్రభావం విపరీతంగా వున్నప్పటికీ ఇంత మంది ప్రాణాలు పోవాల్సిన అవసరం లేదు. తలదాచుకోవడానికి పక్కా ఇళ్ళు, వంటిని కప్పుకోవడానికి వెచ్చని దుస్తులు వుంటే ఇంత మంది ప్రజలు చనిపోయేవారే కాదు. తలదాచుకోను గూడు లేక పేవ్‌మెంట్ల మీద బతుకులు ఈడ్చే వాళ్లే ఈ చలికి ఎక్కువగా బలయిపోయారు. ఈ విధంగా ఇవన్నీ పేదరికం వల్ల సంభవించిన మరణాలే. పేదరికం వల్ల ఇన్ని ప్రాణాలు రాలిపోతూవున్నా పాలకులు మాత్రం దేశం అభివృద్ధి పథంలో పయనిస్తోన్నదని నిస్సిగ్గుగా గొప్పలు చెప్పుకుంటూనే వున్నారు. ప్రకృతి వైపరీత్యాల నుండి రక్షించుకోవాలంటే ప్రకృతితో సజావుగా, శాస్త్రీయంగా వ్యవహరించాలి. దోపిడీ వర్గాలకు ఈ శాస్త్రీయ దృక్పథం వుండడం ఎన్నటికీ సాధ్యం కాదు. కనుక ప్రకృతి వైపరీత్యాల నుండి కాపాడుకోవాలంటే కూడా దోపిడీ వర్గాలను కూల్చడం తప్ప మరో మార్గం లేదు. ★

---

⇨

ఇక్కడి ఆదివాసీ ప్రజలు ఆటంకంగా వున్నారు. కనుక ప్రస్తుతం గ్రీన్‌హంట్ పేరుతో ఇక్కడ ఆదివాసీ హననానికి పాల్పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వందేళ్ల భూంకాల్‌ను జరుపుకున్న దండకారణ్య విప్లవ ప్రజానీకం తమ ఉనికిని హరిస్తున్న సామ్రాజ్యవాద శక్తులనూ, దాని తొత్తులైన భారత పాలక వర్గాలను నిర్మూలించే లక్ష్యంతో మరో భూంకాల్‌కు సిద్ధం అవుతామని ప్రతిజ్ఞ చేశారు. ★

రెక్టిఫికేషన్ క్యాంపెయిన్‌లో భాగంగా అధ్యయనం కోసం - 7

# నేర్చుకోవడంలో నైపుణ్యం

**డిసెంబర్ 1936**

ఎర్రసైన్యాన్ని ఎందుకు నిర్మించుకున్నాం? శత్రువులను ఓడించడానికి యుద్ధ సూత్రాలు మనం ఎందుకు అధ్యయనం చేయాలి? యుద్ధంలో వాటిని అన్వయించడానికి.

నేర్చుకోవడం అంత సులభమైంది కాదు. దానిని ఆచరణలో అన్వయించడం అంతకంటే కష్టమైంది. చాలా మంది పాఠశాలల్లోనూ, పుస్తకాల్లోనూ మిలిటరీ శాస్త్రంపై చర్చ జరిగేటప్పుడు బాగా రాణిస్తారు. కానీ వాస్తవ పోరాటం దగ్గరకు వచ్చేటప్పటికి కొంత మంది విజయాలు సాధిస్తారు, కొంత మంది ఓడిపోతారు. యుద్ధ చరిత్ర, యుద్ధంలో మన అనుభవం దీనినే రుజువుపరిచాయి.

కనుక ఇందులో కీలక సమస్య ఏంటి?

వాస్తవ జీవితంలో 'ఎప్పుడూ విజయాలు సాధించే సేనానుల' కొరకు ఎదురుచూడకూడదు. చరిత్రలో అలాంటివారు చాలా తక్కువగానూ, అరుదుగానూ లభిస్తారు. ధైర్యస్తులయిన సూక్ష్మ బుద్ధిగల సాధారణంగా యుద్ధంలో విజయాన్ని సాధించగలిగిన తెలివి, ధైర్యం సమ్మిళితం చేయగల సేనానుల కొరకు మాత్రమే మనం వెతకాలి. తెలివితేటలూ, ధైర్యం రెండూ వుండాలంటే నేర్చుకోవడంలోనూ, నేర్చుకున్నది అన్వయించడంలోనూ క్రమ పద్ధతి అనుసరించాలి.

ఆ పద్ధతి ఏమిటి? శత్రువు పరిస్థితిని గురించిన అన్ని అంశాలను అర్థం చేసుకోవాలి. ఇరువురి యుద్ధ చర్యలకు సంబంధించిన సూత్రాలను కనిపెట్టాలి. వాటిని మన కార్యాచరణలో వుపయోగించుకోవాలి.

'పరిస్థితులనుబట్టి సూత్రాలను జాగ్రత్తగా అన్వయించడం' యొక్కా ఓటమి సందర్భంలో తీసుకోవల్సిన చర్యల యొక్క ఆవశ్యకతను అనేక దేశాల మిలిటరీ మాన్యుయల్స్ స్పష్టపరుస్తున్నాయి. సూత్రాలను గుడ్డిగా అన్వయించడం ద్వారా స్వీయాత్మకంగా చేసే తప్పుల గురించి కమాండర్‌ను హెచ్చరించడానికి మొదటి విషయం చెబుతున్నారు. స్వీయాత్మక తప్పుల వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితిని తట్టుకోవడానికి భౌతిక పరిస్థితుల్లో అకస్మాత్తుగా, నివారించడానికి వీలుగాని మార్పుల వల్ల ఉత్పన్నమయ్యే పరిస్థితులను తట్టుకోవడానికి రెండవ విషయం చెప్పబడింది.

స్వీయాత్మక తప్పులు ఎందుకు జరుగుతాయి? ఒక యుద్ధంలో గానీ, అందులోని ఒక పోరాట రంగంలో గానీ మిలిటరీ బలగాల విభజన, వాటి నిర్వహణ నిర్దిష్ట కాలం, స్థలం యొక్క పరిస్థితులకు తగ్గట్టుగా లేకపోవడం వల్లనూ, భౌతిక పరిస్థితులకు స్వీయాత్మక యుద్ధ నిర్వహణకు సమన్వయం కుదరనందువల్లనూ మరొక మాటలో చెప్పాలంటే స్వీయాత్మక పరిస్థితులకు, భౌతిక పరిస్థితులకు మధ్య వైరుధ్యం పరిష్కరించబడకపోవడం వల్ల స్వీయాత్మక తప్పులు సంభవిస్తాయి. ఎవరికైనా అటువంటి పరిస్థితులు తప్పవు. కొంతమంది మిగతా వారికంటే ఎక్కువ సామర్థ్యంతో అటువంటి పరిస్థితులను ఎదుర్కొని పరిష్కార మార్గాలు కనుగొంటారు. ఇతర పనుల్లోలాగే యుద్ధంలో కూడా ఉన్నత స్థాయి శక్తి సామర్థ్యాలు అవసరం. యుద్ధంలో ఎక్కువ విజయాలనూ, తక్కువ ఓటములనూ ఆశిస్తాం. భౌతిక పరిస్థితులకు స్వీయాత్మక పరిస్థితులకు మధ్య సరైన సమన్వయం వుండడమనేది ఇక్కడ కీలక సమస్య.

ఎత్తుగడల్లో ఒక ఉదాహరణ తీసుకోండి. శత్రు సైన్యం పక్క భాగంలో, ఒక స్థలంలో దాడి చేయదల్చుకున్నప్పుడు, సరిగ్గా ఆ స్థలం శత్రువు యొక్క బలహీన స్థలం అయినప్పుడు, ఆ దాడి విజయవంతం అవుతుంది. అంటే ఇక్కడ భౌతిక పరిస్థితికీ, స్వీయాత్మక పరిస్థితికి సమన్వయం కుదిరిందన్నమాట. అంటే స్థావరాల గురించి ముందుగా కమాండర్ సేకరించిన సమాచారం, అతని అంచనా, నిర్ణయం, శత్రువు యొక్క వాస్తవ పరిస్థితికీ, శత్రు బలాలు మొహరించిన పరిస్థితికి తగ్గట్టుగా ఉన్నాయన్నమాట. దాడి చేయదల్చుకున్న స్థలం మరొకటి అయినప్పుడు, లేక శత్రు స్థావరంలో అది కేంద్ర స్థానం అయినపుడు ఆ దాడి విఫలమై తీరుతుంది. అపుడు భౌతిక పరిస్థితికీ, స్వీయాత్మక పరిస్థితికీ సమన్వయం కుదరలేదన్నమాట. సరైన సమయంలో దాడి జరిగితే రిజర్వు సైన్యాన్ని తొందరపడి ముందుగా గానీ, లేక ఆలస్యంగా గానీ ఉపయోగించడం గాకుండా, సకాలంలో ఉపయోగించగలిగితే ఆ పోరాటంలో మిగతా పరిస్థితులన్నీ శత్రువుకు కాకుండా మనకు ఉపయోగపడితే మొత్తం యుద్ధంలో భౌతిక పరిస్థితికి స్వీయాత్మక మార్గదర్శకత్వానికి సమన్వయం కుదిరిందన్నమాట. రెండు పక్షాలు సజీవులైన, సాయుధులైన మానవులతో వ్యవహరించవలసి వుంది. ఒకరి రహస్యం మరొకరికి తెలియదు. అందువల్ల భౌతిక పరిస్థితులకూ, స్వీయాత్మక పరిస్థితులకు, నూటికి నూరుపాళ్లు సమన్వయం కుదరడం చాలా అరుదుగా మాత్రమే జరుగుతుంది. రోజువారీ విషయాలతో లేక ప్రాణంలేని వస్తువులతో, వ్యవహారం ఇందుకు పూర్తిగా భిన్నమైంది. అయినా

# సంపాదించడం ముఖ్యం

- మావో

కమాండర్ దర్శకత్వం ప్రధానాంశంలో భౌతిక పరిస్థితులకు సరిపోయేలాగుంటే, అంటే దర్శకత్వంలోని ప్రధానాంశాలకూ, వాస్తవ పరిస్థితులకు మధ్య సమన్వయం కుదిరితే విజయానికి పునాది ఏర్పడిందన్నమాట.

ఒక కమాండర్ తన సైన్యాలను వివిధ వైపుల మొహరింప చేయడం అనేది అతని సరైన నిర్ణయాలపై ఆధారపడి వుంటుంది. అతని సరైన నిర్ణయాలు, సరైన అంచనాలపై ఆధారపడి వుంటాయి. సరైన అంచనాలు, అవసరమైన గూఢచారి చర్యలపైనా, వాటి ద్వారా సేకరించిన సమాచారాన్ని కూర్చుకోవడం పైన ఆధారపడతాయి. శత్రు పక్షం వైపు 'సమాచారం సేకరణకు అన్ని రకాల పద్ధతులు అవలంభించాలి. శత్రు పక్షం నుండి సేకరించిన సమాచారాన్ని గురించి జాగ్రత్తగా ఆలోచించుకోవాలి. పనికి రాని అంశాలు తోసివేసి ముఖ్యమైన అంశాలు తీసుకోవాలి. అవాస్తవిక విషయాలు తోసివేసి వాస్తవ విషయాలు తీసుకోవాలి. ఒకదాని నుండి ఇంకొక దానిని బయటి విషయాల నుండి లోపలి విషయాలను పరిశీలించాలి. అప్పుడు స్వంత పక్షంలోని పరిస్థితులను అంచనాలోకి తీసుకోవాలి. రెండు పక్షాల వైపు పరిస్థితులనూ, వాటి పరస్పర సంబంధాలను అధ్యయనం చేయాలి. కమాండరు దానిపై ఆధారపడి సరైన అంచనాలు వేసుకుంటాడు. వాటిపై సరైన నిర్ణయాలు తీసుకుంటాడు. వీటిపై ఆధారపడి ప్లానులు తయారు చేసుకుంటాడు. ఒక కమాండరు వ్యూహాత్మక ప్లాను తయారు చేసుకోవడంలో కానీ, ఒక పోరాటానికి సంబంధించిన ప్లాను తయారు చేసుకోవడంలో గానీ పై విధానాన్నంతా అనుసరించాలి. ఈ పద్ధతి అనుసరించకుండా మిలిటరీ అధికారి తన స్వంత వ్యూహాలపై ఆధారపడి తన మిలిటరీ ప్లాను తయారు చేసుకుంటే, అవి ఊహాగానంపై ఆధారపడినవి తప్ప వాస్తవ పరిస్థితులపై ఆధారపడినవి మాత్రం కావు. కేవలం తన స్వంత వుత్సాహం పైననే ఆధారపడిన, నిగ్రహంలేని మిలిటరీ ఆఫీసరు శత్రువు చేత సులభంగా మోసగించబడతాడు. అననుకూల పరిస్థితుల్లో యుద్ధానికి దించబడగలుగుతాడు. శత్రు పక్షంలో పైకి మాత్రం కానవచ్చే కొన్ని బలహీనతలు గానీ, పాక్షిక అంశాలను చూసి గానీ లోతైన జ్ఞానమూ, దూర దృష్టి లేని కింది ఆఫీసర్ల బాధ్యతా రహితమైన ప్రోత్సాహం వల్ల గానీ, తొందరపాటు చర్యలకు దిగుతాడు. ఫలితంగా గోడకు గుద్దుకొని తల బద్దలు చేసుకుంటాడు. సరైన శత్రు సమాచార సేకరణపైన శత్రు పరిస్థితి, తన పరిస్థితి మధ్యగల సంబంధాలను జాగ్రత్తగా పరిశీలించడం పైన ప్రతి మిలిటరీ ఆఫీసరు తన ప్లానును తయారు చేసుకోవలసి వుంటుంది. పైన చెప్పిన నిగ్రహంలేని మిలిటరీ ఆఫీసరుకు ఈ విషయాలు తెలియవు. కనీసం తెలుసుకోవడానికి ప్రయత్నం కూడా చేయడు.

ఒక పరిస్థితిని తెలుసుకునే క్రమం మిలిటరీ ప్లాను తయారు చేసుకోవడంతోనే ఆగిపోదు. ఆ తర్వాత కూడా కొనసాగుతుంది. ఆ ప్లానును ప్రారంభించి, తుదిదాకా అమలుజరిపే సమయంలో, పరిస్థితిని అర్థం చేసుకునే క్రమం మరొకటి వుంది. అదే ఆచరణ క్రమం. ఈ ఆచరణ క్రమంలో తయారు చేసుకున్న ప్లాను వాస్తవ పరిస్థితులను ప్రతిబింబిస్తున్నదా లేదా అని పరిశీలించాలి. ఆ ప్లాను వాస్తవ పరిస్థితులకు తగ్గట్లుగా లేకపోతేనో, సంపూర్ణంగా తగ్గట్టుగా లేకపోతేనో, కొత్తగా సంపాదించిన అనుభవాన్నీ, సమాచారాన్ని బట్టి, నూతన అంచనాలు తయారు చేసుకోవాలి. నూతన నిర్ణయాలు చేయాలి. మొదటి ప్లానును మార్చి నూతన పరిస్థితులకు తగ్గ ప్లానును తయారు చేసుకోవాలి. అపుడు అన్ని మిలిటరీ చర్యలలోనూ, పాక్షిక మార్పులు జరగక తప్పదు. కొన్ని సందర్భాల్లో ప్లానును మొత్తంగానే మార్పును చేయవల్సి వుంటుంది. అటువంటి మార్పు చేయవలసిన అవసరాన్ని గుర్తించనీ లేక మార్పు చేయడానికి అంగీకరించని గుడ్డిగా ప్రవర్తించే మిలిటరీ అధికారి గోడకు గుద్దుకొని తల బద్దలు చేసుకుంటాడు.

పై సూత్రం ఒక వ్యూహాత్మక చర్యకూ, ఒక క్యాంపెయిన్‌కు లేక ఒక యుద్ధ రంగానికి వర్తిస్తుంది. అనుభవం కలిగిన ఒక మిలిటరీ ఆఫీసరు అణకువ కలవాడయితే, నేర్చుకోవడానికి సంసిద్ధత కలవాడయితే, తన బలాల స్వభావాన్ని, శత్రు బలాల స్వభావాన్ని (ఇరువైపుల కమాండర్లు, సైనికులు, ఆయుధాలు, సప్లయి వగైరాల మొత్తం పరిస్థితి) అర్థం చేసుకుంటాడు. యుద్ధానికి సంబంధించిన మిగతా అన్ని విషయాలను అంటే రాజకీయ, ఆర్థిక, భౌగోళిక వాతావరణ పరిస్థితిని అర్థం చేసుకుంటాడు. అటువంటి మిలిటరీ అధికారి యుద్ధాన్ని నడపడంలో లేక ప్రత్యేక పోరాటాన్ని నడపడంలో ఎక్కువ శక్తి సామర్థ్యాలు చూపించగలుగుతాడు. విజయాలు సాధించ గలుగుతాడు. దీర్ఘకాల అనుభవంలో, శత్రు పక్షం పరిస్థితిని క్షుణ్ణంగా తెలుసుకోవడం వల్లనూ, ఈ యుద్ధ చర్య సూత్రాలను అర్థం చేసుకోవడం వల్లనూ, భౌతిక పరిస్థితులకూ, స్వీయాత్మక పరిస్థితులకు మధ్య వున్న వైరుధ్యాన్ని పరిష్కరించుకోగల్గడం వల్లనూ అతడు

విజయాన్ని సాధించగలుగుతాడు. అన్ని విషయాలు తెలుసుకునే ఈ అధ్యయన క్రమం అతి ముఖ్యమైనది. ఇటువంటి దీర్ఘకాల అనుభవం లేకుండా, మొత్తం యుద్ధానికి సంబంధించిన సూత్రాలు అర్థం చేసుకోవడం, వాటిపై పట్టు సాధించుకోవడం చాలా కష్టమైన పని. ప్రారంభ దశలో వున్నవాడు గానీ, పేపరుపైన మాత్రమే యుద్ధం నడిపేవాడు గానీ, వాస్తవంగా ఉన్నత స్థాయికి చెందిన కమాండర్‌గా అభివృద్ధి చెందలేడు. యుద్ధంలో నేరుగా పాల్గొనడం ద్వారానే అటువంటి అనుభవం సంపాదించుకోగల్గుతాడు.

మిలిటరీ సూత్రాలూ, సిద్ధాంతాలు సూత్రబద్ధ స్వభావం కలవి. గతంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న యుద్ధాల్లో వచ్చిన అనుభవాన్ని క్రోడీకరించడం వల్ల వచ్చిన సూత్రాలివి. రక్తాన్ని చిందించడం ద్వారా తయారయినట్టి గతాన్నుండి వారసత్వంగా వచ్చిన ఈ గుణపాఠాలను మనం లోతుగా అధ్యయనం చేయాలి. ఇది ఒక విషయం మాత్రమే. మనం గమనించాల్సిన మరొక విషయం కూడా వుంది. ఈ గుణపాఠాలను మన అనుభవంలో పరీక్షకు గురిచేయాలి. వుపయోగంలేని దానిని తోసిపుచ్చి ఉపయోగకరమైన దానిని స్వీకరించి నిర్దిష్టమైన మన అనుభవాలను వాటికి జోడించాలి. కడపటి విషయం చాలా ముఖ్యమైనది. లేకపోతే యుద్ధాన్ని నడపలేము.

చదవడం ద్వారానే నేర్చుకోగలుగుతాము. అయితే అమలు జరపడం కూడా నేర్చుకోవడమే. అలా నేర్చుకోవడం అనేది అతి ముఖ్యమైన పద్ధతి. యుద్ధాన్ని యుద్ధం ద్వారా నేర్చుకోవడం మన ముఖ్యమైన పద్ధతి. స్కూలుకు వెళ్లి చదువుకోవడానికి వీలులేని వాడు కూడా యుద్ధ నైపుణ్యం సంపాయించుకోగలడు. అతను యుద్ధంలో నేరుగా పోరాటంలో పాల్గొనడం వల్ల నేర్చుకోగలుగుతాడు. విప్లవ యుద్ధం, ప్రజలు చేసే యుద్ధం. అనేక సందర్భాల్లో మొదట నేర్చుకోవడం, తర్వాత చేయడం సాధ్యం కాదు. చేయడం మొదట, తర్వాత నేర్చుకోవడం. ఎందుకంటే, చేయడమే నేర్చుకోవడం. సాధారణ పౌరునికీ సైనికునికి మధ్య అగాధం వున్నమాట వాస్తవమే గానీ ఈ అగాధం చైనా గోడ లాంటిది కాదు. దీన్ని త్వరలోనే అధిగమించగలుగుతాం. విప్లవంలో, యుద్ధంలో పాల్గొనడం ద్వారా ఈ అగాధాన్ని త్వరలోనే అధిగమించగలుగుతాం. నేర్చుకోవడం, దానిని అమలువర్చడం సులభమైనది కాదు అని మనం అంటున్నామంటే, దాని అర్థం సంపూర్ణంగా నేర్చుకోవడం, నైపుణ్యంగా అమలు జరపడం కష్టమని మాత్రమే. సాధారణ పౌరులు కూడా చాలా త్వరలోనే సైనికులుగా తయారు కావచ్చునని అంటున్నామంటే దాని అర్థం గడపదాటడం కష్టమైన పని కాదని మాత్రమే. ఈ రెండు స్టేట్‌మెంట్లు కలిపితే చైనాలోని ఒక సూక్తికి సరిపోతుంది. "ఒక దానిని సాధించడానికి దృఢ నిశ్చయుడైన వానికి ప్రపంచంలో సాధించలేనిది ఏదీ లేదు. గడప దాటడం అంత కష్టమైన పని కాదు." ఈ పనిలో పూర్తిగా నిమగ్నుడైతే నేర్చుకునే మంచి స్వభావం వుంటే అందులో నైపుణ్యం సంపాదించడం కూడా సాధ్యమే.

ఇతర అన్ని విషయాలకు సంబంధించిన సూత్రాల మాదిరే యుద్ధ సూత్రాలు కూడా భౌతిక, వాస్తవిక విషయాలకు మన మనస్సులో ప్రతిబింబాలు మాత్రమే. మన మనసుకు బాహ్యమైన విషయమంతా భౌతిక వాస్తవమే. కనుక మనం తెలుసుకోవలసినవీ, నేర్చుకోవలసినవీ శత్రు పక్షపు, స్వపక్షపు పరిస్థితులు ఇవి రెండూ అధ్యయనం చేయాల్సిన విషయాలుగా గుర్తించాలి. ఆలోచించగల మెదడు మాత్రమే ఈ అధ్యయనం సాగించగల కర్త. కొంత మంది స్వపక్షాన్ని గురించి బాగా తెలుసుకోగలుగుతారు. శత్రు పక్షం గురించి తెలుసుకోవడంలో బలహీనత కనబరుస్తారు. మరికొంత మంది శత్రుపక్షం గురించి తెలుసుకోగలుగుతారు. స్వపక్షం గురించి తెలుసుకోవడంలో బలహీనత కనబరుస్తారు. యుద్ధ సూత్రాలను నేర్చుకోవడం, అమలు జరపడం అనే సమస్యను వీరిద్దరూ కూడా పరిష్కరించుకోలేరు. చైనా పురాతన చరిత్రలో గొప్ప మిలిటరీ శాస్త్రజ్ఞుడిగా ప్రసిద్ధి చెందిన సున్‌జూ ఇలా చెప్పాడు "శత్రువును గురించి తెలుసుకో, నిన్ను గురించి తెలుసుకో అప్పుడు ఓటమి భయం లేకుండా నీవు వంద యుద్ధాలు చేయగల్గుతావు" నేర్చుకునే దశకూ, అమలు జరిపే దశకు వాస్తవ భౌతిక పరిస్థితి యొక్క అభివృద్ధి క్రమానికి సంబంధించిన సూత్రాలు తెలుసుకోవడానికి ఎదుర్కొంటున్న శత్రువును ఓడించడానికి ఈ సూత్రాలపై ఆధారపడి మన పోరాట ఎత్తుగడలను నిర్ణయించుకోవడానికి పై సూక్తి వర్తిస్తుంది. ఈ సూక్తిని మనం తేలికగా తీసుకోరాదు.

జాతుల మధ్య, దేశాల మధ్య, వర్గాల మధ్య, రాజకీయ గ్రూపుల మధ్య సాగే పోరాటపు అత్యున్నత రూపమే యుద్ధం. విజయం సాధించడానికి జాతులూ, దేశాలూ, వర్గాలు, రాజకీయ గ్రూపులన్నీ యుద్ధ సూత్రాలను అమలు పరుస్తాయి. యుద్ధంలో విజయం లేక ఓటమి అనేది ప్రధానంగా రెండు పక్షాల వైపున వున్న మిలిటరీ, రాజకీయ, ఆర్థిక సహజ పరిస్థితులపై ఆధారపడి వుంటుందనేది నిస్సందేహమైన విషయం. అయితే ఇవి మాత్రమే యుద్ధంలో విజయాన్ని లేక, ఓటమిని నిర్ణయించలేవు. యుద్ధాన్ని నిర్వహించడంలో రెండు పక్షాల స్వీయాత్మక ప్రతిభ కూడా దీనిని నిర్ణయిస్తుంది. యుద్ధాన్ని జయించే ప్రయత్నంలో మిలిటరీ అధికారి భౌతిక పరిస్థితులు విధించే పరిమితులను దాటిపోతాడు. అయితే పరిమితులకు లోబడే విజయాన్ని సాధించవచ్చు. సాధించడానికి కృషి చేయాలి కూడా. భౌతిక పరిస్థితులపై ఆధారపడి సైనిక నిపుణుడు కార్యాచరణకు అవసరమైన

(మిగతాది 47వ పేజీలో...)

# తమిళ ఈళం పోరాటం - గుణపాఠాలు

2009, మే 18 నాడు శ్రీలంక అధ్యక్షుడు మహీందా రాజపక్షే ఎల్.టి.టి.ఇ.కి వ్యతిరేకంగా మూడు దశాబ్దాలుగా జరుగుతున్న యుద్ధం ముగింపుకు వచ్చిందని ప్రకటించాడు. టైగర్ల మీద శ్రీలంక సైన్యం అంతిమ విజయాన్ని సాధించిందని అతను ప్రకటించాడు. శ్రీలంక సైన్యమూ, ప్రభుత్వమూ ఎల్.టి.టి.ఇ. నాయకుడు ప్రభాకరన్, అతని లెఫ్టినెంటులలో అనేక మందీ యుద్ధంలో మరణించారని చెప్పూ, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాల్లో (టీవీల్లో, వార్తాపత్రికల్లో) ప్రభాకరన్ శవం ఫోటోలను చూపారు. 20వ తేదీన శ్రీలంక ప్రభుత్వం 'విజయోత్సవాల్ని' జరుపుకునేందుకు గాను జాతీయ శెలవు దినంగా ప్రకటించింది. ఈ ప్రకటనకు ఎంచుకున్న సమయం శ్రీలంకలోనూ, భారత దేశంలోనూ, ప్రపంచంలోనూ జరుగుతున్న పరిణామాల్ని దగ్గరగా, నిశితంగా పరిశీలిస్తున్నవారిలో అనేక సందేహాలను కలిగించింది. భారత దేశంలో పార్లమెంటరీ ఎన్నికల ఫలితాల్ని ప్రకటించాకనే కావాలని ఈ వార్తను శ్రీలంక ప్రభుత్వం ప్రచారంలో పెట్టినట్లుగా కనిపిస్తోంది. ఒక వక్క శ్రీలంక ప్రభుత్వమూ, భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని యు.పి.ఎ. ప్రభుత్వమూ దీన్ని ఉత్సవంగా జరుపుకోగా, మరో వైపు ప్రపంచవ్యాప్తంగా లక్షల సంఖ్యలో తమిళ ఈళంనీ, టైగర్లనూ సమర్థించేవారూ, వారి సానుభూతిపరులూ ప్రత్యేక తమిళ ఈళం సాధనకై చేస్తున్న పోరాటం ఈ విధంగా అంతమవ్వడాన్ని చూసి దిగ్భ్రాంతికి, నిజమేనా అనే సంశయానికీ గురయ్యారు. ఇరవై నాలుగు గంటలలోనే, టైగర్లు శ్రీలంక ప్రభుత్వ ప్రకటనల్ని ఖండిస్తూ, టైగర్ల నాయకుడూ, మిగతా తమిళ ఈళం నాయకులూ సురక్షితంగా వున్నారనీ, ఈళం ప్రజల కోసం ప్రత్యేక మాతృభూమిని సాధించే లక్ష్యాన్ని నెరవేర్చే వరకూ తమిళ ఈళం గురించిన పోరాటం కొనసాగుతుందనీ ప్రకటనను వెలువరించారు.

ప్రపంచ వ్యాప్తంగా తమిళులు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. తమిళనాడులో అయితే వీటితోపాటు కొన్ని హింసాత్మక ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఎల్.టి.టి.ఇ. పైన ప్రత్యేక ఈళం మాతృభూమికై జరుగుతుండిన సాయుధ పోరాటం పైన నిర్ణయాత్మకమైన విజయాన్ని సాధించామని శ్రీలంక ప్రభుత్వం చెప్పుకుంటున్న విషయం నిర్వివాదం కాకపోయినప్పటికీ కనీసం ప్రస్తుతానికైతే శ్రీలంక ప్రభుత్వం ఎల్.టి.టి.ఇ.పై ఒక పెద్ద మిలిటరీ విజయాన్ని సాధించింది అనడంలో సందేహం లేదు. అత్యంత శక్తివంతమైన గెరిల్లా బలగాల్లో ఒకటైన ఎల్.టి.టి.ఇ. ఇటువంటి ఓటమిని ఎలా పొందింది? శ్రీలంక సైన్యం దానిని ఎలా ఓడించగలిగింది? ఈ ఓటమితో స్వయం నిర్ణయాధికారం కోసం మూడున్నర దశాబ్దాలుగా జరుగుతున్న సాయుధ పోరాటం అంతమైనట్లేనా? శ్రీలంక ప్రభుత్వం ఈళం ప్రజల న్యాయమైన జాతి ఆకాంక్షలను నెరవేర్చగలదా? శ్రీలంకలోని తమిళ ప్రజలు సింహళ ప్రజలతో సమానమైన పౌరులుగా జీవించగలుగుతారా? శ్రీలంకలోని తమిళ ప్రజల భవిష్యత్ ఏమిటి? ఇవన్నీ తమిళ ఈళం ఆశయాన్ని న్యాయంగా సమర్థించే వారందరి, ప్రజల ప్రజాస్వామ్యం, జాతి విముక్తి, స్వాతంత్ర్యాల కోసం పోరాడే వారందరి మనస్సుల్లో మెదిలే ముఖ్యమైన ప్రశ్నలు. తమిళ ఈళంకై పోరాటాన్ని అర్థం చేసుకోవాలంటే దాని మూలాల్నీ, దాని ఎదుగుదలని అర్థం చేసుకోవడం అవసరం.

## ప్రత్యేక తమిళ ఈళం డిమాండ్, పుట్టు పూర్వోత్తరాలు

దాదాపు క్రీ.పూ. 500 నాడు విజయ రాకుమారుడు భారత దేశం నుండి తమ ద్వీపానికి రావడం తమ మూలాలకు ఆరంభంగా సింహళ ప్రజలు భావిస్తారు. విజయ రాకుమారుడు రాక ముందు నుండే తమిళులు ఈ ద్వీపంలో నివసిస్తూ వుండినారు. సింహళ చరిత్రకారుడు కేంబ్రిడ్జ్ విద్వాంసుడు అయిన పాల్ పెయిరిస్ ప్రకారం "... భారత దేశం నుండి కేవలం 30 మైళ్ల దూరంలో రోజు వారిగా చేపల్ని పట్టడానికి సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులకు కనిపించేంత దూరంలో వున్న ద్వీపానికి ఓడల మీద ప్రయాణం చేయడం నేర్చుకున్న వెంటనే మనుషులు వచ్చి నివాసం ఏర్పరుచుకొని వుంటారని ఊహించడం సహేతుకంగా వుంటుంది... విజయ రాకుమారుడు రావడానికంటే చాలా కాలం ముందే శ్రీలంకలో గుర్తింపు పొందిన అయిదు శివుడి ఈశ్వరాలయాలు వుండినాయి. ఇవి భారతదేశం అంతటిలోనూ గుర్తింపు పొంది పూజలందుకున్నవి. అవి మహాతిత వద్ద గల తిరుకేటీశ్వరం; ముత్యాల వేటపై సాలావాట్టీపైన ఆధిక్యత కలిగిన మున్నేశ్వరం; మంటోటా వద్ద గల తొండేశ్వరం; కొట్టియార్ మహా అఖాతం వద్ద గల తిర్కోనేశ్వర; కంకేశన్తురై వద్దగల నకులేశ్వరం." (పాల్ ఇ. పెయిరిస్; నాగదీప మరియు జాఫ్నాలోని బుద్ధ అవశేషాలు; జర్నల్ ఆఫ్ రాయల్ ఏసియాటిక్ సొసైటీ, సిలోన్ శాఖ, సంపుటి.28)

1505లో పోర్చుగీస్ వలసవాదులు ద్వీపం మీదకు అడుగిడే నాటికి అక్కడ మూడు రాజ్యాలు వుండినాయి. జాఫ్నాలో తమిళ ఆధారిత రాజ్యం, కొట్టేలో రెండు సింహళ ఆధారిత రాజ్యాలు, మూడవది కాండీలో ఉండేది. 1619లో పోర్చుగీస్ వారు తమిళ రాజును ఓడించి జాఫ్నా రాజ్యాన్ని ఆక్రమించుకున్నారు. 1656లో

డచ్ వారు అక్కడకు చేరుకున్నారు. ఆ తర్వాత 1796లో బ్రిటీష్ వారు ద్వీపాన్ని ఆక్రమించుకున్నారు. 1802లో సిలోన్ బ్రిటన్ రాజ్యానికి (క్రౌన్) వలసగా మారింది. 1833లో మొదటిసారిగా సిలోన్ మొత్తంగా బ్రిటీష్ వారి ఆధ్వర్యంలో ఏకైక పాలనా యంత్రాంగం కిందికి వచ్చింది. దాదాపు అదే కాలంలో తేయాకు, కాఫీ, కొబ్బరి ప్లాంటేషన్‌లలో పని చేయడానికి బ్రిటీష్ వారు తమిళనాడు నుండి కూలీలను తేవడం ఆరంభమైంది.

పది కోట్ల డెబ్బై లక్షలుగా వున్న ద్వీపంలోని జనాభాలో దాదాపు అయిదింట ఒక వంతు జనాభా తమిళులుగా వుండేవారు. అంటే దాదాపు సింహళుల సంఖ్యలో మూడు వంతుల కంటే తక్కువ. తమిళులు ప్రధానంగా ద్వీపంలోని ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోనూ, మధ్య ప్రాంతంలోని గుట్టల్లో గల ప్లాంటేషన్లలోనూ నివసించగా, సింహళులు దక్షిణంలో, పశ్చిమంలో అలాగే మధ్య ప్రాంతంలో కూడా నివసించేవారు. ఈశాన్యంలోని తమిళుల మాతృభూమి దాదాపు 7 వేల 500 మైళ్ల విస్తీర్ణాన్ని కలిగి వుంది, అంటే 19 వేల 509 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం అన్నమాట.

1919లో తమిళులూ, సింహళులూ కూడా సభ్యులుగా గల సిలోన్ జాతీయ కాంగ్రెస్ (సి.ఎన్.సి.) అరుణాచలం పొన్నాంబళం అనే తమిళుడి నాయకత్వంలో ఏర్పడింది. ఆ తర్వాత 1921లో అది కేవలం సింహళులకే ప్రాతినిధ్యం వహిస్తోందని ఆరోపిస్తూ అతను సి.ఎన్.సి. నుంచి వైదొలగాడు. 1947లో సోల్‌బరీ రాజ్యాంగాన్ని తయారు చేశారు. ఇది వలస పాలన కింద వుండే యూనిటరీ ప్రభుత్వం ఉండాలని వక్కాణించింది. 1948లో బ్రిటీష్ వారు సింహళ దళారులకు అధికారాన్ని అప్పగించి సిలోన్ నుండి వైదొలిగారు. సింహళ పాలకవర్గాలు ద్వీపాన్ని కేవలం సింహళుల నివాస స్థలంగా పరిగణిస్తూ తమిళ ప్రజల్ని 'బయటి వారిగా' యూనిటరీ సింహళ బుద్ధిస్టు ప్రభుత్వం పరిధిలోకి కలిపేసుకొని, తమ చెప్పుచేతల్లో వుంచుకోవాల్సినవారిగా చూస్తూ వచ్చారు.

1949లో అధికారాన్ని చేపడుతూనే సింహళ పాలకవర్గాలు తమిళనాడు నుంచి వచ్చిన ప్లాంటేషన్ కార్మికులకు ఓటు హక్కును లేకుండా చేశారు. 1949 నాటి పౌరసత్వ చట్టం భారతదేశ మూలాలు కలిగిన దాదాపు 10 లక్షలకు పైగా తమిళ ప్లాంటేషన్ కార్మికులకు ఓటు హక్కునూ, దేశాన్నీ లేకుండా చేసేసింది. 1949లో ఎస్.జె.వి. సెల్వానాయగం నేతృత్వంలో తమిళ ఫెడరల్ పార్టీ (ఎఫ్.పి.) ఏర్పడింది. ఇతన్ని ఈళం జాతి పితామహుడిగా పరిగణిస్తారు. దీని మొదటి సదస్సు 1951లో జరిగింది. ఫెడరల్ పరిపాలనా యంత్రాంగాన్నీ, ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో నివసిస్తున్న తమిళులకు ప్రాంతీయ స్వయం ప్రతిపత్తినీ డిమాండ్ చేస్తూ క్యాంపెయిన్ చేపట్టాలనే ఆశయాన్ని అది ప్రకటించింది. 1956లో సింహళ జాతీయవాదం ఇచ్చిన ఊతంతో సోలమన్ బండార నాయకే ఎన్నికయ్యాడు. సింహళ భాషను సిలోన్ ఏకైక అధికార భాషగా ప్రకటించారు. అలాగే సింహళ బుద్ధిస్టు జాతి ఉన్మాదాన్ని పెంచే విధంగా అనేక ఇతర చర్యలను కూడా ప్రభుత్వం చేపట్టింది. 1980లలో శ్రీలంక అధ్యక్షుడిగా ఎన్నికయిన జె.ఆర్. జయవర్ధనే బహిరంగంగా సింహళజాతి ఉన్మాదాన్ని ఇలా రెచ్చగొట్టాడు: "...గత 2,500 ఏళ్లుగా ఉనికిలో వుంటూ తన భాషనూ, మతాన్ని ఉత్సాహంగా కాపాడుకుంటూ వస్తున్న సింహళ జాతి ఎటువంటి శషభిషలకు తావు లేకుండా లేచి నిలబడి తన జన్మ హక్కును కాపాడుకోవడానికై పోరాడాల్సిన తరుణం ఆసన్నమయింది... నేను ఆ క్యాంపెయిన్‌కు నాయకత్వం వహిస్తాను..." (జె.ఆర్.జయవర్ధనే, సింహళ ప్రతిపక్ష నాయకుడు, శ్రీలంక ట్రిబ్యూన్, ఆగస్టు 30, 1957).

1958లో బండార నాయకే తమిళ నాయకుడు సెల్వానాయగం ఫెడరల్ పరిష్కారంతో ఒక ఒప్పందం పై సంతకం చేశారు (బి–సి పాక్ట్ అంటారు దీన్ని). ఇది సిలోన్‌లోని ఉత్తర, తూర్పు ప్రాంతాల్లోని తమిళులకు విస్తృతమైన అధికారాలను ఇచ్చింది. కానీ ఒప్పందంపై సంతకాలు పెట్టిన వారం రోజులకే సింహళ బుద్ధిస్టు జాతి ఉన్మాదుల ఒత్తిడికిలోనై ఏకపక్షంగా దాన్ని కాలరాచి వేసింది. దీనికి నిరసనగా ఎఫ్.పి. ఒక శాంతియుత సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ఆరంభించింది. ప్రభుత్వం ఈ ఉద్యమాన్ని అణచడానికి పోలీసుల్నీ, పారా మిలిటరీని పంపించింది. అలాగే సింహళ ఆధిక్యత గల ప్రాంతాల్లో తమిళ వ్యతిరేక దాడుల్ని ఎక్కుపెట్టింది. రెండు వందల మందికిపైగా తమిళులు మరణించారు. వేలాది మంది నిర్వాసితులయ్యారు.

1959లో ఒక బౌద్ధ సన్యాసి సోలమన్ బండార నాయకేని చంపిన తర్వాత అతని భార్య సిరిమావో బండార నాయకే ప్రపంచంలోనే మొట్ట మొదటి మహిళా ప్రధాన మంత్రిగా అధికారాన్ని చేపట్టింది. ఆమె సింహళ జాతి ఉన్మాద చర్యలను కొనసాగించింది. 1972లో సిలోన్ పేరును శ్రీలంకగా మార్చి బౌద్ధ మతానికి దేశ మతంగా ప్రముఖ హోదాను కల్పించారు. ఈ చర్యలు ద్వీపంలోని తమిళుల్ని మరింతగా పరాయీకరణకూ, వ్యతిరేక భావాలకు గురిచేసాయి. 1964లో దేశంలోని ప్లాంటేషన్ కార్మికుల్ని భారతదేశానికి తిరిగి పంపేయడానికి సిరిమావో–శాస్త్రి ఒప్పందంపై సంతకాలు చేశారు. 1965లో డడ్లీ–చెలువా ఒప్పందంపై సంతకాలు చేశారు. ఇది బి–సి ఒప్పందాన్ని మరింత పలచన చేసిన ఒక ఒప్పందం. సింహళ జాతి ఉన్మాదులూ, బౌద్ధ మత పెద్దలూ దీన్ని వ్యతిరేకించడంతో ఈ ఒప్పందాన్ని అమలు చేయకుండానే విడనాడారు. దీనికి నిరసనగా స్థానిక ప్రభుత్వంలో మంత్రిగా వున్న ఎఫ్.పి.కి చెందిన తిరుచల్వం కేబినెట్ నుండి రాజీనామా చేశాడు.

1972 మే 22న సిలోన్ రిపబ్లిక్‌గా మారి, రిపబ్లిక్ ఆఫ్ శ్రీలంకగా పేరు మార్చుకుంది. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వం ఒక సింహళ ఆధిక్య 'రిపబ్లికన్ రాజ్యాంగాన్ని' దేశం అంతటికోసం రూపొందించింది. అది బౌద్ధ మతాన్ని ప్రభుత్వ మతంగా చేసేసి ఈళంకు, ప్లాంటేషన్‌లకు చెందిన తమిళుల్ని రెండో శ్రేణి పౌరులుగా మార్చివేసింది.

ప్రభుత్వ ప్రాయోజిత జాతి ఉన్మాదం వల్ల దెబ్బతినగల స్థితిలో వుండిన తమిళ పార్టీలు తమిళ యునైటెడ్ ఫ్రంట్ (టి.యు.ఎఫ్.)ను ఏర్పరిచారు. ఇందులో ఎఫ్.పి., జి.జి. పొన్నాంబళం నాయకత్వంలోని తమిళ కాంగ్రెస్ (టి.సి.), తొండమాన్ నాయకత్వంలోని సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ (దీనినే తరువాత 1976లో టి.యు.ఎల్.ఎఫ్. (తుల్ఫ్)గా పేరు మార్చారు) పార్టీలు వుండేవి. యువకులతో కూడిన ఒక చిన్న బృందం తమిళ న్యూ టైగర్స్ (టి.ఎన్.టి.) అనే సంస్థను ఏర్పరిచింది. ఆ తర్వాత తమిళ హక్కుల కోసం పోరాడ్డానికై 1976లో జాఫ్నా ద్వీపకల్పంలో దీని పేరును లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈళంగా మార్చారు. దీని నాయకుడు 17 ఏండ్ల వేలుపిళ్లై ప్రభాకరన్.

1974లో సింహళ జాతి ఉన్మాదులు సింహళ పోలీసులతో కుమ్మక్కయి జాఫ్నాలో జరుగుతున్న ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ తమిళ కల్చరల్ కాన్ఫరెన్స్‌కు హాజరైనవారిపై దాడి చేసి తొమ్మిది మంది తమిళుల్ని చంపి, అనేక మందిని గాయపర్చారు. 'ప్రామాణీకరణ'ను ప్రవేశపెట్టి విశ్వ విద్యాలయాల్లో తమిళ విద్యార్థుల ప్రవేశానికి సమాన అవకాశాలు లేకుండా చేయడంతో తమిళుల పట్ల ప్రభుత్వ వివక్ష పరాకాష్టకు చేరుకుంది. ఈ చర్య కేవలం తమిళులకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్ని లేకుండా చేయడమే కాక, క్రమంగా పాలనా యంత్రాంగంలో, పోలీసుల్లో, సైన్యంలో తమిళులను లేకుండా చేయడానికి కూడా ఉద్దేశించబడినది. 1976లో తుల్ఫ్ 'వడ్డు కొడ్డై తీర్మానం'ను ఆమోదించింది. దాని లక్ష్యం శ్రీలంకలో తమిళుల ఉనికిని కాపాడ్డానికై స్వేచ్ఛాయుతమైనా, సార్వభౌమాధికారం గల, సెక్యులర్, సోషలిస్టు తమిళ ఈళం ప్రభుత్వాన్ని స్వయం నిర్ణయాధికార హక్కు ప్రాతిపదికగా స్థాపించడం'. 1977 నాటి సార్వత్రిక ఎన్నికల్లో, తుల్ఫ్ ప్రత్యేక తమిళ ఈళం రాజ్యం కావాలనే నినాదంతో ఎన్నికల్లో పోటీ చేసింది. అత్యధిక మెజారిటీ తమిళులు అంటే 90 శాతానికి పైగా తమిళులు ప్రత్యేక ఈళం కొరకు ఓటు వేశారు. తమిళుల స్వయం నిర్ణయాధికార హక్కు విషయంలో వారి ఆకాంక్షలకు శాంతియుత పద్ధతుల్లో జరిగిన రిఫరెండమే తప్ప మరేమీకాదు ఇది. కానీ, సింహళ-బౌద్ధ జాతి ఉన్మాదులు తమిళుల హక్కుల్నీ, ఆకాంక్షల్ని గుర్తించ నిరాకరించారు; పైపెచ్చు వారి న్యాయమైన డిమాండ్లను కాలరాచివేయడానికి మరింత ఎక్కువగా రాజ్య ప్రాయోజిత హింసకు పాల్పడ్డారు. తమిళ అస్మితనూ, వారి చరిత్రనూ తుడిచివేసే ప్రయత్నంలో భాగంగా ఇద్దరు మంత్రులు గామిని దిస్సనాయకే, సిరిల్ మాథ్యూల సారథ్యంలో జాఫ్నా పబ్లిక్ గ్రంథాలయాన్ని శ్రీలంక సాయుధ బలగాలు అగ్నికి ఆహుతి చేశాయి. ఈ గ్రంథాలయంలో దాదాపు 95 వేలకు పైగా అరుదైన పుస్తకాల భాండారం వుండింది. వాటిలో సాంస్కృతికంగా ఎంతో ముఖ్యమైన, మరెక్కడా లభ్యంగాని ఎన్నో తమిళ రాత ప్రతులు కూడా వుండినాయి.

విముక్తిపూర్వ యుద్ధ కాలంలో 1983 జూలైలో (దీన్ని 'బ్లాక్ జూలై' అంటారు) తమిళుల్ని మహా క్రూరంగా, అత్యంత విస్తృతంగా పథకం ప్రకారం ఊచకోత కోశారు. ఇది కేవలం తమిళులు అత్యధికంగా నివసిస్తుండిన ఉత్తర, తూర్పు శ్రీలంకలోనే కాక దేశవ్యాప్తంగా కూడా జరిగింది. నాలుగు వేల మందికి పైగా తమిళుల్ని చంపేశారు. వేలాది మంది నిర్వాసితులయ్యారు. వారి ఆస్తుల్ని ధ్వంసం చేశారు లేదా లూటీ చేశారు. ఫలితంగా వారికి జీవనాధారం లేకుండా పోయింది. జైళ్లలో కూడా తమిళ ఖైదీలను పాశవికంగా హత్యలు చేశారు, వారి కళ్లను పెకిలించారు. ఒక లక్షా యాభై వేల మందికిపైగా ప్రజలు కాందిశీకులుగా శ్రీలంక నుండి భారతదేశానికీ, పశ్చిమ దేశాలకు పారిపోయారు. నేరుగా ఈ దాడుల్ని రెచ్చగొడుతూ అధ్యక్షుడు జయవర్ధనే, 'తమిళ ప్రజల అభిప్రాయాల గురించి నేను పట్టించుకోను... ప్రస్తుతం మనం దాని గురించి ఆలోచించలేం, వారి ప్రాణాల గురించిగానీ, వారి అభిప్రాయాల గురించిగానీ... ఉత్తర ప్రాంతంపై మనం ఎంత ఒత్తిడి తీసుకువస్తే, ఇక్కడ సింహళ ప్రజలు అంత ఆనందంగా వుంటారు... నిజంగా నేను తమిళ ప్రజల్ని ఆకలికి మాడిస్తే, సింహళ ప్రజలు ఎంతగానో సంతోషిస్తారు' అన్నాడు. (అధ్యక్షుడు జె.ఆర్.జయవర్ధనే, డెయిలీ టెలిగ్రాఫ్, 11 జూలై 1983).

ఈ ఘటన తమిళ ఈళం ప్రజల స్వయం నిర్ణయాధికార పోరాటంలో ఒక మలుపు. తమిళ ప్రజలు శ్రీలంక 'పార్లమెంటరీ ప్రజాస్వామ్యం' పై విశ్వాసాన్ని కోల్పోయారు. ఎందుకంటే అది ద్వీపంపై సింహళ-బౌద్ధ ఆధిపత్యాన్ని స్థాపించడానికి ఒక పరంపరగా పాలనా పరమైన, చట్టపరమైన చర్యలను తీసుకుంది. అవి, ఓటు హక్కును లేకుండా చేయడం, తమిళ మాతృభూమి అయిన ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో పథకం ప్రకారం సింహళ ప్రజలకు నివాసం ఏర్పర్చడం ద్వారా ప్రభుత్వ ప్రాయోజిత వలసల్ని ప్రోత్సహించడం, వివక్షాపూరితమైన భాషా, ఉద్యోగ విధానాలూ, విశ్వ విద్యాలయాల్లో ప్రవేశాన్ని అడ్డుకునే 'ప్రామాణీకరణ' విధానం మొదలయినవి.

పోరాటం అహింసాయుత, శాంతియుత పద్ధతుల నుండి సాయుధ పోరాటంగా పరిణమించింది. వేలాది మంది యువత వివిధ మిలిటెంట్ సంస్థల్లో చేరారు. వారు మొదట భారతదేశంలో భారత ప్రభుత్వ మద్దతుతో మిలిటరీ శిక్షణను పొందారు. అప్పటికి సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల ఆధిపత్యంలో నడుస్తున్న భారత విస్తరణవాదులు

ఈ సమస్యను ఉపయోగించుకొని అప్పటికి అమెరికా ఆధిపత్యం కింద నడుస్తున్న శ్రీలంక ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చి తమ విస్తరణవాద డిమాండ్లకు తలొగ్గేలా చేసుకోవాలని భావించారు. పార్లమెంటరీ, శాంతియుత పద్ధతులు తమ ఆత్మాభిమానాన్నీ, హక్కుల్నే గాక గౌరవప్రదమైన జీవితాన్ని కూడా లేకుండా చేస్తున్నాయని ప్రజలు గ్రహించారు. అందువల్ల, వారు పార్లమెంటరీ రాజకీయ నాయకుల్ని నిరాకరించి, మనఃస్ఫూర్తిగా సాయుధ పోరాటానికి మద్దతునిచ్చారు. ఈ వాస్తవాల్ని మరుగుపర్చి భారత ప్రభుత్వమూ, మీడియా, ముఖ్యంగా ఇంగ్లీష్ వార్తా పత్రికలూ, టీవీ ఛానళ్లూ 'టెర్రరిజం' అనే పదాన్ని ఉపయోగిస్తూ సాయుధ పోరాటం గురించి గగ్గోలు పెడుతూ వస్తున్నాయి. వీరు ఉద్దేశపూర్వకంగానే తమిళ ఈళం పోరాట చరిత్రను వక్రీకరించి, దాని గురించి అబద్ధాల్ని ప్రచారం చేస్తున్నారు. అప్పటినుంచి ఎల్.టి.టి.ఇ. కొద్ది సంవత్సరాల కాలంలోనే ప్రత్యేక ఈళం పోరాటానికి ప్రాతినిధ్యం వహించే అత్యంత ప్రముఖ సంస్థగా ఎదిగింది; ఈ క్రమంలో వారు భారత ప్రభుత్వానికి లేదా శ్రీలంక ప్రభుత్వానికి దాదాపుగా ఏజెంట్లుగా మారిపోయిన మిగతా సంస్థల్ని హింసాత్మకంగా అణచివేశారు.

## అంతర్యుద్ధం, శాంతి చర్చలు

1983 జూలైలో, ఎల్.టి.టి.ఇ. దేశ ఉత్తర ప్రాంతంలో మిలిటరీ పై దాడి చేసి 13 మంది సైనికుల్ని చంపేసింది. జాతి ఉన్మాద సెంటిమెంట్లను రెచ్చగొట్టి శ్రీలంక ప్రభుత్వం కొలంబోలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఊచకోతల్నీ, నిర్మూలనా దాడుల్ని ఎక్కుపెట్టింది. దాదాపు నాలుగు వేల మంది తమిళులు చనిపోయారు. వేలాది మంది సింహళ ఆధిక్యత గల ప్రాంతాల నుండి పారిపోయారు. ఇది అంతర్యుద్ధానికి లేదా **మొదటి ఈళం యుద్ధానికీ** ఆరంభంగా నిలిచింది.

1983లో అంతర్యుద్ధం ప్రారంభమయిన తర్వాత నుండి, ఇటీవలి ఎల్.టి.టి.ఇ. ఓటమి వరకూ నాలుగు యుద్ధాలూ, నాలుగుసార్లు శాంతి చర్చలూ జరిగాయి. మొదటి శాంతి ప్రక్రియ భారత విస్తరణవాదుల జోక్యంతో భూటాన్ రాజధాని థింపులో 1985లో ప్రారంభమైంది. ఎల్.టి.టి.ఇ., ఇతర మిలిటెంట్ గ్రూపులు తమిళులకు ప్రత్యేక సర్వసత్తాక రాజ్యం అనే డిమాండ్‌ను వదులుకొని, తమిళుల్ని ఒక జాతిగా గుర్తించాలనీ, శ్రీలంక ఉత్తర, తూర్పు ప్రాంతాల్ని ఒకటే భాగంగా (ఎంటిటీ) గుర్తించాలని ఈళం మాతృభూమికి గల విడిపోయే హక్కుతో సహా స్వయం నిర్ణయాధికార హక్కుని గుర్తించాలని డిమాండ్లు రూపొందించుకొని చర్చల్లో పాల్గొన్నాయి. తమిళ ప్రజల న్యాయమైన ఆకాంక్షలను శ్రీలంక ప్రభుత్వం ఆమోదించ నిరాకరించడంతో చర్చలు విఫలమయ్యాయి.

కానీ భారత శ్రీలంక ప్రభుత్వాలు 1987 జూలై 29న ఇండో–శ్రీలంక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఇందులో ఈళం ప్రజల, జాతి విముక్తి పోరాటం చేస్తున్న మిలిటెంట్ గ్రూపుల ప్రాతినిధ్యం గానీ, భాగస్వామ్యంగానీ లేనే లేవు. అందుకు బదులుగా అప్పటివరకు తమిళనాడులో మిలిటెంట్ గ్రూపులకు బేసుల్ని ఏర్పర్చుకోవడానికి అనుమతినిచ్చి వారికి ఆయుధాలనూ, మందుగుండునూ, శిక్షణనూ అందించిన భారత విస్తరణవాదులు వారిపై ఈ ఒప్పందాన్ని రుద్దారు. శ్రీలంక ప్రభుత్వం రాజ్యాంగానికి 13వ సవరణను తీసుకువచ్చింది. ఇది తమిళ ప్రజలకు కొన్ని అధికారాల్ని ఇవ్వడానికి ఉద్దేశించినది. ఎల్.టి.టి.ఇ., తమిళ ఈళం ప్రజలు ఈ ఒప్పందాన్ని నిరాకరించారు. ఎందుకంటే దీని ప్రకారం వారికి సింహళ యూనిటరీ ప్రభుత్వం కింద ఒక ప్రావెన్షియల్ కౌన్సిల్ ఏర్పర్చుకొనే అవకాశం మాత్రం లభిస్తుంది. న్యాయమైన వారి స్వయం నిర్ణయాధికార హక్కుకు ఇది ఎంతో సుదూరంలో వున్నది. అంతేగాక, ఈ ఒప్పందం అమలుకై భారత ప్రభుత్వం ఒక లక్షా నలభై వేల మంది సైనికులు గల 'శాంతి సైన్యాన్ని' శ్రీలంక ఉత్తర, తూర్పు ప్రాంతాలకు తరలించింది. ఈవిధంగా భారతదేశ వ్యూహాత్మక ప్రయోజనాలను ఈ భారత–శ్రీలంక ఒప్పందం నెరవేర్చింది. శ్రీలంక ప్రభుత్వం 'భారత ప్రయోజనాలకు భంగం కలిగించే విధంగా వేరే ఏ దేశమూ త్రింకోమలిని గానీ, శ్రీలంకలోని ఏ ఇతర నౌకాశ్రయాలను గానీ మిలిటరీ పరంగా ఉపయోగించుకోకుండా వుండేలా చూస్తామని' భారత దేశానికి హామీ ఇచ్చింది.

భారత ప్రభుత్వం నిర్వహించిన పాత్ర, జాతి విముక్తి కోసం న్యాయంగా పోరాడుతున్న వారి మనస్సుల్లో సందేహాలకు దారి తీసింది. భారత ప్రభుత్వం తమకు వెన్నుపోటు పొడిచి ద్రోహం చేసిందని వారు భావించారు. శాంతి చర్చలు కొనసాగుతుండగానే భారత దేశానికీ, ఎల్.టి.టి.ఇ.కి మధ్య సంబంధాలు మరింతగా దిగజారాయి. 1988 అక్టోబర్ 4న శ్రీలంక నావికా దళం ఒక పడవను స్వాధీనం చేసుకొని పులేంద్రన్, కుమరప్ప అనే పైస్థాయి నాయకులతో సహా 17 మంది ఎల్.టి.టి.ఇ. కార్యకర్తలను పాయింట్ పెడ్రో వద్ద అరెస్టు చేసింది. భారత ప్రభుత్వాన్ని జోక్యం చేసుకొని వారిని విడుదల చేయించమని ఎల్.టి.టి.ఇ. కోరింది. భారతదేశం ద్వంద్వ ప్రమాణాలతో వ్యవహరిస్తున్న తీరును నిరసిస్తూ ఎల్.టి.టి.ఇ. రాజకీయ విభాగం నాయకుడు లెఫ్టినెంట్ కల్నల్ దిలీపన్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి, ఫలితంగా మరణించాడు. కానీ ఖైదీల్ని కొలంబోకు తరలిస్తున్న శ్రీలంక ప్రభుత్వానికి భారత ప్రభుత్వం లోపాయికారీగా మద్దతుగా నిలిచింది. ఫలితంగా, జైల్లోని ఎల్.టి.టి.ఇ. కార్యకర్తలందరూ సామూహికంగా ఆత్మహత్య చేసుకున్నారు. ఇది ఘర్షణలకూ, నిరసనలకూ దారి తీసింది. శాంతి చర్చలు ఆగిపోయాయి, అంతర్యుద్ధం

తిరిగి ప్రారంభం అయింది. శ్రీలంక ప్రభుత్వం ఈ తిరుగుబాటును అణచివేయమని ఐ.పి.కె.ఎఫ్.ను కోరింది. 1988 అక్టోబర్ 9న ఐ.పి.కె.ఎఫ్. ఎల్.టి.టి.ఇ.పై 'ఆపరేషన్ పవన్' పేరుతో దాడిని ఎక్కుపెట్టింది.

కొద్ది వారాల్లోనే ఈ ఆపరేషన్ పూర్తయిపోతుందని వారు ఆశించారు. కానీ అందుకు భిన్నంగా, ఐ.పి.కె.ఎఫ్. యుద్ధంలో కూరుకుపోయి 17 వందల మంది సైనికుల్ని కోల్పోయింది. వేలాది మంది గాయపడ్డమో, వికలాంగులు కావడమో జరిగింది. ఎట్టకేలకు 1990 మార్చిలో వారు అవమానకరంగా, బలవంతంగా అక్కడి నుండి వెనక్కు రావాల్సి వచ్చింది.

భారత, శ్రీలంక ప్రభుత్వాలు కలిసికట్టుగా తుపాకీని ఎక్కుపెట్టి ఈశాన్య ప్రావెన్షియల్ కౌన్సిల్‌కి ఎన్నికలను ప్రజలపై రుద్దాయి. ఎల్.టి.టి.ఇ. ఎన్నికల్ని బహిష్కరించగా, ఇ.పి.ఆర్.ఎల్.ఎఫ్. వంటి భారత విస్తరణవాదుల తొత్తులయిన ఇతర మిలిటెంట్ గ్రూపులు ఎన్నికల్లో పాల్గొన్నాయి. నేటికీ కూడా భారత ప్రభుత్వమూ, దాని వందిమాగధులు 1987లో భారత విస్తరణవాదులు రుద్దిన ఈ 'పరిష్కారం'పై ఆధారపడి 'జాతి ఘర్షణ'కు బూటకపు పరిష్కారం వెతకాలని గొంతు చించుకుంటున్నారు. అయితే సింహళ, బౌద్ధ జాతి ఉన్మాదులు తమిళులకు ఈ నామమాత్రమైన 'అధికారాల బదలాయింపు'ను కూడా వ్యతిరేకించారు. పిమ్మట, శ్రీలంక సుప్రీంకోర్టు ఈ 13వ అధికరణాన్ని 'రాజ్యాంగ వ్యతిరేకమైనది'గా పేర్కొంటూ కొట్టివేసింది.

ఒప్పందంపట్ల వ్యతిరేకతా, భారత సైనిక బలగాల ఉనికిపట్ల వ్యతిరేకత సింహళ ప్రజల్లో కూడా ఊపందుకుంది. తమ బద్ధ విరోధులైన ఎల్.టి.టి.ఇ.కి ప్రేమదాస ప్రభుత్వం భారత సాయుధ బలగాలకు వ్యతిరేకంగా పోరాడడానికి ఆయుధాల్ని కూడా సప్లయి చేసింది. తన అధికారానికి రాగల ప్రమాదాన్ని గ్రహించి ప్రేమదాస ప్రభుత్వం ఐ.పి.కె.ఎఫ్.ను వెనక్కు వెళ్ళిపొమ్మని కోరింది. 1989 సార్వత్రిక ఎన్నికల్లో రాజీవ్ గాంధీ ఓటమితో, తమిళనాడు తెస్తున్న ఒత్తిడి వల్ల, వి.పి.సింగ్ ప్రభుత్వం 1990 మార్చిలో ఐ.పి.కె.ఎఫ్.ను వెనక్కి రమ్మని ఆదేశించింది. ఐ.పి.కె.ఎఫ్. వెనకకు మరలాక, ఎల్.టి.టి.ఇ.కీ, కొలంబోకు మధ్య తాత్కాలికంగా శాంతి కాలం నెలకొంది. కానీ తిరిగి 1990 జూన్‌లో యుద్ధం మొదలైంది. ఆవిధంగా **రెండవ ఈళం యుద్ధం** ఆరంభమైంది.

ఐ.పి.ఎ.ఎఫ్. వెనుకకు మరలాక, ఎల్.టి.టి.ఇ. ఉత్తర, తూర్పు ప్రాంతాల్లో తన స్థితిని సంఘటిత పర్చుకుంది. ఎల్.టి.టి.ఇ. తో శాంతి అనే నినాదంతో చంద్రిక కుమారతుంగ పీపుల్స్ అలయెన్స్ (పి.ఎ.)అధికారంలోకి వచ్చాక, 1995 జనవరిలో ఇరువురూ యుద్ధ విరమణ ఒప్పందంపై సంతకాలు చేసి చర్చలు ప్రారంభించారు. కానీ శ్రీలంక ప్రభుత్వ పట్టు విడుపులు లేని ధోరణి వల్ల ఇవి కూడా విఫలమైనాయి. 1995 ఏప్రిల్‌లో **మూడం ఈళం యుద్ధం** ఆరంభమైంది. శ్రీలంక ఎయిర్ ఫోర్స్ జెట్ విమానాలు నవలి వద్ద సెయింట్ పీటర్స్ చర్చి మీద బాంబులు వేసి 125 మంది పౌరుల్ని చంపి, మరో 150 మందిని గాయపరచడంతో శ్రీలంక ప్రభుత్వ దాడి మరింత రక్తసిక్తంగా మారిపోయింది. ఏడు వారాల తీవ్ర యుద్ధం తర్వాత ప్రభుత్వ బలగాలు జాఫ్నాను దశాబ్ద కాలంలో మొదటిసారిగా తమ ఆధీనంలోకి తెచ్చుకోగలిగాయి. 'విజయా'నికి చిహ్నంగా శ్రీలంక రక్షణ మంత్రి అనిరుద్ధ రత్తవతే 1995 డిసెంబర్ 5న జాఫ్నా ఫోర్ట్ (కోట)లో జాతీయ జెండాను ఎగురవేశాడు. దాదాపు రెండు వేల అయిదు వందల మంది తిరుగుబాటుదారులూ, సైనికులు ఈ దాడిలో చనిపోయారనీ, దాదాపు ఏడు వేల మంది గాయపడ్డారని ప్రభుత్వం అంచనా కట్టింది.

1999లో ఎల్.టి.టి.ఇ. 'ఆపరేషన్ అలుపెరుగని అలలు' (ఒయాద అలైగళ్)తో పాటు మరో 17 దాడులతో శత్రువుపై తన ఎదురు దాడిని ఎక్కుపెట్టి కోల్పోయిన భూభాగాలన్నింటినీ తిరిగి స్వాధీనం చేసుకుంది. మూడు రోజుల కంటే తక్కువ కాలం పట్టిన ఈ ఒక్క ఆపరేషన్‌లోనే ఎల్.టి.టి.ఇ. పన్నెండు వందలకుపైగా శ్రీలంక సైనికుల్ని హతమార్చింది. రెండు దేశాలు సంప్రదాయక యుద్ధంలో తలపడినట్లుగా ఉండింది. అది ఎలిఫెంట్‌పాస్‌ను కూడా ఆపరేషన్ కప్పు (ఫాగ్) ద్వారా విజయవంతంగా స్వాధీనం చేసుకొంది. తర్వాత అది కిలినోచ్చి పట్టణంలోనూ, చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ వున్న శ్రీలంక సాయుధ బలగాలకు చెందిన అన్ని సముద్ర, భూభాగ సప్లయి లైన్లనూ తెంపేసింది. 2000 ఏప్రిల్ 22న పదిహేడు ఏళ్లుగా జాఫ్నా ద్వీపకల్పాన్ని వన్నీ ప్రధాన భూభాగం నుండి వేరుపరుస్తుండిన ఎలిఫెంట్ పాస్ మిలిటరీ కాంప్లెక్స్ (సముదాయం) పూర్తిగా ఎల్.టి.టి.ఇ. స్వాధీనమయింది. జాఫ్నాలోని దాదాపు 40 వేల శ్రీలంక బలగాల్ని ఎల్.టి.టి.ఇ. చుట్టుముట్టింది. వారు చాలా ఘోరమైన స్థితిలోకి నెట్టబడ్డారు. లొంగిపోవడమో, ఊచకోతకు గురవ్వడమో తప్ప వారికి వేరే మార్గం మిగల్లేదు. భారత, అమెరికా ప్రభుత్వాల జోక్యంతో మాత్రమే ఇది నివారించబడింది. వాజ్‌పేయ్ ప్రభుత్వం అంతకంటే ముందుకు అడ్వాన్స్ అవ్వద్దనీ, అలా జరిగితే సీరియస్ పరిణామాలకు సిద్ధం కావాల్సి వుంటుందని ఎల్.టి.టి.ఇ.ని బహిరంగంగానే హెచ్చరించింది. శ్రీలంక సైనికుల్ని కాపాడడానికి అది నావికాదళ నౌకల్ని కూడా పంపింది. అమెరికా, భారత ప్రభుత్వాల హెచ్చరికల్ని బేఖాతరు చేయడానికి సిద్ధంగాలేని ఎల్.టి.టి.ఇ. ఇక ముందుకు అడ్వాన్స్ కాలేదు.

*(మిగతాది వచ్చే సంచికలో)*

(...4వ పేజీ తరువాయి)

ఎన్‌కౌంటర్లను నిరోధించి ప్రజానుకూల విధానాలను అనుసరించాల్సి వుంది.

ప్రత్యేక తెలంగాణ సాధన జరిగేవరకూ పోరాడడంతోపాటు కేంద్ర ప్రభుత్వం, ఆంధ్ర దోపిడీవర్గాల ప్రతికూల ఎత్తుగడలను, తెలంగాణా ఉద్యమంలోకి చొరబడే అవకాశవాదాన్ని ఎదుర్కొంటూ నిరంతరం అప్రమత్తంగా వుండాలి.

ఉస్మానియా యూనివర్సిటీలో పదివేల మంది పోలీసు బలగాలను పెట్టి 20 మార్గాలను ఇనుప కంచెలతో మూసి అడుగడుగునా ఆటంకాలు కల్పించినా దారిపొడుగునా బతుకమ్మలాడుతూ, పీర్ల పండుగలుచేస్తూ లక్షలాది మంది విద్యార్థులు, ప్రజలు వచ్చి హైకోర్టు ఇచ్చిన రెండున్నర గంటల పర్మీషన్‌తో జనవరి 3న విద్యార్థి గర్జన సభను శాంతియుతంగా గొప్ప క్రమ శిక్షణతో నిర్వహించుకున్నారు. ప్రజలకు పోరాట సందేశాన్ని అందించారు.

ఉస్మానియా విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేశారు. భాష్ప వాయువు ప్రయోగించారు. వందల మందిని అరెస్టులు చేసి ఒక్కొక్కరిపై 30కి పైగా కేసులు పెట్టారు. కేంద్రం కేసులు ఉపసంహరిస్తామని జనవరి 9న ప్రకటనలో చెప్పి కూడా మాట నిలబెట్టుకోలేదు. వుద్యమ బాట వీడితేనే కేసులు ఉపసంహరిస్తామని బెదిరిస్తున్నది ప్రభుత్వం. విద్యార్థి ఉద్యమాన్ని అణచడానికి, విచ్ఛిన్నం చేయడానికి ప్రభుత్వం పథకం ప్రకారం ప్రయత్నిస్తున్నా విద్యార్థులు మొక్కవోని దీక్షతో పని చేయడంతో ఉద్యమం ఒక మలుపు తిరిగింది. ఉస్మానియా, తెలంగాణా విశ్వవిద్యాలయాల విద్యార్థులు తమ నేలను, తమ ప్రజల్ని విముక్తి చేసే లక్ష్యంతో గర్జన చేశారు. ఫ్రెంచి ఉద్యమాన్ని, అసోంలోని విద్యార్థి ఉద్యమాల్ని గుర్తు చేసిన ఈ విద్యార్థి గర్జన ఆ సమర నినాదాలు ప్రపంచానికే ఒక కొత్త సందేశాన్నిస్తున్నాయి. కేంద్రం చేసే కుట్రలను నిబ్బరంగా ఎదుర్కోగలమన్న విశ్వాసాన్ని తెలంగాణా ప్రజల్లో కల్పిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ నాయకత్వంలో వున్న అవకాశవాదాన్ని సరిచేయగలరన్న నమ్మకాన్నీ కలిగిస్తున్నారు. ఇదే సందర్భంలో ఫిబ్రవరి 6న వరంగల్ పాలికేకలో వ్యక్తమయిన అపోహలను తొలగించుకోవాల్సిన అవసరం వుంది. ఉద్యమ విచ్ఛిన్నానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఐక్యంగా ఎదిరించాలి.

40 శాతం జనాభా, 42 శాతం భౌగోళిక విస్తీర్ణం, 40 శాతం రెవెన్యూ కలిగిన ప్రత్యేక తెలంగాణాను ప్రత్యేక రాష్ట్రంగా విడగొట్టడానికి తెలంగాణా ప్రజలు అయిదు దశాబ్దాలుగా ఉద్యమిస్తుంటే అడ్డుకునే శక్తులు బలంగానే వున్నాయి. ఆంధ్ర ప్రాంత దోపిడీవర్గ ప్రయోజనాలు, కేంద్ర ప్రభుత్వంలోని దోపిడీ వర్గాల ప్రయోజనంతో ముడిపడి వుండటంతో ఏ చిన్న కారణం కనబడినా విభజనను వాయిదా వేసేందుకు కేంద్రం సిద్ధంగా వుంది. డిసెంబరు 9 నాటి "విభజన ప్రక్రియను ప్రారంభించడం" అనే చిదంబరం ప్రకటనకు భిన్నంగా డిసెంబరు 23 నాటి ప్రకటన వుంది. కేంద్ర ప్రభుత్వం మాట మార్చింది. జనవరి 5న ఢిల్లీలో ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశం కూడా సమస్యను మరింతగా సాగదీయడానికే. దాని తర్వాత విభజనను వాయిదావేసి 2004లో వేసిన 'ప్రణబ్ కమిటీ' లాంటి పనిచెయ్యకుండా వుండే శ్రీ కృష్ణ కమిటీని వేసి తాత్సారం చేస్తున్నది. శ్రీకృష్ణ కమిటీని బహిష్కరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి. ఈ కమిటీలు కాలహరణం చేయడం తప్ప సమస్యలను పరిష్కరించవని చరిత్ర పొడవునా అనేక కొండ గుర్తులు ఉండనే వున్నాయి. తెలంగాణా జె.ఎ.సి. ఇప్పటికే కమిటీని బహిష్కరించాలని తీసుకున్న నిర్ణయం తెలంగాణ ప్రజలకు కమిటీ పట్ల వున్న వ్యతిరేకతను వ్యక్తపరుస్తున్నది. కాబట్టి మిలిటెంట్ ప్రజా ఉద్యమాన్ని ప్రత్యేక తెలంగాణ విభజన పూర్తయ్యేవరకూ కొనసాగించాలని తెలంగాణా ప్రజలు గుర్తించాలి. జనవరి 3న విజయవంతమైన విద్యార్థి గర్జన స్ఫూర్తితో ఉద్యమాన్ని ఉన్నతంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నాం. రాష్ట్ర విభజన పట్ల ఆంధ్ర, రాయలసీమ ప్రజల్లోకి దోపిడీ పాలకవర్గాలు, స్వార్థపరశక్తులు చొప్పించిన భయాందోళనలను పోగొట్టడం ఉద్యమ విధానంగా వుండాలి. వారిపై దాడులు జరగకుండా చూడాలి. అన్ని ప్రాంతాల ప్రజల సమస్యలను సమానంగా చూస్తామని ఉమ్మడి శత్రువులకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడగలమని, వారు కల్పించే విచ్ఛిన్న కుట్రలకు ప్రభావితం కామని, ఇది ఆంధ్ర, రాయలసీమ ప్రజలకు వ్యతిరేకం కాదని, దశాబ్దాల నిర్లక్ష్యం, అణచివేతల ఫలితంగా ముందుకొచ్చిన ఉద్యమమని, ఇది తెలంగాణా ప్రజలందరి ఆకాంక్ష అని, ప్రజాస్వామికమైన సహజమైన న్యాయమైన డిమాండ్ అనీ ప్రభుత్వాలు కావాలని నిర్లక్ష్యం చేస్తున్నాయని, అన్ని ప్రాంతాల ప్రజల మద్దతు అవసరమని, ఆ బాధ్యతను, విశ్వాసాన్ని కల్పించాలి. సమైక్యాంధ్ర వుద్యమం నడుపుతున్న స్వార్థ రాజకీయ శక్తులను ఓడించి ఆంధ్ర ప్రజలు ప్రత్యేక తెలంగాణా ఉద్యమానికి మద్దతునివ్వాలనీ, సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. ★

**శ్రీకృష్ణ కమిటీని బహిష్కరిద్దాం, కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొడుదాం!**
**మిలిటెంట్ పోరాటాలే తెలంగాణ సమస్యకు మార్గాన్ని సుగమం చేస్తాయి!!**

# 'బాబ్రీ' గాయానికి లిబర్హాన్ కమీషన్ నివేదిక ఉపశమనం కల్గిస్తుందా?

గత సంవత్సరాంతంలో ప్రసార మాధ్యమాల్లో బాగా నలిగిన ఒకానొక అంశం –లిబర్హాన్ కమీషన్. పార్లమెంట్ ఉభయ సభల్లోనూ ఈ అంశంపై మూడు, నాలుగు రోజులు దుమారం రేగింది. బాబ్రీ మసీదు కూల్చివేత ఘటనపై విచారణ జరపడానికి నియమితమైన లిబర్హాన్ కమీషన్ నివేదిక వెల్లడించిన అంశాలు, కొద్దిరోజులపాటు ప్రసార మాధ్యమాలకు పనిని కల్పించాయి, పార్లమెంటులో ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకోవడానికి అధికార, ప్రతిపక్ష వర్గాలకు అవకాశాన్నీ కల్పించాయి.

ఈ కమీషన్ వెలువరించిన నివేదిక గురించి వ్యాఖ్యానించుకోవడానికి ముందు ఈ కమీషన్ సాధించిన రికార్డు గురించి విశేషంగా చెప్పుకోవాలి.

మన దేశంలో జరిగిన అత్యంత లజ్జాదాయకమైన సంఘటనల్లో బాబ్రీ మసీదు కూల్చివేత ఒకటి. చరిత్ర పుటల్లో చీకటి అధ్యాయంగా చోటు చేసుకున్న ఈ ఘటన జరిగింది 1992 డిసెంబర్ 6న. ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య నగరంలో 1528–29లో ఈ చారిత్రక కట్టడాన్ని మొఘల్ సామ్రాజ్య వ్యవస్థాపకుడు బాబర్ కట్టించాడు. అయోధ్య నగరం రాముడి జన్మ స్థలమనీ, బాబ్రీ మసీదు ఉన్న ప్రదేశంలో రాముడి గుడి వుండేదనీ, దాన్ని కూలగొట్టి బాబ్రీ మసీదును నిర్మించారనే ఒక వివాదాన్ని 80 దశకం ప్రారంభం నుంచీ సంఘ్ పరివార్ ముందుకు తెచ్చింది. రాముడికి సంబంధించిన చారిత్రక ఆధారాలే లేనప్పుడు అయోధ్యను రాముడి జన్మభూమి అనడంలో అర్థమే లేదన్న విషయాన్ని ప్రస్తుతం పక్కన పెట్టేసినా, రాముడి గుడిని కూల్చి మసీదును కట్టారనడానికి ఏమాత్రం చారిత్రక ఆధారాలు లేవు. చారిత్రక ఆధారాలు లేని ఒక అంశాన్ని పుక్కిటి పురాణాలను ఆధారం చేసుకొని వివాదాస్పదం చేయడం వెనుక, దేశంలోని మెజారిటీ హిందువుల మనోభావాలను రెచ్చగొట్టి, ఓటు బ్యాంకుగా మలచుకోవాలనే రాజకీయ కుట్ర తప్ప మరేమీ లేదు. 1984లో సంఘ్ పరివారం వివాదస్పద స్థలంలో రాముడి గుడి కట్టించాలనే డిమాండ్‌తో రామ జన్మభూమి ఉద్యమాన్ని ప్రారంభించింది. 1989లో శిలాన్యాస్ (గుడి కట్టడానికి శంకుస్థాపన) జరిగింది. 1990లో గుడి కట్టడం కోసం కరసేవకులను అయోధ్యకు రావాల్సిందిగా పిలుపునిచ్చింది. అక్టోబర్ 30 నాటికి 40వేల మంది కరసేవకులు అయోధ్యను ముట్టడించగా పోలీసు కాల్పులు జరిగాయి. అప్పటికి ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసిన రామ జన్మభూమి నేతలు 1992లో మళ్లీ మొదలుపెట్టి డిసెంబర్ 6న బాబ్రీని కూల్చివేశారు. ఈ కూల్చివేతకు అద్వానీ, బాల్ థాకరే, మురళీ మనోహర్ జోషి సహా మరెందరో బిజెపి, సంఘ్ పరివార్ నేతలు ప్రత్యక్షంగా నాయకత్వం వహించారు.

బాబ్రీ కూల్చివేత వెనుక ఉద్దేశ్యమూ స్పష్టమే, కూల్చిన దోషులెవరో స్పష్టమే, కూల్చివేతను అడ్డుకునే అధికారమూ, అవకాశమూ పి.వి. నరసింహారావు నాయకత్వంలోని నాటి కేంద్ర సర్కార్‌కు వుండే. కానీ అడ్డుకోవడానికి ఎటువంటి ప్రయత్నాలూ చేయకుండా కూల్చివేతకు తనవంతు సాయం చేసిన కేంద్ర సర్కార్, కాంగ్రెస్ పార్టీ తీరూ స్పష్టమే. అంతా ప్రజలకు తేట తెల్లమే. ఇంత స్పష్టంగా గోచరిస్తున్న విషయంపై విచారణకు గాను ఒక కమీషన్‌ను వేయడమే హాస్యాస్పదం. ఈ సంఘటనను విచారించి తగిన శిక్షలు వేయడానికి మనకు వున్న కోర్టులూ, చట్టాలూ సరిపోతాయి. కానీ ఏ విషయాన్నైనా తొందరగా తేల్చకుండా కాలయాపనతో నాన్చడం కోసం, న్యాయాన్ని సమాధి చేయడం కోసం కమీషన్లు వేయడం ప్రభుత్వాలకు అలవాటయిపోయింది. బాబ్రీ విధ్వంసం జరిగిన సరిగ్గా పదిరోజులకు డిసెంబర్ 16న ఏర్పాటయిన లిబర్హాన్ కమీషన్ మూడు నెలల్లో నివేదికను సమర్పించాలని ప్రభుత్వం గడువు పెట్టింది. కానీ ఈ గడువులు అక్షరాల నలభై ఎనిమిది సార్లు పొడిగించబడి పదహారున్నర ఏళ్లకు గానీ అది తన నివేదికను ప్రభుత్వం ముందుంచ లేకపోయింది. కమీషన్ ఏర్పాటయిన దాదాపు పదిహేడేళ్లకు 2009 నవంబర్ 24న ఈ నివేదిక పార్లమెంటులో ప్రవేశపెట్టబడింది. దేశ చరిత్రలో అత్యంత సుదీర్ఘకాలం సాగిన విచారణగా లిబర్హాన్ కమీషన్ రికార్డ్ సృష్టించింది. విచారణ కోసం చేసిన ఖర్చు 8 కోట్లు!

బాబ్రీ మసీదు కూల్చివేత అనేది ఎంత పెద్ద నేరమో చెప్పడానికి కొలమానం అనేది లేదు. ఈ దేశంలో పుట్టిపెరిగి, ఈ దేశ చరిత్రలో భాగమైన కొన్ని కోట్ల మంది ప్రజలను, కేవలం హిందూ మతంలో పుట్టని కారణంగా తీవ్ర అభద్రతకు గురి చేసిన సంఘటన అది. రాముడి జన్మభూమి మాటేమో గానీ కొన్ని కోట్ల మైనారిటీ మత ప్రజానీకాన్ని తమ జన్మభూమికి పరాయివాళ్లను చేసిన సంఘటన అది. ఈ దేశంలోని అల్ప సంఖ్యాక వర్గాల మనోభావాలనే కాదు, లౌకిక వాదులైన ప్రతి ఒక్కరి మనోభావాలను తీవ్రంగా గాయపరిచిన సంఘటన. ప్రతి ఒక్కర్ని తీవ్రంగా కుదిపేసిన సంఘటన. ఏ బి.జె.పి.నో, శివసేననో, విశ్వహిందూ పరిషత్తో, లేదా మొత్తంగా సంఘ్ పరివారో హిందూ మతోన్మాదంలో మునిగి తేలుతున్నాయి, అవి మాత్రమే అల్పసంఖ్యాక వర్గాలకు వ్యతిరేకంగా వున్నాయి అనుకుంటే, ఇంత అభద్రత కలగదు. కానీ మొత్తంగా రాజ్యాన్నే హిందూ మతోన్మాదం

ఆవహించిందని స్పష్టంగా అర్థం కావడం వల్ల కలిగిన అభద్రత అది.

ఇంతగా, ఇంతమందినీ, కలత పెట్టిన ఈ సంఘటనపై వీలయినంత త్వరగా విచారణ ముగియడమూ, దోషులకు శిక్షలు పడ్డమూ అవసరం. అది బాధితులకు కొంతలో కొంతయినా వుపశమనాన్నిస్తుంది. ముఖ్యంగా దేశ లౌకికతపై కోల్పోయిన విశ్వాసం తిరిగి కొంతైనా నిలబడుతుంది.

ఈ కమీషన్ విచారణకూ, నివేదిక రచనకూ ఇంత సుదీర్ఘ కాలం పట్టడానికి జస్టిస్ లిబర్హాన్‌కు వుండాల్సిన కారణాలు ఆయనకు వున్నాయి. నిజానికి మనం ఒక వ్యక్తి అలసత్వమో, అసమర్థతో, బాధ్యతా రాహిత్యమో, ఈ ఆలస్యానికి కారణమని అనుకోలేం. ఈ ఆలస్యానికి మొత్తంగా వ్యవస్థనే దోషిగా నిలబెట్టాలి.

ఇంత సుదీర్ఘ విచారణ తర్వాత జస్టిస్ లిబర్హాన్ తేల్చిందేంటో కూడా కొంతయినా చెప్పుకుందాం. బాబ్రీ మసీదు కూల్చివేత యాధృచ్ఛికంగా జరిగింది కాదనీ, పకడ్బందీగా రచించిన ప్రణాళిక మేరకే జరిగిందని నివేదిక పేర్కొంది. బిజెపి నాయకులు వాజ్‌పేయ్, ఎల్.కె. అద్వానీ, జోషి, ప్రమోద్ మహాజన్; శివసేన నేతలు బాల్‌థాకరే, వినయ్ కతియార్; ఆర్.ఎస్.ఎస్. నేత గోవిందాచార్యా, సంత్ సమాజ్ నేత సాధ్వి రితంబర; వి.హెచ్.పి నేతలు గిరిరాజ్ కిషోర్, అశోక్ సింఘాల్, ప్రవీణ్ తొగాడియా, ఉమా భారతి, నాటి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి కళ్యాణ్ సింగ్ సహా 68 మంది సంఘ్‌పరివార్ నేతలూ, ఉత్తర ప్రదేశ్ అధికార యంత్రాంగమూ దోషులని తేల్చింది. వాజ్‌పేయ్ ముందురోజే (డిసెంబర్ 5నే) అయోధ్య నుండి తిరిగి వెళ్లిపోయినందువల్ల ప్రత్యక్షంగా సంఘటనలో పాల్గొనకపోయినా ముందు రోజు రెచ్చగొట్టే ప్రసంగాలు చేసి బాబ్రీ కూల్చివేతకు కారకుడయ్యాడని ఆరోపించింది. వాజ్‌పేయ్, అద్వానీ, జోషిలను కుహనా ఉదారవాదులని వ్యాఖ్యానించింది. సంఘటన జరిగిన రోజున తీవ్రమైన అధికార దుర్వినియోగం జరిగిందని విధ్వంసాన్ని చిత్రీకరించడానికి ప్రయత్నించిన ప్రసార మాధ్యమాల సిబ్బందిని బెదిరించారనీ, హింసించారనీ చెప్పింది. అంతే కాదు ఈ సంఘటన వెనుక రాజకీయాల్లో మతం కలగలిసిపోవడం కారణమనీ ఇది వ్యవస్థకు ప్రమాదకరమనీ పేర్కొంది.

ఇవేవీ కమీషన్ కొత్తగా తేల్చిన విషయాలు కావు. ఇవన్నీ ప్రజలకు ఎప్పుడో తేలిపోయిన విషయాలే. బాబ్రీ కూల్చివేత యాధృచ్ఛికంగా జరిగిన ఘటన అని, సంఘ్ పరివార్ ఎంత నమ్మబలికినా, వివేకం వున్న ప్రజలెవ్వరూ దాన్ని నమ్మలేదు. వాజ్‌పేయ్‌ని దోషిని చేయడం పట్ల బి.జె.పి. నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అదేదో చాలా అన్యాయమైన, ఘోరమైన ఆరోపణ అన్నట్టు మాట్లాడారు. కానీ వాజపేయ్ నిస్సందేహంగా దోషే! రాజకీయాల్లో మతం కల్సిపోయిందన్నదీ లిబర్హాన్ కొత్తగా కనుక్కున్నాడు కావొచ్చు, కానీ ఈ వాస్తవాన్ని సాధారణ ప్రజలు సైతం ఎన్నడో గ్రహించారు.

ఇలా అన్నీ అందరికీ తెల్సిన విషయాలే చెప్తే పస ఏముంటుందీ అనుకున్నాడేమో లిబర్హాన్, ఇంత వరకూ ఎవరికీ తెలియని కొన్ని కొత్త విషయాలను కూడా పేర్కొన్నాడు. అందులో ముఖ్యమైనది –పి.వి. నరసింహారావును నిర్దోషి అనడం. పరిస్థితిని అదుపు చేయడానికి కేంద్ర బలగాలను మోహరించడంగానీ, రాష్ట్రపతి పాలన విధించడంగానీ సరైంది కాదని పి.వి. భావించడం సమంజసమైనదని కమీషన్ భావించింది. ఇంకా మరికొన్ని విషయల్లో పి.వి. లేదా కేంద్రంలోని నాటి కాంగ్రెస్ సర్కార్ పాత్రపట్ల లిబర్హాన్ మౌనం వహించాడు. కేంద్ర ప్రభుత్వం పాత్ర తన విచారణ పరిధిలోకి రాదని కూడా సమర్థించుకున్నాడు. ఈ నివేదికపై పార్లమెంట్‌లో జరిగిన చర్చపై సమాధానం చెప్తూ చిదంబరం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ అంచనాలో పొరపాటు చేసిందని చెప్పి ఒక ఘోర తప్పిదాన్ని తేలిగ్గా సరిపెట్టేశాడు. కట్టడాన్ని రక్షిస్తామనే కళ్యాణ్‌సింగ్ వాగ్దానాన్ని పి.వి. నమ్మాడని చెప్పాడు. 1992 డిసెంబర్ 2 నాటికి అయోధ్యలో 2 లక్షల 60 వేల మంది కరసేవకులు చేరారు. ఇంత మంది చేరి కూడా బాబ్రీకి ముప్పు కలిగించరంటే ఎంత అమాయకులైనా నమ్మగలరా? కరసేవ పేరుతో రోజుల తరబడి కిక్కిరిసిన రైళ్లల్లో మతోన్మాదులు అయోధ్యకు ఎందుకు చేరుతున్నారో, చేరాక ఏం చేయబోతున్నారో దేశ ప్రధాని తెల్సుకోలేక పోయాడంటే దేశ ఇంటెలిజెన్స్ వ్యవస్థ తన తలను ఎక్కడ పెట్టుకోవాలి?

లేనిపోని వివాదం లేవదీసి బాబ్రీని ప్రత్యక్షంగా కూల్చిన మతోన్మాద పార్టీలే కాదు, పేరుకు మాత్రమే లౌకికతను వల్లించే కాంగ్రెస్ పార్టీ, అన్ని అవకాశాలు వుండి బాబ్రీని కాపాడలేకపోయిన నాటి కాంగ్రెస్ ప్రభుత్వమూ, దానికి నేతృత్వం వహించిన పి.వి. నిస్సందేహంగా నేరస్తులే. మతం రాజకీయాలు కలగలిసిపోయాయని లిబర్హాన్ అన్నది బహుశా హిందూమతోన్మాదాన్ని బహిరంగంగా రెచ్చగొట్టే మతోన్మాద పార్టీల గురించే అయివుంటుంది. కానీ కాంగ్రెస్ పార్టీ నేతలు కూడా మనువాద వారసులే కనుక హిందూమతంపై వారికీ పక్షపాతం వుంటుంది. అంతేకాదు హిందూమత ఓటు బ్యాంకును బి.జె.పి. ఎక్కడ కైవశం చేసుకుంటుందోననే భయంతో అది హిందూ మతానికి సానుకూలంగానే వ్యవహరిస్తుంది. మరోవైపు అల్పసంఖ్యాకుల ఓట్లు కూడా కావాలి కాబట్టి లౌకికతను వల్లిస్తుంటుంది. కాంగ్రెస్ చరిత్రను తడిమితే దాని ద్వంద్వ విధానానికి సంబంధించి ఎన్నో దృష్టాంతాలు కనబడుతాయి. బాబ్రీ విషయమే తీసుకుంటే– 1986లో బాబ్రీ మసీదు ఆవరణలోని వివాదాస్పద కట్టడం తలుపులు తెరిచి పూజ

చేసుకోవడానికి రాజీవ్ గాంధీ అనుమతించాడు (లిబర్హాన్ ఈ విషయంలోనూ మౌనమే వహించాడు). 1989లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అయోధ్య నుంచి తన ప్రచారాన్ని ప్రారంభించి రామరాజ్యాన్ని స్థాపించడానికి కట్టుబడి వున్నామని ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీకి వున్న ఈ మత వైఖరి వల్లనే బాబ్రీ కూల్చివేతను అడ్డుకోలేక పోయింది. అందుకే సాధారణ ప్రజలు సైతం ఈ దారుణంలో కాంగ్రెస్, పి.వి.ల నేర పాత్రను గుర్తించారు. లిబర్హాన్ గుర్తించక పోవడానికి కారణం – ఆయన రాజకీయ పక్షపాత వైఖరే!

ఇక్కడ ప్రభుత్వ భద్రతా బలగాల గురించి కూడా ఒక మాట చెప్పుకోవాలి. స్కూలు పిల్లలు పరీక్ష ఫీజులు తగ్గించమని అడిగినా లాఠీలూ తూటాలతో విరుచుకుపడే చరిత్ర వున్న ఈ 'భద్రతా' బలగాలు కరసేవకులను మాత్రం ఏమీ చేయలేకపోయాయి. డిసెంబర్ 6న విధ్వంస సమయంలో సంఘటనా స్థలంలో వుండిన 120 కంపెనీల సి.ఆర్.పి.ఎఫ్. బలగాలు ప్రేక్షక పాత్ర వహించాయి. ఈ విధంగా అధికార భక్తినీ, రామభక్తిని చాటుకున్న సి.ఆర్.పి.ఎఫ్. అధికారులను లిబర్హాన్ ఏమీ తప్పు పట్టలేదు.

68 మందిని దోషులుగా పేర్కొన్న లిబర్హాన్ వారికి ఎటువంటి శిక్షలను ప్రతిపాదించకపోవడం కూడా ఈ నివేదికలోని లోపం.

సరే! ఎన్నో లోపాలతోనైనా లిబర్హాన్ కమీషన్ నివేదిక ప్రభుత్వం ముందున్నది. మరి ప్రభుత్వం ఏం చేస్తుంది? ఈ నివేదికను సీరియస్‌గా తీసుకొని దోషులను శిక్షిస్తుందా? ఇటువంటి దుస్సంఘటనలను నిరోధించడం కోసం అంటూ కమీషన్ 65 సిఫార్సులను చేసింది. దాదాపు వాటన్నింటిని అంగీకరిస్తున్నట్టు చిదంబరం పార్లమెంటులో ప్రకటించాడు. నిజంగానే ఆ సిఫార్సులను పట్టించుకుంటుందా? శిక్షిస్తుందనీ, పట్టించుకుంటుందనీ అనుకుంటే మనం అమాయకులమైనా అవుతాం, 62 ఏళ్ల దేశ 'స్వాతంత్ర్య' చరిత్రలో ఇన్నాళ్లూ ఇటువంటి కమీషన్లకు ఎటువంటి గతి పడుతున్నదో తెలియని వాళ్లమైనా అవుతాం. 1984లో జరిగిన సిక్కుల ఊచకోతపై విచారణ జరిపిన నానావతి కమీషన్, 1992లో జరిగిన ముంబయ్ దాడులపై విచారణ జరిపిన శ్రీకృష్ణ కమీషన్ సహా దాదాపు నలభైకి పైగా ముఖ్యమైన కమీషన్ల నివేదికలు ఎలా చెత్తబుట్టపాలయ్యాయో ఈ సందర్భంగా గుర్తుతెచ్చుకోవడం అవసరం.

నివేదిక తేల్చిన దోషుల ప్రతిస్పందనను ఓసారి చూద్దాం. దోషులని లిబర్హాన్ నివేదిక సాక్షిగా మరోసారి సమాజమంతా వేలెత్తి చూపుతున్న సమయంలో, అద్వానీ అయోధ్య ఉద్యమంలో పాల్గొన్నందుకు గర్వపడుతున్నానన్నాడు. వినయ్ కతియార్ బాబ్రీని కూల్చిన ఆ రోజు అత్యంత ఆనందకరమైన దినం అన్నాడు. ఈ సంఘటనపై విచారం వ్యక్తం చేసే ప్రశ్నే లేదన్నాడు ఆర్.ఎస్.ఎస్. చీఫ్ మోహన్ భాగవత్, నాటి ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి కళ్యాణ్ సింగ్ కూలగొట్టినందుకు విచారపడాల్సిందీ లేదు, సిగ్గు పడాల్సిందీ లేదు అన్నాడు. ఒక చారిత్రక నేరాన్ని ఇంత నగ్నంగా సమర్థించుకుంటున్న ఈ నేతలను చూస్తే దేశ భవిష్యత్తుకు ఇంకెంత ముప్పు వాటిల్లనుందోననే ఆందోళన కలగక మానదు.

ఏ కమీషన్లూ, చట్టాలూ వీళ్ల మెడలు వంచలేవు. ప్రజా వుద్యమం మాత్రమే వీళ్లను శిక్షించగలదు! ఆ దిశగా ఉద్యమాలను ముందుకు తీసుకుపోవడమే దేశ ప్రజల ముందున్న కర్తవ్యం. ★

## ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను నిలిపివేయాలి

ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో అమాయకులైన ఆదివాసీలను హతమారుస్తూ, తమ ప్రజలపైనే భారత ప్రభుత్వం యుద్ధాన్ని ప్రకటించిందని అయిదు రాష్ట్రాల మానవ పౌరహక్కుల సంఘాల నేతలు అన్నారు. నాగాలాండ్, కర్ణాటక, తమిళనాడు, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లకు చెందిన సుమారు 40 మంది ప్రతినిధులు ఆదివారం భద్రాచలంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. మావోయిస్టు ఏరివేత పేరుతో చేపట్టిన ఆపరేషన్ గ్రీన్‌హంట్ కారణంగా ఆదివాసీల జీవితాలు చిధ్రమవుతున్నాయని అన్నారు. గత ఆరు నెలల కాలంలో ఒక దంతెవాడ జిల్లాలోనే 40 మందికి పైగా గిరిజనులను చంపేశారని తెలిపారు. గత ఏడేళ్ల కాలంలో వేయి మంది ఆదివాసీ మహిళలను సల్వాజుడుం, పోలీసులు ఎత్తుకెళ్లగా నేటి వరకూ వారి ఆచూకీ లేదని ఓ ఆదివాసీ తమతో చెప్పినట్లు తెల్పారు. బహుళజాతి సంస్థల కోసం విలువైన ఖనిజ సంపదను వారికి ధారదత్తం చేసేందుకు ప్రభుత్వం ఇటువంటి అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ విలేఖరుల సమావేశంలో ఎ.పి.సి.ఎల్.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి క్రాంతి చైతన్య, పి.యు.డి.ఆర్. ప్రతినిధి ప్రతీచౌహాన్, ఎన్.పి.ఎం.హెచ్.ఆర్. ప్రతినిధి తేరా వరేతన్, వషిం, ఎస్.గోపాల్, ఎన్.రుక్మిణి, దుడ్డు ప్రభాకర్, తిరుమల రావు, ఎన్.బాబయ్య, పి.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

(15 ఫిబ్రవరి ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

# అమరులకు వినమ్ర నివాళి

## ఉత్తర తెలంగాణ అమరులు

## మైదానంలో పోరు మంటలు రాజేస్తూ అశువులుబాసిన కామ్రేడ్స్ దయ, రమేష్, భాస్కర్ అమర్ రహే!

కరీంనగర్–ఖమ్మం–వరంగల్ (కె.కె.డబ్ల్యు.) డివిజన్‌లోని చిట్యాల–పెద్దపల్లి మైదానం ప్రాంతంలో ప్రజలను సంఘటితం చేయడం కోసం ఏర్పాటు చేసిన టీమ్‌కు చెందిన ముగ్గురు కామ్రేడ్స్‌ను రెండు వేరు వేరు ఘటనల్లో రాజ్యం పొట్టన పెట్టుకుంది. అనారోగ్యంతో హాస్పటల్‌కు వెళ్లిన కామ్రేడ్ రమేష్ (ఎసిఎం)ను పట్టుకొని చిత్రహింసలకు గురిచేసి 2009 అక్టోబర్ 21న వరంగల్ జిల్లా భూపాల్‌పల్లి మండలం చీపల్లి గ్రామం వద్ద హత్య చేసింది. కామ్రేడ్ రమేష్ నెత్తుటి తడి ఆరకముందే, పది రోజుల వ్యవధిలోనే అక్టోబర్ 31వ తేదీన వరంగల్ జిల్లా రేగొండ మండలం కొడవటంచ గ్రామం ద్రోహులు ఇచ్చిన విషాహారం తిని స్పృహ తప్పిపోయిన కామ్రేడ్స్ దయ (డివిసిఎం), భాస్కర్ (పిఎం)లను పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి క్రూరంగా కాల్చి చంపింది. ఈ రెండు ఘటనలను ప్రజలు నమ్మడానికి పోలీసులు ఎన్‌కౌంటర్ అనే కట్టుకథనే వినిపించారు.

దెబ్బతిన్న ఉత్తర తెలంగాణా ఉద్యమాన్ని పునర్నిర్మించే కర్తవ్యంలో భాగంగా 2009 ఆగస్టులో జరిగిన కె.కె.డబ్ల్యు. డివిజన్ సమావేశం తరువాత మైదాన ప్రాంత టీమ్ ఏరియాలోకి వెళ్లింది. ఓపెన్ కాస్ట్‌ల మూలంగా నిర్వాసితులవుతున్న ప్రజలను కలుస్తూ, సంఘటితం చేస్తూ, ఓపెన్‌కాస్టులకు వ్యతిరేకంగా కార్యక్రమం తీసుకున్నది. ఈ కామ్రేడ్స్ కొన్ని నిర్మాణాలు కూడా చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పని చేస్తూ పోలీసులకు సమాచారం చేరవేస్తూ, సానుభూతిపరులను అరెస్టు చేయిస్తున్న రామకిష్టపురానికి చెందిన సర్పంచ్ మోహన్‌రావును, శ్రీరాంపూర్ మండలంలో సమ్మిరెడ్డిని వీరు మట్టి కరిపించారు. ఈ చర్యలు మైదాన ఉద్యమంపై సకారాత్మక ప్రభావాన్ని వేశాయి. దీన్ని భరించలేని దోపిడి పాలకవర్గాలు, దోపిడి వర్గాల కిరాయి సైన్యం మైదాన టీమ్‌ను నిర్మూలించాలనే పథకం పన్నాయి. వెంటనే డి.జి.పి. గిరీష్ కుమార్ స్పందించి మాట్లాడుతూ ఉత్తర తెలంగాణలో నక్సలైట్ల కార్యకలాపాలు చురుకుగా పెరిగాయని దళాలను నిర్మూలించాలని ఆదేశాలు ఇచ్చాడు. టీమ్‌ను నిర్మూలించాలనే పథకంలో భాగంగా పోలీసు బలగాలు రంగంలోకి దిగాయి. ప్రజల్లో వుంటే పట్టుకోలేమని మోసపుటెత్తులు పన్నాయి. అనుకున్నట్లుగానే శత్రువుకు కాలం కలిసివచ్చినట్లు అనారోగ్యంతో బాధపడుతున్న కామ్రేడ్ రమేష్‌ను పట్టుకొని చంపగా, కామ్రేడ్స్ దయ, భాస్కర్‌లకు నమ్మిన వాడే, నల్లదండు ముఠా నాయకుడు సునీల్‌తో చేయి కలిపి, విషం కలిపిన ఆహారాన్ని ఇచ్చాడు. స్పృహ కోల్పోయిన ఈ కామ్రేడ్స్‌ను పోలీసులు పట్టుకొని పంట పొలాల్లో, సెలకల్లో వున్న రైతులను దూరంగా వెళ్లగొట్టి చిత్రహింసలు పెట్టి క్రూరాతి క్రూరంగా హత్య చేశారు.

### కామ్రేడ్ మంథని రాజు (దయ)

దయ అనే పేరుతో విప్లవోద్యమానికి సుపరిచితుడైన కామ్రేడ్ మంథని రాజు(32)ది వరంగల్ జిల్లా చిట్యాల ప్రాంతంలోని భూపాల్‌పల్లి మండలం జంగేడు గ్రామం. తల్లిదండ్రులు ప్రమీల, పోశయ్యలకు చివరి సంతానం. ఇతనికి ఒక అక్క, ఇద్దరు అన్నలు వున్నారు. కామ్రేడ్ రాజు 9వ తరగతి వరకు తను పుట్టి పెరిగిన ఊర్లోనే చదివాడు. చదువుకుంటూనే కుల వృతి అయిన క్షౌర పని కూడా నేర్చుకున్నాడు. చదువును మధ్యలోనే వదిలేసి కొంతకాలం కుల వృత్తిని కొనసాగించాడు.

చిట్యాల ఏరియాలో కరడుగట్టిన భూస్వామ్యం వేళ్లూనుకొని వుండడంతో, దోపిడి కింద నలుగుతున్న రైతాంగం పీపుల్స్‌వార్ పార్టీ నాయకత్వంలో సంఘటితం అయి గట్టి పోరాటాన్ని నడిపారు. పార్టీకి మంచి పట్టు కలిగిన గ్రామంగా జంగేడు నిలిచింది. చిట్యాల ప్రాంతంలో పీపుల్స్‌వార్ పార్టీకి బలమైన గ్రామాలు, బలమైన నిర్మాణాలు వుండేవి. భూస్వాములకు వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరిగాయి. ఎంతో మంది నూతన ప్రజాస్వామిక విప్లవ లక్ష్యంతో సాయుధులయ్యారు. అనేక మంది నాయకత్వాన్ని, క్యాడర్‌ను అందించి, ఉద్యమానికి ఊట చెలిమెలా ఈ ప్రాంతం నిలిచింది. ఈ ప్రాంతం నుంచి వచ్చిన పలువురు కామ్రేడ్స్ అమరులయ్యారు కూడా. ఈ ప్రభావంతో కామ్రేడ్ రాజు పిన్న వయసులోనే విప్లవ భావాలను ఒంటబట్టించుకున్నాడు.

దోపిడి వర్గాల నుండి, పీడితులందరికి విముక్తి కల్గాలంటే,

సాయుధ పోరాటమే ఏకైక మార్గమని గ్రహించిన కామ్రేడ్ మంథిని రాజు, కుల వృత్తి క్షౌరశాలను వదిలి 1996లో సాయుధ పోరాట బాటపట్టాడు. 1996లో ఆర్.వై.ఎల్. సభ్యునిగా కొనసాగుతూ యువతను సాయుధ పోరాట మార్గంలో నడిపించాడు. నిత్యం ప్రజల మధ్యనే వుంటూ ప్రజల సమస్యలపై స్పందిస్తూ పరిష్కరిస్తుండేవాడు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు నడిపాడు. పార్టీ పిలుపుమేరకు 1998లో ఎన్.టి. మొదటి ప్లటూన్‌లో సభ్యుడిగా చేరాడు. 2003లో ప్లటూన్ సెక్షన్ కమాండర్‌గా బాధ్యతలు తీసుకొని, అనేక మిలిటరీ కార్యక్రమాలు సమర్ధవంతంగా నిర్వహించాడు. దాదాపు అన్ని మిలిటరీ చర్యల్లోనూ తను ప్రత్యక్షంగా పాల్గొని విజయాలనందించాడు. ప్రతి దాడిలో తన క్రియాశీలక పాత్ర వుంది. 2001లో ఆసరవెల్లి పోలీస్ స్టేషన్‌పై దాడిచేసి తుపాకులు స్వాధీనం చేసుకున్న దాంట్లో తన పాత్ర వుంది. 2001లో మహదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌పై ఆదే సంవత్సరం ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌పై డైరెక్షన్ మైన్స్‌తో దాడి చేసి ముగ్గురు పోలీసులను చంపినదాంట్లో కామ్రేడ్ దయ పాత్ర వుంది. ఈ వినూత్న దాడి ప్రయోగంలో కూడా తన పాత్ర వుంది. బెల్లంపల్లి రైల్వే పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి తుపాకులు గుంజుకున్న దాంట్లో కామ్రేడ్ దయ పాత్ర వుంది.



రెడ్డిపల్లి, సింగారం లాంటి అనేక చోట్ల, చుట్టుముట్టి దాడులు చేసి శత్రువును తీవ్ర గందరగోళ పరచిన చర్యల్లోనూ పాల్గొన్నాడు. అదే విధంగా ఉద్యమాన్ని నిర్మూలించాలనే లక్ష్యంతో శత్రువు ఎంగిలి మెతుకులకు ఆశపడి ఇన్‌ఫార్మర్లుగా మారి దళాల సమాచారాన్ని అందించిన వాళ్లను ఖతం చేయడంలోనూ ముందున్నాడు. ప్రజా ప్రతినిధుల ముసుగులో ప్రజా వ్యతిరేక చర్యలకు పాల్పడే పలువురు రాజకీయ నాయకులను ఖతం చేశాడు. ఇంకా మరెన్నో ఘటనల్లో కామ్రేడ్ దయ కీలక పాత్ర వుంది.

2003 నుండి 2005 ప్రారంభం వరకు వరంగల్–ఖమ్మం డివిజన్‌లో ఎస్.జి.ఎస్. కమాండర్‌గా కొనసాగాడు. 2005లో వరంగల్–ఖమ్మం డివిజన్ కమిటీ సభ్యుడిగా ప్రమోట్ అయి, ఆగస్టు 2009 వరకు డీసీఎంగా మిలిటరీ బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహించాడు.

2007లో ఎన్.టి. మహాసభలో పాల్గొని, ఉద్యమాన్ని పునర్నిర్మించడంలో భాగంగా స్వీయాత్మక శక్తులను రక్షించుకుంటూ, శక్తిమేరకు శత్రువును ప్రతిఘటించాలనీ, పార్టీలో పెరుగుతున్న, వుద్యమానికి అడ్డంకిగా మారిన, అన్యవర్గ ధోరణులకు వ్యతిరేకంగా పోరాడాలని బలంగా ప్రతిపాదించాడు.

కామ్రేడ్ దయ మిలిటరీ రంగంలో పనిచేసినా, ఆర్గనైజేషన్‌లో పని చేసినా ప్రజల్లో కలిసిపోతూ నీళ్లలో చేపలా తిరిగాడు.

అమరత్వానికి కొద్ది రోజుల ముందే వరంగల్ జిల్లా రామకిష్టాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ఇన్‌ఫార్మర్ మోహన్‌రావునూ, కరీంనగర్ జిల్లా శ్రీరాంపూర్ మండలం కాంగ్రెస్ పార్టీ సింగిల్ విండో ఛైర్మన్‌ను ఖతం చేశాడు. మొదటి నుండి కామ్రేడ్ దయ శత్రువుకు పక్కలో బల్లెంలా మారాడు. అందుకే శత్రువు దయనే లక్ష్యంగా చేసుకొని 'దయ ఆపరేషన్' పేరుతో కూంబింగ్ చేపట్టాడు. ఎదురుబొదురుగా పోరాడలేని శత్రువు పిరికితనంతో కుట్రపూరిత ఎత్తుగడలు వేశాడు. అన్నంలో విషం ఇప్పించి స్పృహ కోల్పోయిన వారిని పట్టుకొని క్రూరంగా హత్యచేసి ఎన్‌కౌంటర్ జరిగిందని ప్రజలను నమ్మింప ప్రయత్నించాడు. కామ్రేడ్ దయ ఇక లేడంటే ప్రజలు, క్యాడర్ నమ్మలేకపోతున్నారు. ఎన్.టి. విప్లవోద్యమానికి ముఖ్యంగా కె.కె.డబ్ల్యు. డివిజన్ ఉద్యమానికి కామ్రేడ్ దయ మరణం పూడ్చుకోలేని లోటు.

కామ్రేడ్ దయ క్యాడర్‌తో కలివిడిగా కపటం, కల్మషం లేకుండా వుండేవాడు. నవ్వుతూ నవ్విస్తూ చిన్నా పెద్ద తేడాలేకుండా, నాయకత్వం, క్యాడర్ అనే బేధం లేకుండా మెలిగేవాడు. ప్రజలతో, క్యాడర్‌తో ఒక్కసారి మాట్లాడాడంటే చెరిగిపోని ముద్ర వేసేవాడు. తను హాస్యం బాగా పండించేవాడు. ఒక్కసారి చూస్తే ఇట్టే ఆకట్టుకునే గుణంతో ప్రజలతో, క్యాడర్‌తో తన మాటలు, పాటలతో ఎంత స్నేహంగా వుండేవాడో, శత్రువుపై అంతే వర్గ కసితో తూటై పేలేవాడు.

కామ్రేడ్ దయ 2001లో కామ్రేడ్ మమతను వివాహం చేసుకున్నాడు. 2003లో కరీంనగర్ జిల్లా రెడ్డిపల్లి వద్ద శత్రువుతో వీరోచితంగా పోరాడుతూ ఆమె అమరత్వం చెందింది. సహచరిని కోల్పోయిన బాధను గుండె నిబ్బరంతో భరించాడు. ఆ తర్వాత అదే డివిజన్‌లో పార్టీ సభ్యురాలుగా పనిచేస్తూండిన నవతను 2007లో వివాహం చేసుకున్నాడు. వీళ్లకు ఒక పాప పుట్టింది. కొద్దిరోజులకు నవత పోలీసులకు లొంగిపోయింది. లొంగిపోవద్దని నచ్చ జెప్తూ ఆమెను నిలబెట్టడానికి, కామ్రేడ్ దయ శాయశక్తులా కృషి చేశాడు. అయినా కూడా ఆమె లొంగిపోయింది. ఆ బాధను నిబ్బరంగా భరించి పార్టీలో దృఢంగా నిలబడ్డాడు.

ఇలా అనేక కష్టనష్టాలను, ఆటుపోటులను దృఢంగా ఎదుర్కొన్నాడు. అమరుల ఆశయాలూ, లక్ష్యాలూ, బాధ్యతలను తన

భుజస్కందాలపై మోస్తూ అంకితభావంతో తుదిశ్వాస వరకు ప్రజా యుద్ధంలో వీరుడిగా నిలిచి అమరత్వం చెందాడు. కామ్రేడ్ దయ మంచి ఆర్గనైజర్, మిలిటరీ కమాండర్. సహనం, పట్టుదల, దృఢ సంకల్పం, అంకితభావం, క్రమశిక్షణ అన్ని సుగుణాలూ కలిగిన కామ్రేడ్ దయ మనందరికి ఆదర్శం. ఆ ఆదర్శాలను ముందుకు తీసుకుపోవడమే మన ముందున్న కర్తవ్యం.

## కామ్రేడ్ గంగరబోయిన స్వామి (రమేష్)

అతను పట్టుదలకు మరోపేరు. అతన్ని చూస్తే ప్రతి ఒక్కరూ చలిస్తారు. పట్టుదలతో దేన్నైనా సాధించవచ్చని సాహసంగా యుద్ధ రంగంలోకి అడుగిడినవాడు కామ్రేడ్ స్వామి. త్యాగాలకూ, ప్రజా వుద్యమాలకు చిరునామాగా మారిన, పోరుగల్లుగా పేరు పొందిన ఓరుగల్లు జిల్లాకు చెందినవాడు. ఒక బిడ్డ నేలరాలుతుంటే మరొక బిడ్డను పీడిత ప్రజల విముక్తి, సిద్ధం చేస్తూ చిరు ప్రాయంలోనే 'చందమామ రావే జాబిల్లి రావే' అంటూ అమరుల పోరు గాథలు నూరిపోసే, చిట్యాల మండలం చల్లగరిగె గ్రామానికి చెందినవాడు. వీరుల అమరత్వాన్ని పొదవుకున్న గ్రామం ఇది. ఈ గ్రామంలో పుట్టిన కామ్రేడ్ భాస్కర్ ఎ.పి. జన నాట్య మండలిలో పని చేస్తూ అమరుడైనాడు. ఈ గ్రామానికి చెందిన మరికొందరు ప్రస్తుతం వుద్యమ పథాన సాగుతున్నారు. ఇటువంటి ఉద్యమ నేపథ్యం వున్న గ్రామంలో ఇరవై అయిదు సంవత్సరాల క్రితం పేద కుటుంబంలో గంగరబోయిన లక్ష్మి, రాజయ్య దంపతులకు ఏకైక సంతానంగా జన్మించాడు.



అన్యాయాలకూ, అవినీతికి వ్యతిరేకంగా పోరాడిన విప్లవ సాంప్రదాయం కలిగిన గ్రామం కావడంతో బాల్యం నుండే కామ్రేడ్ స్వామి విప్లవ రాజకీయ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నాడు. అదే సమయంలో గ్రామంలోనే పదవ తరగతి వరకు చదువుకున్నాడు. ఆ సమయంలో యువకులను కూడగడుతూ సారా, గుట్కా మత్తు పానీయాల బంద్‌కై ఉద్యమం నిర్వహించాడు. లంపెన్‌లకు దేహశుద్ధి చేశాడు. ఇంటర్మీడియట్ చదవడానికి పరకాలలో ప్రవేశించాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితి అనుకూలించకపోవడంతో మధ్యలోనే–2001లోనే చదువు మానేశాడు.

ఆ తర్వాత సాయుధ పోరులో చేరాలని నిశ్చయించుకున్నాడు. అంగవైకల్యం వుందని వారించినా వినకుండా దళంలోకి రిక్రూట్ అవుతానని తన అభిప్రాయాన్ని బలంగా పార్టీ ముందు వుంచాడు. గట్టి పట్టుదలతో కామ్రేడ్ స్వామి 2003లో చిట్యాల దళంలోకి రిక్రూట్ అయినాడు. 'ఉన్న ఒక్క కొడుకువి దూరమైతే మమ్మల్ని చూసుకునేవారు ఎవరు' అంటూ తల్లిదండ్రులు ఎంతగా అడ్డు చెప్పినా, ఏడ్చినా దృఢ నిశ్చయంతో తల్లిదండ్రులకు నచ్చ చెప్పి రిక్రూట్ అయ్యాడు. అప్పుడే కామ్రేడ్ స్వామి పేరును రమేష్‌గా మార్చుకున్నాడు.

కామ్రేడ్ రమేష్ ఆరు నెలలపాటు దళంలో పని చేసిన తర్వాత 2004లో ఎన్.టి. ప్రెస్‌లోకి బదిలీ అయ్యాడు. తనకు కంప్యూటర్ పరిచయం లేకున్నా పట్టుదలతో నేర్చుకున్నాడు. టైప్ చేస్తున్నప్పుడు తప్పులు పోతున్నాయని ఇతరులతో తెలుగు డిక్టేషన్ చెప్పించుకుని రాసి, తప్పులను సవరించుకునేవాడు. ప్రెస్ పనిలో ఓపిగ్గా రాత్రింబవళ్లు శ్రమించేవాడు. 2004 నుండి 2007 వరకు ప్రెస్‌కు తన సేవలందించాడు. 2005–06లో కొంత కాలం పాటు సి.ఆర్.బి. ప్రెస్‌లో పనిచేశాడు. 2006లో 'క్రాంతి' పునఃప్రారంభమయ్యే నాటికి తాను సి.ఆర్.బి. ప్రెస్‌లోనే పనిచేస్తుండినాడు. అలా క్రాంతితోనూ తనకు అనుబంధం వుంది.

2007లో ఏసీఎంగా ప్రమోట్ అయినాడు. ప్రెస్ నుంచి బదిలీయై 2008 సెప్టెంబర్‌లో ఏటూరునాగారం–మహదేవ్‌పూర్ ఏరియా కమిటీ సభ్యుడిగా పని చేశాడు.

కామ్రేడ్ రమేష్ 2007లో ఒక ఆదివాసీ కామ్రేడ్‌ను జీవిత భాగస్వామిగా చేసుకున్నాడు. సహచరికి కోయ భాషే మాతృ భాష కావడంతో, తను కోయ భాషను నేర్చుకుంటూ, సహచరికి తెలుగు భాషను మాట్లాడటం, రాయడం, చదవడం నేర్పించాడు. నిర్బంధంలోనూ ఉద్యమంలో నిలదొక్కుకునేలా తన సహాయ సహకారాలను సహచరికి ఎల్లప్పుడూ అందించేవాడు.

అంగవైకల్యం ఇబ్బంది పెడుతున్నా దళంలో అందరితోపాటూ నడుస్తూ, అదనంగా సమిష్టి బరువులు సైతం మోస్తూ అంగవైకల్యాన్ని అధిగమించాడు. వర్గ యుద్ధంలో అంగవైకల్యం అడ్డురాదని నిరూపించాడు కామ్రేడ్ రమేష్.

తీవ్రంగా దెబ్బతిన్న మైదాన ఉద్యమాన్ని పునర్నిర్మించడానికి 2009 జూలైలో వరంగల్ జిల్లా పరకాలకు వెళ్లాడు. ప్రజలను సంఘటితం చేస్తూ కామ్రేడ్ రమేష్ విప్లవ ద్రోహులను నిర్మూలించడంలో పాల్గొన్నాడు. మైదాన ప్రాంతంలో సహజంగానే వుండే మానసిక వత్తిడి, అధిక ప్రయాణం లాంటి సమస్యలను అధిగమించి నిలదొక్కుకున్నాడు. ఈ క్రమంలో అనారోగ్యంరీత్యా ఆస్పత్రికి వెళ్లిన

కామ్రేడ్ రమేష్‌ను విప్లవ ద్రోహి ఇచ్చిన సమాచారంతో 2009 అక్టోబర్ 21న పోలీసులు పట్టుకొని తీవ్ర చిత్రహింసలు పెట్టినా నోరు మెదపకుండా పార్టీ రహస్యాన్ని కాపాడాడు. అదే రోజున భూపాల్‌పల్లి మండలం సీపెల్లి వద్ద బూటకపు ఎన్‌కౌంటర్‌లో దారుణంగా కాల్చి చంపారు.

కామ్రేడ్ రమేష్ మంచి చాకచక్యం, తెలివి వుండి ఎవరినైనా మెప్పించి, ఎలాంటి పనినైనా పూర్తి చేయగల కామ్రేడ్. అతనికి ఒక పని అప్పగిస్తే తప్పకుండా అవుతుందని అందరికీ నమ్మకం వుండేది. కా. రమేష్ మంచి హాస్యప్రియుడు. తను క్యాడర్‌తో చనువుగా, కలివిడిగా వుంటూ నవ్వించేవాడు. ప్రజలపట్ల ఆప్యాయంగా, మర్యాదగా వ్యవహరించేవాడు. తన తప్పులను నిజాయితీగ అంగీకరించేవాడు. వికలాంగులై వుండి పట్టుదలతో వర్గ యుద్ధంలో పోరాడిన కామ్రేడ్స్‌లో కామ్రేడ్ మోరంపల్లి వెంకన్న (అమరుడు), కామ్రేడ్ రమేష్ లాంటి వాళ్లు అరుదుగా వుంటారు. కామ్రేడ్ రమేష్ పట్టుదలనూ, అంకిత భావాన్ని మనం ఆదర్శంగా తీసుకుందాం. కామ్రేడ్ రమేష్ ఆశయాల సాధనకై అంకితమై సాగుదాం.

## కామ్రేడ్ నూనేటి వెంకటేష్ (భాస్కర్)



వరంగల్ జిల్లా మొగుళ్లపల్లి మండలం పెదకోమటిపల్లి గ్రామంలో దాదాపు 22 ఏళ్ల క్రితం కామ్రేడ్ వెంకటేష్ పుట్టాడు. ఇతని తల్లిదండ్రులు నూనేటి నమ్మక్క, కొమురయ్య. వెంకటేష్‌కు ఇద్దరు అక్కా చెల్లెళ్లు వున్నారు. సొంత ఊరిలోనే పదవ తరగతి వరకు చదువుకున్న వెంకటేష్‌కు విద్యార్థి దశలోనే విప్లవ భావాలు వుండేవి. 2004లో చదువుకు స్వస్తి చెప్పి ప్రజాప్రతిఘటన గ్రూపులో చేరాడు.

కామ్రేడ్ వెంకటేష్ 2004 నుండి 2006 వరకు ప్రజాప్రతిఘటన గ్రూపులో మిలిటెంట్‌గా పని చేశాడు. ఈ క్రమంలోనే రెండుసార్లు అరెస్టయ్యాడు. రెండవసారి అరెస్టయినప్పుడు కొంత కాలం జైలు జీవితం గడిపి బెయిల్‌పై బయటికి వచ్చాడు. ప్రజా ప్రతిఘటన గ్రూపు అరాచకాలు, ఆచరణా నచ్చలేదు కా. వెంకటేష్‌కు. మావోయిస్టు పార్టీ పట్ల ఆకర్షితుడయి దళంను వెతికి పట్టుకొని పార్టీలో పూర్తికాలం పనిచేస్తానన్న తన అభిప్రాయంను వ్యక్తపరిచాడు. తన పట్టుదలను గ్రహించిన పార్టీ 2006లో అతనిని రిక్రూట్ చేసుకుంది.

పార్టీలోకి వచ్చిన కామ్రేడ్ వెంకటేష్ భాస్కర్‌గా పేరు మార్చుకున్నాడు. మొదటగా అక్కడి ఏరియా దళంలో తిరుగుతూ రాజకీయ,మిలిటరీ అనుభవాన్ని గడిస్తూనే క్రమశిక్షణతో మెలిగేవాడు. కామ్రేడ్ భాస్కర్ విప్లవ నిబద్ధత, ఆచరణను గమనించిన పార్టీ కమిటి కొద్ది కాలంలోనే కె.కె.డబ్ల్యు, డీసీ సభ్యుడికి గార్డుగా నియమించింది. నాయకత్వాన్ని కాపాడటంలోఅప్రమత్తంగా వుంటూ 2007 చివరి వరకు ఆ బాధ్యతను నిర్వర్తించాడు. 2008 ప్రారంభంలో ఆర్గనైజేషన్ దళంలోకి సభ్యునిగా బదిలీ అయ్యాడు. ప్రజలతో సన్నిహితంగా కలిసిపోతూ వాళ్లకు రాజకీయాలు చెప్పేవాడు.

2009లో పరకాల మైదాన టీంలో సభ్యునిగా బదిలీ అయ్యాడు. ఈ ప్రాంతంలో ప్రజలను సంఘటితం చేయడానికి చేసిన కృషిలో చురుగ్గా పాల్గొన్నాడు. ప్రజా వ్యతిరేకులైన రాజకీయ నాయకులను శిక్షించిన ఘటనల్లో చురుగ్గా పాల్గొన్నాడు. కామ్రేడ్ భాస్కర్‌కు అప్పగించిన పనిని చాలా బాధ్యతాయుతంగా చేసేవాడు. ఎంతటి నిర్బంధంలోనైనా పని చేయాలనే దృఢ సంకల్పం కలిగిన కామ్రేడ్. తనతోపాటే రిక్రూట్ అయినవాళ్ల శత్రువుకు లొంగిపోయినా తను మాత్రం పట్టుదలగా ఉద్యమంలో నిలబడ్డాడు. ఉక్కు క్రమశిక్షణతో ఎప్పుడూ చెరగని చిరునవ్వుతో తోటి కామ్రేడ్స్‌తో, ప్రజలతో ఆత్మీయంగా, స్నేహపూర్వకంగా వుంటూ అందరి అభిమానాన్ని చూరగొన్నాడు.

2009 అక్టోబర్ 31న రేగొండ మండలం కోటంచ గ్రామం వద్ద ఒక విప్లవ ద్రోహి ఇచ్చిన విషాహారాన్ని తిని కామ్రేడ్స్ భాస్కర్, దయలు సొమ్మసిల్లి పడిపోయారు. ఇద్దర్నీ పోలీసులు వచ్చి పట్టుకుని తీవ్ర చిత్రహింసలకు గురిచేసి రహస్యాలను రాబట్టలేక పోయిన శత్రువు కామ్రేడ్ దయతో పాటు కామ్రేడ్ భాస్కర్‌ను కూడా పాశవికంగా కాల్చి చంపాడు.

కామ్రేడ్ భాస్కర్‌లోని క్రమశిక్షణ, దృఢ సంకల్పం,స్నేహశీలత మనందరికీ ఆదర్శం కావాలి.

## కామ్రేడ్ ఆలం తిరుపతి (పున్నం)

ఆదిలాబాద్ జిల్లా మంగి ఏరియా జోడేఘాట్ ప్రాంతంలో కెరిమెరి గ్రామం వద్ద 2009 డిసెంబర్ 2న గ్రేహౌండ్స్ బలగాలు చేసిన ఆంబుష్‌లో చిక్కి ఉత్తర తెలంగాణా ప్లాటూన్ కార్యదర్శి, కమాండర్ కామ్రేడ్ ఆలం తిరుపతి, మంగి ఏరియా కమిటీ సభ్యుడు కామ్రేడ్ చిప్పకుర్తి రవితో సహా అమరుడయ్యాడు. 1941లో నైజాం సర్కార్ సైన్యాలతో పోరాడిన ఆదివాసీ యోధుడు కొమురం భీం అమరత్వం చెందిన ప్రదేశానికి కొద్ది దూరంలోనే ఈ ఇద్దరు కామ్రేడ్స్ కన్నుమూశారు. ఈ కామ్రేడ్స్ అమరత్వం ప్రస్తుత స్థితిలో ఉత్తర

తెలంగాణా ఉద్యమానికి తీవ్రమైన నష్టం.

వరంగల్ జిల్లా ఏటూరు నాగారం మండలం తుపాకుల గూడెం గ్రామంలో, దాదాపు 32 ఏళ్ల క్రితం పేద కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ ఆలం తిరుపతి– ప్రశాంత్, పున్నం పేర్లతో ప్రజలకూ, సహచరులకు సుపరిచితుడు. తుపాకుల గూడెం గ్రామానికి విప్లవోద్యమ చరిత్రలో సుస్థిర స్థానం వుంది. ఇది ఆదివాసీ గ్రామం కనుక ఫారెస్ట్ వాళ్ల జులుం విపరీతంగా వుండేది. ఆ సమయంలో విప్లవోద్యమం ఈ గ్రామంలో పోరు రాజేసింది. కామ్రేడ్ బడే నాగేశ్వర్ రావు సోదరుల ద్వారా దళం ఈ గ్రామానికి వెళ్లేది. కామ్రేడ్ బడే నాగేశ్వర్ రావు కుటుంబానికి ఈ గ్రామంలో బంధువులు వుండేవారు. ఆ ప్రభావం వలన కూడా ఈ గ్రామం విప్లవోద్యమానికి సన్నిహితమైంది. ఒక వైపు రాజ్యంతో, మరోవైపు ఎం.ఎల్. పార్టీల మితవాద, అవకాశవాద రాజకీయాలతో పోరాడుతూ, పార్టీ ఈ గ్రామాన్ని తన వైపు దృఢంగా నిలబెట్టుకుంది.




ఈ నేపథ్యంలో కామ్రేడ్ తిరుపతి కుటుంబం కూడా విప్లవోద్యమం వైపు నిలబడింది. అందువలన కామ్రేడ్ తిరుపతికి చిన్న వయసులోనే విప్లవోద్యమం పరిచయమైంది. ఆ ప్రభావంతో విప్లవానికి అంకితం కావాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నాడు.

ఏటూరు నాగారం ఏరియాలో పార్టీ ప్రారంభంలో అనేక కష్టాలను ఎదుర్కొంది. ఒకపక్క రాజ్యం దాడి. ఊరూరా పోలీసు క్యాంపులు నిర్మించి గ్రామాలను వల్లకాడులుగా మార్చింది ప్రభుత్వం. మరోపక్క ఎం.ఎల్. పార్టీలు భౌతిక దాడులతో దళానికి తిండిగూడ దొరికేదికాదు. పాసిపోయిన అన్నంతో సరిపెట్టుకోవాల్సి వచ్చేది. ఐదు, ఆరు గ్రామాలపై మాత్రమే ఆధారపడి దళం ఏరియా మొత్తం తిరిగేది. ఈ కష్టాలు తట్టుకోలేక కొంత మంది విప్లవోద్యమం నుండి వెనుతిరిగి వెళ్లగా ఐదారుగురు కామ్రేడ్స్ మాత్రమే మిగిలిపోయారు. ఆ సమయంలో దళంలో కామ్రేడ్ బడే నాగేశ్వర్ రావు వుండడంతో అతని ప్రభావంతో కామ్రేడ్ ప్రశాంత్ దళాన్ని కలుస్తూ, దళానికి కొరియర్‌గా పనిచేశాడు.

పేద కుటుంబమే అయినప్పటికీ తల్లిదండ్రులు కాయకష్టం చేసి ప్రశాంత్‌ను ఇంటర్ మీడియట్ దాకా చదివించారు. గోవిందరావు పేటలోని బి.సి. సంక్షేమ హాస్టల్‌లో వుండి చదువుకున్నాడు. అంతకంటే ఎక్కువగా సమాజాన్నీ చదివాడు. విద్యార్థిగా వుంటూ ఆర్.ఎస్.యు.లో మొదట సభ్యుడిగానూ, ఆ తర్వాత కార్యదర్శిగానూ చురుగ్గా పని చేశాడు. ఆ సమయంలో పాఠశాలలో హాస్టల్లో వసతుల కొరకూ, సరైన భవనాల కొరకూ, హాస్టళ్లలో పౌష్టికాహారం ఇవ్వాలనీ జరిగిన పోరాటాల్లో కామ్రేడ్ తిరుపతి పాత్ర ముఖ్యమైనది. సమస్యల సాధన కొరకు జరిగిన అనేక ధర్నాలూ, రాస్తారోకోలూ, తరగతుల బహిష్కరణలూ, పికెటింగ్‌లకు కామ్రేడ్ తిరుపతి నాయకత్వం వహించాడు. నేడు ఏటూరునాగారం పాఠశాల, హాస్టళ్లలో సౌకర్యాలు మెరుగు పడినాయంటే ఆర్.ఎస్.యు. పోరాటాల ఫలితమే. అందులో తిరుపతి పాత్ర విడదీయలేనిది. విద్యార్థి ఉద్యమంలో చురుకైన పాత్ర వహిస్తూనే రైతాంగ సమస్యలపై ముఖ్యంగా ఆదివాసీ రైతాంగ సమస్యలపై కూడా ప్రజలను కదిలించాడు. కరువు సమస్యపై, తాగునీరు, సాగునీరు కల్పించాలనీ నకిలీ విత్తనాలకు వ్యతిరేకంగా పురుగు మందులు, సబ్సిడీ విత్తనాలు ఇవ్వాలనీ చేసిన పోరాటాల్లో భారీ ప్రదర్శలలో చురుకైన పాత్ర వహించాడు.

ఇంటర్ పూర్తయిన తర్వాత 1996–97లో ఎ.ఆర్.డి.లో పని చేస్తూ అనేక మిలిటరీ చర్యలతో శత్రువును పరుగులు పెట్టించాడు. తాడ్వాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలపై, పార్టీ సానుభూతిపరుల ఇండ్లపై దాడులుచేసి, క్రూరంగా హింసించిన హెడ్‌కానిస్టేబుల్ భీమ్‌సింగ్‌ను పోలీస్ స్టేషన్ సమీపంలోనే తుదముట్టించడంలో కామ్రేడ్ ప్రశాంత్ భూమిక ముఖ్యమైనది. అలాగే పస్రా పోలీస్ స్టేషన్ ఏరియాలో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులపై క్లేమోర్‌మైన్స్‌ను పేల్చడంతో ఎస్.ఐ. తీవ్రంగా గాయపడ్డాడు. మరోసారి పెట్రోలింగ్‌కు వచ్చిన పోలీస్ బృందం, నార్లాపూర్ భవనంపై మకాం వేసి వుండగా, ఏరియా రక్షణ దళం అక్కడికి అతి సమీపంలోకి వెళ్లి గ్రెనేడ్ విసరడంతో ఏడుగురు పోలీసులకు కాళ్లూ, చేతులు విరిగాయి. విప్లవ ద్రోహులను శిక్షించడంలో కామ్రేడ్ ప్రశాంత్ ముందున్నాడు. ఏటూరునాగారం ఏరియాలో ప్రజల్లో, యువతలో విప్లవకర మిలిటెన్సీని అభివృద్ధి చేసిందాంట్లో కామ్రేడ్ ప్రశాంత్ పాత్ర చెప్పుకోదగినది.

1997లో కామ్రేడ్ తిరుపతి దళ జీవితంలోకి వచ్చాడు. దళంలోకి వచ్చిన తర్వాత తన పేరును ప్రశాంత్‌గా మార్చుకున్నాడు. 98 వరకు ఏటూరునాగారం దళంలో పనిచేసి, ఏరియా కమిటీ సభ్యునిగా కొత్తగూడెం మినీ గెరిల్లా దళంలో పని చేశాడు. 1999లో ఏటూరునాగారం ఆర్గనైజేషన్ ఏసీలోకి బదిలీయై 2002 వరకు పని చేశాడు.

1997లో మొట్లగూడెం వద్ద గెరిల్లాలు చేసిన ఆంబుష్‌లో పస్ర ఎస్.ఐ.తో పాటు 11 మంది పోలీసులు చనిపోయారు. అదే సంవత్సరం టి.డి.పి. గవర్నమెంట్ హయాంలో టి.డి.పి. ఎం.ఎల్.ఎ. చర్చ బోజరావుపై, అతని గన్‌మెన్స్‌పై దాడిచేసి తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. 1999లో కేంద్ర కమిటీ నాయకత్వం కామ్రేడ్స్ శ్యామ్, మహేష్, మురళీల బూటకపు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా, ఏటూరునాగారం మండల కేంద్రంలో జీపుపై దాడి చేసినపుడు ముగ్గురు పోలీసులు చనిపోగా, మూడు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు. పస్ర పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్.ఐ. నర్సయ్యపై దాడి చేయగా, ఎస్.ఐ. తప్పించుకోగా గన్‌మెన్ చనిపోయాడు. ఇక్కడ ఒక ఎ.కె.47 గెరిల్లాల వశమయింది. ఈ ఘటనలన్నింటిలోనూ కామ్రేడ్ ప్రశాంత్‌కు క్రియాశీలక భాగస్వామ్యం వుంది. ఏటూరునాగారం వుద్యమం మరింత బలోపేతం కావడానికి ఈ చర్యలు దోహదపడ్డాయి.

2002లో కామ్రేడ్ ప్రశాంత్ దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ మద్దేడు ఏసీలోకి బదిలీయై 2004 వరకు పని చేశాడు. ఆ తర్వాత ఎన్.టి.కి తిరిగి బదిలీ అయి మిలిటరీ రంగం బాధ్యతలు చేపట్టాడు. ఎస్.జి.ఎస్. బాధ్యుడిగా ఖమ్మం-కరీంనగర్ డివిజనల్ కమాండ్‌లో పని చేశాడు. 2005లో డీవీసీలోకి ప్రమోట్ అయ్యాడు.

2006లో ఎన్.టి. ప్లాటూన్ కమాండర్‌గా బాధ్యతలు చేపట్టాడు. ప్లటూన్‌లోకి వచ్చాక కామ్రేడ్ ప్రశాంత్ పేరును పున్నంగా మార్చుకున్నాడు. డీకే-ఎన్.టి. బార్డర్‌లో చర్ల మండలంలో జాటం, ఎర్రపాడు గ్రామాల మధ్య గ్రేహౌండ్స్ బృందంపై తన పి.ఎల్.తో వెళ్లి దాడిచేసి తరిమి కొట్టాడు. 2007లో ఏర్పడిన జాయింట్ కమాండ్‌లో భాగంగా డీకేలోని దక్షిణ బస్తర్ ప్రాంతంలో ఎన్.టి. ప్లాటూన్ పాల్గొన్న రెండు ఆంబుష్‌ల్లోనూ సి.ఆర్.పి.ఎఫ్.కు చెందిన కొందరు చనిపోయారు, మరికొందరు గాయపడ్డారు. ఇదే సమయంలో అనేక మంది ఇన్‌ఫార్మర్లనూ, ద్రోహులను ఖతం చేయడంలో ఈ ప్లాటూన్ చురుకైన పాత్ర వహించింది. తిరిగి 2007, 2008లో ఎన్.టి.లో ప్రతిఘటనలో భాగంగా ఇన్‌ఫార్మర్లను శిక్షించింది. 2008 నవంబర్‌లో పూజార్ కాంకేర్ గ్రామ సమీపంలో ఎన్నికల బందోబస్తుకు వచ్చిన బి.ఎస్.ఎఫ్. బలగాలపై ఆంబుష్ చేసి గాయపర్చింది. వీటన్నింటిలోనూ కామ్రేడ్ పున్నం పాత్ర కీలకమైనది.

ఆదిలాబాద్ ఉద్యమ పునర్నిర్మాణంలో భాగంగా తన ప్లాటూన్‌తోపాటు ఆ ప్రాంతానికి పోయి ప్రజలను కూడగడుతూ, ప్రజాపోరాటాలు నిర్వహిస్తున్న క్రమంలో, విప్లవ ద్రోహులు ఇచ్చిన సమాచారంతో 2009 డిసెంబర్ 2న ప్రయాణంలో వుండగా, గ్రేహౌండ్స్ పోలీసులు మాటుగాసి అతి సమీపం నుండి దాడి చేశారు. శత్రువు దాడిని తీవ్రంగా ప్రతిఘటిస్తూనే తుది శ్వాస వరకు వీరోచితంగా పోరాడి కామ్రేడ్ పున్నం అమరుడయ్యాడు.

కామ్రేడ్ పున్నం మిలిటరీపరంగా, రాజకీయంగా నిరంతరం తాను ఎదుగుతూ క్యాడర్‌ను ఎదిగించుకోవడానికి కృషి చేసేవాడు. నిర్బంధంలోనూ క్యాడర్‌ను నిలబెట్టుకోవడం, కష్టాలను అధిగమించేలా తర్ఫీదునిస్తూ, సమయస్ఫూర్తితో వ్యవహరించేలా తీర్చిదిద్దేవాడు. కష్టకాలంలో పాసిపోయిన అన్నాన్ని కూడా తినాలని పరిస్థితులను బట్టి మన తిండి అలవాట్లను మార్చుకోవాలనే చైతన్యాన్ని కల్పించి తను తిని, వాళ్లను తినేలాగా చేసేవాడు.

అందరినీ నవ్విస్తూ నవ్వుతూ కలివిడిగా వుండేవాడు. పార్టీ తనకు అప్పగించిన పనిని బాధ్యతాయుతంగా చేసే నేర్పరితనం, కష్టపడేతత్వం, పట్టుదల, ధైర్యసాహసాలు, నిర్మాణ క్రమశిక్షణ, అంకితభావం కామ్రేడ్ పున్నం సొంతం.

ప్రస్తుతం ఎన్.టి. ఉద్యమం ఎదుర్కుంటున్న ఆటు పరిస్థితిలో వుద్యమాన్ని తిరిగి పురోగమింప చేయడానికి ఆధారపడ తగినటువంటి శక్తి సమర్థతలున్న కామ్రేడ్ పున్నం వంటి కామ్రేడ్‌ను కోల్పోవడం ఆ వుద్యమానికి తీవ్రమైన నష్టం. కామ్రేడ్ పున్నంలోని సుగుణాలను ఆదర్శంగా స్వీకరించి ముందుకు సాగుతూ, తను లేని లోటును పూడ్చుకోవడానికి కృషి చేద్దాం. అదే కామ్రేడ్ పున్నంకు మనం ఇవ్వతగిన నివాళి.

## కామ్రేడ్ చిప్పకుర్తి రవి (సురేష్)



ఆదిలాబాద్ జిల్లా మంగి ఏరియాలో జోడెన్‌ఘాట్ అడవిలో గ్రేహౌండ్స్ బలగాలు చేసిన ఆంబుష్‌లో చిక్కుకొని ఏరియా కమిటీ సభ్యుడు కామ్రేడ్ సురేష్, కామ్రేడ్ పున్నంతో అమరుడయ్యాడు.

కామ్రేడ్ చిప్పకుర్తి రవి ఆదిలాబాద్ జిల్లా సింగరేణి బొగ్గు గనుల దగ్గరలో గల టేకుమట్ల గ్రామంలో ముప్పయి రెండు సంవత్సరాల క్రితం జన్మించాడు. సింగరేణి కార్మిక వర్గం చేస్తున్న మిలిటెంట్ పోరాటాలతో ఉత్తేజితుడై విప్లవోద్యమాన్నే తన జీవితంగా ఎంచుకున్నాడు. 1998 ఆగస్టులో పూర్తి కాలం కార్యకర్తగా మారి సురేష్ పేరుతో అందరికీ సుపరిచితుడయ్యాడు.పేద కుటుంబంలో పుట్టిన కామ్రేడ్ సురేష్ ఇంటి దగ్గర చదువుకోలేకపోయాడు. దళంలోకి

వచ్చిన తర్వాత రాజకీయ, మిలిటరీ తర్ఫీదు పొందుతూనే పట్టుదలతో చదువును నేర్చుకున్నాడు.

1998లో మంగి దళంలో చేరిన కామ్రేడ్ సురేష్ ఆ తర్వాత 2000లో ఆదిలాబాద్ జిల్లా కమిటీ ఆదేశాలతో సింగరేణి కార్మిక వర్గంలో పనిచేసే ఆర్గనైజర్ వెంట దళ సభ్యునిగా పని చేయడానికి వెళ్లాడు. సింగరేణి పట్టణ ప్రాంతంలో ఉండే శత్రు నిర్బంధంలో సైతం కార్మికవర్గంతో నిత్య సంబంధాలు కొనసాగించేవాడు. తనకు అప్పగించిన పనులను పట్టుదలతో పరిపూర్తి చేస్తూ విశ్వాసపూర్తిగా పని చేసేవాడు. 2001లో చెన్నూర్ దళానికి బదిలీ అయ్యాడు. 2002లో ఏసీ సభ్యుడిగా ప్రమోట్ అయ్యాడు. చెన్నూర్, సిర్పూర్, మంగి దళాలలో ఏసీ సభ్యుడిగా పని చేసి, అక్కడి ప్రజల అభిమానాన్ని చూరగొన్నాడు. ప్రజలను, సహచరులను కామ్రేడ్ సురేష్ సున్నితమైన హాస్యంతో ఆకట్టుకొని, వారికి విప్లవ రాజకీయాలను బోధించేవాడు. విప్లవోద్యమంలో అసువులు బాసిన కామ్రేడ్స్‌పై కవితలు, పాటలు రాసేవాడు.

కామ్రేడ్ సురేష్ మిలిటరీ పరంగానూ చురుకైన పాత్రను పోషించాడు. గ్రేహౌండ్స్ బలగాలు తాను వున్న దళంపై దాడి చేసిన సందర్భాల్లో, తోటి కామ్రేడ్స్‌ను ఉత్సాహపరుస్తూ శత్రు దాడిని ఎదుర్కొనేలా చేసేవాడు. అలా 15 ఎన్‌కౌంటర్లలో శత్రువుతో ప్రతిఘటిస్తూ దళాన్ని సురక్షితంగా రక్షించాడు. అలాగే పట్టణాల్లో చేసిన గెరిల్లా చర్యలలోనూ మంచి నైపుణ్యంతో పాల్గొని చర్యలను విజయవంతం చేసేవాడు. 1999లో కాగజ్‌నగర్ పట్టణంలో, పట్టపగలు ఎం.ఎల్.ఎ. పాల్వాయి పురుషోత్తమరావును అతని గన్‌మెన్లతో సహా కాల్చి చంపి ఆయుధాలను స్వాధీనం చేసుకున్న దాంట్లో క్రియాశీలకంగా పాల్గొని విజయవంతం చేశాడు. ఆదిలాబాద్ జిల్లాలో శత్రువుతో జరిగిన ఎన్‌కౌంటర్లలో, పట్టణ గెరిల్లా చర్యలలో, దాడుల్లో పాల్గొని, వాటిని విజయవంతం చేయడంలో కామ్రేడ్ సురేష్ మంచి పాత్రను పోషించాడు.

2006 అక్టోబర్‌లో మంగి ఏరియాలో గ్రేహౌండ్స్ బలగాలతో జరిగిన ఒక ఎన్‌కౌంటర్‌లో అమరురాలైన ఆదిలాబాద్ జిల్లా కమిటీ సభ్యురాలు కామ్రేడ్ పద్మ (తొర్రెం లక్ష్మిబాయి), కామ్రేడ్ సురేష్‌లు జీవిత సహచరులు. వీరిద్దరూ విప్లవ జీవితంలో ఆదర్శమైన జంటగా జీవించారు. కామ్రేడ్ పద్మ అమరత్వపు దుఃఖాన్ని విప్లవ చైతన్యంతో భరించి ఆమె ఆశయ సాధనలో ముందుకు సాగాడు.

తన పదకొండు సంవత్సరాల విప్లవోద్యమంలో విప్లవ సాహిత్యాన్ని శ్రద్ధగా చదివి రాజకీయ చైతన్యం పెంచుకున్నాడు. కౌన్సిలింగుల పేరుతో శత్రువు తన కుటుంబాన్ని వేధించినా, తనతో పనిచేసిన ఎంతో మంది కామ్రేడ్స్ అమరత్వం చెందినా, దిగజారిపోయినా విప్లవోద్యమ క్రమంలో ఎన్నో ఒడిదుడుకులు ఎదురు పడినా, ఉత్తర తెలంగాణా విప్లవోద్యమం శత్రు దాడికి గురై వెనుకపట్టు పట్టినా, అన్నింటినీ తట్టుకుంటూ అచంచలమైన విప్లవ దీక్షతో బోల్షివిక్ యోధునిగా నిలిచాడు.

కామ్రేడ్ సురేష్ ఆశయ సాధనలో ముందుకు సాగుదాం.

## కామ్రేడ్ ఓజ్జ రంగన్న



కామ్రేడ్ ఓజ్జ రంగన్న వయసు 45 సంవత్సరాలు. ఖమ్మం జిల్లా ఇల్లందు మండలం పోలారం గ్రామస్తుడు. ఇతను మధ్యతరగతి ఆదివాసీ కుటుంబంలో పుట్టాడు. గ్రామంలోనే 7వ తరగతి వరకు చదువుకున్నాడు. సామాజిక చైతన్యం కలిగి వున్న కామ్రేడ్ రంగన్న పి.వై.ఎల్. సంఘంలో చేరి గ్రామంలో యువకులను సమీకరించేవాడు. ఆటలపై వున్న మక్కువతో జిల్లా స్థాయి కబడ్డీ ఆటగాడుగా పేరు పొందాడు. కామ్రేడ్ రంగన్నకు భార్య, ముగ్గురు పిల్లలు వున్నారు. ఒక అమ్మాయి, ఇద్దరు అబ్బాయిలు. గ్రామంలో జరిగే అన్యాయాలకూ, అక్రమాలకూ, అరాచకాలకు వ్యతిరేకంగా యువతను కూడగట్టి అవినీతి వ్యతిరేక న్యూడెమొక్రసి నాయకులు ప్రజలపై చేస్తున్న పెత్తనం ఆధిపత్యానికి వ్యతిరేకించాడు.

ప్రజాపంథా పార్టీలో ప్రజాపంథాలేదని భూస్వాముల పక్షం వహిస్తూ న్యూడెమొక్రసీ (ఎన్.డి.) పార్టీ ప్రజలకు విప్లవం పేరుతో ఇన్నాళ్లు మోసం, ద్రోహం చేస్తున్నదని గ్రహించాడు. అదే సమయంలో మావోయిస్టు పార్టీకి 2004లో పరిచయం అయ్యాడు. 2004 నుండి పార్టీ నాయకత్వంలో జరుగుతున్న పోరాటాల్లో భాగమయ్యాడు. గ్రామాలల్లో జరుగుతున్న ఎన్.డి. నాయకుల అవినీతి అరాచాకాలను వ్యతిరేకిస్తున్న వారిని కూడగట్టాడు. గ్రామాల్లో వారి దౌర్జన్యాలు దగాకోరు విధానాలనూ ప్రజలపై వాళ్లు చేస్తున్న పెత్తనాన్ని ప్రశ్నించేటట్టుగా యువకులను ఐక్యం చేశాడు. మాణిక్యారం, పోచారం, పోలారం, కొమురారం, బొంబాయితండా, ధర్మారంతండా, బిస్కెంట్ తండా, పాతర్లగడ్డ, ఓజ్జవారి గూడెం తదితర గ్రామాలను పార్టీకి పరిచయం చేశాడు. దానితో కక్షగట్టిన ఎన్.డి. పార్టీ వాళ్లు కామ్రేడ్

⇨

# జంగయ్య మాస్టారును స్మరించుకుందాం!

2009 సంవత్సరాంతంలో జంగయ్య మాస్టారు మరణించారు. జంగయ్య మాస్టారు పేరు ఈ తరం విని వుండక పోవచ్చు. కానీ నక్సల్బరీ వారసత్వాన్ని అందుకున్న తొలి తరం ఆంధ్రప్రదేశ్ విప్లవకారులకు ఆయన సుపరిచితులు.

1933లో పుట్టిన జంగయ్య మాస్టారు, హైదరాబాద్ పాత బస్తీ నివాసి. చాదర్‌ఘాట్ ప్రాంతంలోని వీరి ఇల్లు 60వ దశాబ్ద ఆఖరు నుంచి ఎమర్జెన్సీ వరకూ విప్లవ కేంద్రంగా వుండేది.

ఉపాధ్యాయ వృత్తిలో వుంటూ, ఉపాధ్యాయ సంఘంలో పని చేస్తూనే ఆయన ఆనాడు విప్లవ కార్యకలాపాలను నిర్వర్తించారు. 1974లో రాడికల్ విద్యార్థి సంఘం ఏర్పడ్డానికి ఒక భూమికను తయారు చేయడంలో ఆయన కృషి వుంది. విప్లవ విద్యార్థులు సంఘటితం కావడానికి, సభలూ, సమావేశాలూ, ఊరేగింపులూ నిర్వహించుకోవడానికీ, ప్రచారం చేసుకోవడానికీ ఆయన ఒక పెద్ద దిక్కుగా తోడ్పాటును అందించారు. పౌరహక్కుల ఉద్యమంతోనూ ఆయనకు అనుబంధం వుంది.

బహిరంగ కార్యకలాపాల్లో అందరికీ తల్లో నాలుకగా వుంటూనే నాటి ఎం.ఎల్. పార్టీ నిర్మాణాలతోనూ, దాని ఉన్నత శ్రేణి నాయకత్వంతోనూ ఆయన సన్నిహిత సంబంధాలను కల్గి వున్నారు. నాటి పార్టీ అధికార పత్రిక 'పిలుపు'తోనూ ఆయనకు సంబంధ బాంధవ్యాలు వుండేవి.

నిరాడంబరంగా వుంటూ ఆత్మీయతను పంచుతూ ఎందరో హృదయాలకు చేరువైన ఆయన, ఎంతో మందికి ఉద్యమ దారులను పరిచయం చేశారు.

అలా పిడికెడు మందిగా విప్లవపార్టీ ఉన్న సమయంలో, సరైన పంథా పట్ల వాదోపవాదాలు జరుగుతున్న సమయంలో, విచ్ఛిన్నకులు పార్టీని చీలికలు పేలికలు చేస్తున్న సమయంలో, మితవాదులూ, అతివాదులూ రకరకాల అవిశ్వాసాలను వ్యక్తం చేస్తున్న సమయంలో ఆయన సరైన పంథా వైపు నిలబడ్డారు.

నేడు దేశంలో మావోయిస్ట్ పార్టీ ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా ఎదగడం వెనుక నాటి పిడికెడు మంది విప్లవకారులు చేసిన కృషి అత్యంత కీలకమైనది. ఆ కీలకమైన కృషిలో, కీలకమైన సమయంలో జంగయ్య మాస్టారుకు భాగస్వామ్యం వుంది.

ఎమర్జెన్సీ కాలంలో ఎందరో విప్లవకారులను ప్రభుత్వం అరెస్ట్ చేసినప్పటికీ జంగయ్య మాస్టారు తన కార్యకలాపాలను కొన్నాళ్ల పాటు కొనసాగించారు. ఆ కార్యకలాపాలు ఎలా కొనసాగుతున్నాయో పసి గట్టిన ప్రభుత్వం, ఆయనను కూడా అరెస్ట్ చేసింది. తీవ్రంగా చిత్రహింసలు పెట్టి రక్తపు ముద్దగా చేసి జైల్లో పడేసింది.

ఎమర్జెన్సీ ఎత్తి వేసిన తర్వాత ఆయన విప్లవ కార్యకలాపాలకు దూరంగానే ఉండిపోయారు. అయితే చివరి వరకూ విప్లవాభిమానిగా, విప్లవ సానుభూతి పరుడిగా, విప్లవ స్వాప్నికుడిగా జీవించారు.

అందుకే నాటి ఆయన కృషిని 'క్రాంతి' వినమ్రంగా స్మరించుకుంటోంది.

⇨

రంగన్నను తీవ్రంగా కొట్టగా స్పృహ కోల్పోవడంతో చనిపోయాడని ఒదిలేసి వెళ్లిపోయారు. అయినప్పటికీ పట్టు వదలకుండా ప్రజలపక్షాన నిలబడ్డాడు. ఈ ప్రాంతంలో తమ ఆధిపత్యం పోతుందనే భయంతో టి.ఆర్.ఎస్. ముసుగులో మావోయిస్టులు అంటూ బహిరంగంగా పేపర్ స్టేట్‌మెంట్లు ఇవ్వడం, కరపత్రాలు పంచడం చేశారు. టి.ఆర్.ఎస్. కవర్‌లో మావోయిస్ట్ పార్టీ పని చేస్తున్నాడనే ఆరోపణతో కామ్రేడ్ రంగన్నను పోలీసులు మూడుసార్లు అరెస్టుచేసి తీవ్రంగా కొట్టారు. మరోవైపు ఎన్.డి. పార్టీ ఒత్తిడి పెరిగింది. గ్రామం నుండి వెళ్లిపోవాలని కామ్రేడ్ రంగన్న కుటుంబాన్ని హెచ్చరించింది. వాళ్ల కుటుంబానికి నీళ్లు ఇవ్వకూడదనీ, దుకాణంలో సరుకులు ఇవ్వకూడదనీ, వాళ్ల పొలంలోకి ఎవరూ పనులకు పోవద్దనీ, పిల్లలను స్కూల్లో చేర్చుకోవద్దనీ ఎన్.డి.పార్టీ గ్రామస్తులందరినీ బెదిరించింది. ఎన్ని ఇబ్బందులు ఎదురైనాగానీ సాయుధ రివిజనిస్టుకు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాటాన్ని కొనసాగించాడు.

ప్రజాపంథా ఒత్తిడి పోలీసు నిర్బంధం మరింత తీవ్రం కావడంతో, భార్యా పిల్లలను ఒదిలేసి 2007లో దళంలోకి రిక్రూట్ అయ్యాడు. విప్లవమే వృత్తిగా, ప్రజలే గురువులుగా భావించాడు. దళంలో రోజువారీ పనుల్లో పాల్గొంటూ, వ్యక్తిగత క్రమశిక్షణను పాటిస్తూ, అందరితో ఆప్యాయంగా వుండేవాడు. శత్రువు కొట్టిన దెబ్బల నొప్పిని భరిస్తూ, అనారోగ్య సమస్యను లెక్కచేయకుండా, పట్టుదలతో నమ్మిన లక్ష్యం కోసం కట్టుబడి పని చేశాడు. అందులో భాగంగా కొన్ని వ్యక్తిగత అలవాట్లను మార్చుకున్నాడు. 2008లో కొడుకును పోలీసులు పట్టుకొని కరెంట్ షాక్ పెట్టి తీవ్రంగా హింసించినా శత్రువు ఎత్తుగడను

విప్లవ చైతన్యంతో అర్థం చేసుకున్నాడు. ఈ దోపిడీ రాజ్యంపై మరింత కసిని పెంచుకున్నాడు. ప్రజా పోరాటాల్లో మరింతగా నిమగ్నమయ్యాడు. ఏరియాలో ప్రజా వ్యతిరేకులు, పోలీసు ఇన్‌ఫార్మర్లను శిక్షించిన చర్యల్లో చురుగ్గా పాల్గొన్నాడు. పోలారం గ్రామంలో ఎన్.డి. నాయకుడిని చంపిన చర్యలో కీలకపాత్ర పోషించాడు.ఈ క్రమంలో పని మీద వెళ్తున్న కామ్రేడ్ రంగన్నను పూబెల్లి – ధర్మాపురం మధ్య రాత్రి 8 గంటలకు పోలీసులు పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలు పెట్టి దళం జాడ చెప్పమని అడవిలో తిప్పారు. దళం ఉన్నచోటు తెల్సినప్పటికీ శత్రువుకు ఏమాత్రమూ తలవంచలేదు కామ్రేడ్ రంగన్న. అతని దృఢ చిత్తం ముందు ఓడిపోయిన శత్రువు డిసెంబర్ 12న కాల్చి చంపి ఎన్‌కౌంటర్ కట్టుకథ చెప్పారు.

నమ్మిన విప్లవ మార్గంలో చివరి వరకూ పట్టుదలగా పట్టుదలగా పోరాడి నిలిచిన కామ్రేడ్ రంగన్న జీవితం ఆదర్శ పూరితమైనది. ఆయనలోని బోల్షివిక్ స్పిరిట్, దృఢ విశ్వాసం, విప్లవ క్రమశిక్షణ, పార్టీ రహస్యాలను కాపాడే దృఢత్వం అందరికీ ఆదర్శనీయం. కామ్రేడ్ రంగన్న ఆశయ సాధనలో ముందుకు నడుద్దాం. ఆయన కన్న కలల్ని నిజం చేద్దాం.

## కామ్రేడ్ దిర్ధ రామాల్ (రాంబాబు)

ఖమ్మం జిల్లా శబరి ఏరియా కమిటీ పరిధిలో తిరుగుతున్న జన మిలీషియా దళం ప్రజా శత్రువులను శిక్షిస్తూ, యువకులను మిలీషియాలోకి సమీకరించుతూ గ్రామాలలో తిరుగుతున్న క్రమంలో కూనవరం మండలం కామన్‌తోగు గ్రామానికి చేరుకుంది. కామన్‌తోగు గ్రామంలో యువకులతో సమావేశం అనంతరం దళం అక్కడే రాత్రి నిద్రించింది. సమాచారం అందుకున్న గ్రేహౌండ్స్ బలగాలు తెల్లవారుజామున నిద్రిస్తున్న జనమిలీషియా దళంపై దాడి చేశాయి. ఆ చీకట్లో దళమంతా తప్పుకున్నప్పటికీ నిద్రమబ్బులో వున్న సెక్షన్ కమాండర్ కామ్రేడ్ రాంబాబు శత్రువు చేత చిక్కాడు. గ్రేహౌండ్స్ బలగాలు పట్టుకొని తీవ్రమైన చిత్రహింసలకు గురిచేసి, 2009 సెప్టెంబర్ 15 ఉదయాన ఈ కామ్రేడ్‌ను కాల్చిచంపారు.

కామ్రేడ్ రాంబాబుకు తల్లిదండ్రులు పెట్టుకున్న పేరు రామాల్. ఖమ్మం జిల్లా చింతూరు మండలం బందేరు గుంపు గ్రామంలో నివసించేవాడు. చిన్నప్పుడే అమ్మానాన్నలు చనిపోవడంతో తన అన్న పెంచి పెద్ద చేశాడు. పేద ఆదివాసీ కుటుంబంలో పుట్టిన కారణంగా రాంబాబు చదువుకోలేకపోయాడు. కూలీ పనులు చేసుకుంటూ తన అన్నతో కలిసి జీవించేవాడు. ఇరవై సంవత్సరాల యువకుడైన కామ్రేడ్ రాంబాబు 2005లో భద్రాచలం దళానికి పరిచయమైనాడు. గ్రామ సంఘంలో చేరి చురుకుగా పని చేశాడు. ఈ క్రమంలోనే తనపై శత్రువు నిర్బంధం పెరగడంతో పార్టీ పిలుపును అందుకొని 2006 జూలైలో దళంలోకి భర్తీ అయినాడు.

దళంలో మంచి క్రమశిక్షణతో వుంటూ సమిష్టి పనులలో ముందు వుండేవాడు. చదువు నేర్చుకున్నాడు. అతను దళంలో చేరిన కొద్ది రోజులకే దంతెవాడ–ఖమ్మం సరిహద్దు గ్రామాలలో శత్రువు నిర్బంధం బాగా పెరిగింది. దళ కమాండర్ శత్రువు ముందు మోకరిల్లినప్పటికీ తనతో పని చేసిన దళ సభ్యులు వెళ్లిపోయినప్పటికి తను మాత్రం దృఢంగా నిలబడ్డాడు. మంచి పట్టుదలతో పార్టీలో పని చేశాడు. జిల్లా కమిటీ ఆదేశాలతో కుక్కునూర్ దళంలో కూడా కొద్ది మాసాలు పని చేశాడు. తాను పనిచేస్తున్న ప్రాంతాలలో టెర్రయిన్‌పై మంచి పట్టుసాధించేవాడు.

కంబాల, జగ్గారంలలో గ్రేహౌండ్స్ బలగాలతో జరిగిన ఎన్‌కౌంటర్లలో పాల్గొన్నాడు. ఎస్.ఐ.బి.తో సంబంధాలు పెట్టుకొని పని చేస్తున్న జగ్గారం, బందేరు గుంపు గ్రామాలలోని ఇన్‌ఫార్మర్స్‌ను ఇంటరాగేషన్ చేసి శిక్షించడంలో క్రియాశీలకంగా పాల్గొన్నాడు.

తాను తగినంతగా ఎదగడంలేదని కా. రాంబాబు, జన మిలీషియా దళంలోకి వెళ్ళి, సెక్షన్ కమాండర్‌గా పని చేస్తూ జన మిలీషియా కమాండర్‌కు చేదోడు వాదోడుగా సహకరిస్తూ, ఏరియాలో చురుగ్గా మిలీషియా కార్యక్రమాలను నిర్వహించడంలో ముందున్నాడు. పార్టీ ఇచ్చే నిరసన కార్యక్రమాలను, బంద్‌లను విజయవంతం చేయడంలో, మిలీషియా కార్యక్రమాలతో శత్రువును ముప్పుతిప్పలు పెట్టడంలో కామ్రేడ్ రాంబాబు పాత్ర చెప్పుకోతగ్గది.

మృదు స్వభావం గల కా. రాంబాబు రెండు సంవత్సరాలు పార్టీలో మంచి క్రమశిక్షణతో, పట్టుదలతో పీడిత ప్రజల విముక్తి కోసం పోరాట మార్గంలో ప్రయాణించాడు. ఇరవై సంవత్సరాల పిన్న వయసులోనే కామ్రేడ్ రాంబాబు తన నులివెచ్చని రక్తాన్ని జన విముక్తి కోసం ధారబోసాడు. కామ్రేడ్ రాంబాబు అమర్ రహే!

★

"అమరుల జ్ఞాపకాలు జ్ఞానంగా మనకు దారి చూపుతాయి.
అమరుల ఆశయ సాధనే నిజమైన నివాళి"

# పోరాటాలు - సభలు - ప్రతిఘటన

## ఖమ్మం జిల్లా

### నిర్బంధాన్ని ప్రతిఘటిస్తోన్న మహిళలు

శబరి ఏరియా పరిధిలో సెప్టెంబర్ నుండి అక్టోబర్ వరకు పోలీసులు గ్రామాలపై దాడులు కొనసాగిస్తూ సంఘ నాయకత్వాన్నీ, సానుభూతిపరులను దఫ దఫాలుగా అరెస్టులు చేశారు. ఈ నిర్బంధాన్ని ప్రతిఘటించడంలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు చురుకైన పాత్ర వహిస్తున్నారు.

చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి పంచాయితీ పేగా గ్రామానికి చెందిన అయిదుగురు సంఘ నాయకులను అరెస్టుచేసి చిత్రహింసలకు గురిచేసి స్టేషన్‌లో పెట్టారు. ఈ విషయం తెలిసిన గ్రామస్తులు 40 మంది స్టేషనుకు వెళ్లి వాళ్లను విడిచిపెట్టాలని డిమాండ్ చేసి రెండు రోజులు స్టేషన్ ముందే బైఠాయించారు. దాంతో ఎస్.ఐ. అరెస్టు చేసిన వాళ్లను రెండు రోజులకు విడిచిపెడతామని హామీ ఇవ్వడంతో ప్రజలు శాంతించారు. రెండు రోజుల తర్వాత వారిని వదిలేశారు. ఈ పోరాటంలో మహిళలు చురుకైన పాత్ర వహించారు.

వంకగూడెం అనే గ్రామంలో ఆరుగురు సంఘ సభ్యులనూ, పుగుట్టలో బండి, ఇడుమాల్ అనే యిద్దరు సంఘ నాయకులను పోలీసులు పట్టుకొని తీసుకొని వెళ్తుండగా, గ్రామ మహిళలు పోలీసుల వెనుక వెనుకే వెళ్లి గొడవ పడి ఆరుగురిని విడిపించుకున్నారు. బండి, ఇడుమాల్‌లను మాత్రం వదల్లేదు. దాంతో మహిళలంతా పోలీసు స్టేషన్‌కు వెళ్లి గొడవ చేశారు. పట్టుకున్న వారిని అడవిలోనే వుంచి ఒక రోజు  తర్వాత పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి చిత్రహింసలు పెట్టారు. మా వాళ్లను చూపించాలని మహిళలు గొడవ చేయడంతో ఎస్.ఐ. రేపు చూపిస్తామని చెప్పి అందర్నీ ఇంటికి పంపించాడు. ఆ తర్వాత బండిని  అడవికి తీస్కెళ్లి 'ఎన్‌కౌంటర్' చేస్తామని బెదిరించి సంఘ సభ్యుల పేర్లు చెప్పమని అడిగారు. అయితే బండి ఎలాగోలా పోలీసుల చేతి నుండి తప్పించుకొని ఇంటికి చేరాడు. తరువాతి రోజు మహిళలు మళ్లీ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఇడుమాల్‌ను విడిపించుకున్నారు.

అలాగే కూనవరం మండలం నర్సింహులపేట గ్రామంలో తొమ్మిది మందిని అరెస్టు చేశారు. ప్రజలు స్టేషన్‌కు వెళ్లి విడిపించుకోవడానికి ప్రయత్నం చేసినా సాధ్యం కాలేదు. వాళ్లపై బైండోవర్ కేసులు పెట్టారు. మొత్తంగా ఈ మూడు గ్రామాలలో 35 మందిని అరెస్టు చేశారు. ఇలా పోలీసులు గ్రామాలపై దాడులుచేస్తూ ప్రజలనూ, సంఘ సభ్యులను, సానుభూతిపరులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. అయినప్పటికీ ప్రజలు వెరవకుండా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమ వాళ్లను విడిపించుకుంటున్నారు. ఇందులో మహిళలే ముఖ్యపాత్ర వహిస్తున్నారు.

వెంకటాపూర్ ఏరియా డీకే గ్రామమైన కొత్తపల్లి గ్రామంపై 2009 అక్టోబర్ 25న ఎ.పి. పోలీసులు సంఘ నాయకుల ఇండ్లపై దాడిచేసి ఆరుగురిని తెసుకెళ్తుండగా అందులోంచి ముగ్గురు పారిపోయి వచ్చారు. మిగిలిన ముగ్గురిలో కుమ్మరి జగన్, ఆగబోయిన నారాయణ, మడకం చుక్కయ్యలు వున్నారు. వీళ్లను అడవికి తీసుకెళ్లి ఆలీవ్‌గ్రీన్ బట్టలు ధరింప చేసి కాల్చిచంపడానికి సన్నాహాలు చేశారు. ఈ విషయం తెలిసిన గ్రామ మహిళలు 30 మంది కలిసి అడవిలోకి వెళ్లి, ఎ.పి. పోలీసులు ఛత్తీస్‌గఢ్‌కు ఎందుకు వచ్చారని నిలదీశారు. మావాళ్ల తప్పు వుంటే గ్రామంలోనైనా విచారించాలి. పోలీస్ స్టేషన్‌కైనా తీసుకెళ్లాలిగానీ ఈ అడవిలోకి ఎందుకు తెచ్చారని గట్టిగా ప్రశ్నించారు. అయినా గానీ పోలీసులు వాళ్లను విడిచిపెట్టలేదు. దాంతో ప్రజలు ఎ.పి. మీడియాను పిలిపించి పోలీసులు పట్టుకెళ్లిన వాళ్లను విడిచిపెట్టాలని ఇంటర్వ్యూ ఇచ్చారు. పోలీసులు వాళ్లను కాల్చి చంపకముందే నిమ్మలగూడెంలో ఎన్‌కౌంటర్ జరిగిందని పత్రికలకు పంపారు. కానీ ప్రజల పోరాటం ఫలితంగా పట్టుకెళ్లిన వాళ్లలో ఒకరిని జైల్లో పెట్టగా మరో ఇద్దరిని వదిలేశారు.

చర్ల మండలంలో చెన్నాపురం గ్రామంపై 2009 నవంబర్ 14న పోలీసులు తెల్లవారుజామున దాడిచేసి జన మిలీషియా కమాండర్‌నూ, మరో నలుగురిని అరెస్టుచేసి తీసుకెళ్తుండగా, గ్రామ మహిళలు 30 మంది కలిసి పోలీసులను వెంబడించారు. మావాళ్లు ఏ తప్పు చేయలేదు ఎందుకు తీసుకెళ్తున్నారని ప్రశ్నించారు. అయినా పోలీసులు వినకుండా అరెస్టు చేసిన వాళ్లను అడవిలోకి తీసుకపోతుండగా మహిళలు పోలీసులపైకి రాళ్లతో, కర్రలతో ప్రతిఘటనకు దిగారు. దాంతో పోలీసులు పట్టుకున్నవాళ్లను విడిచిపెట్టి పరుగులు తీశారు. ఈ ప్రతిఘటన చుట్టుపక్కల గ్రామాలలో మంచి ప్రభావాన్ని వేసింది.

### ప్రజలను కాల్చి చంపిన పోలీసులు

వెంకటాపురం ఏరియా పరిధిలోని ఊసూరు బ్లాక్ పూజారి కాంకేర్ గ్రామంపై 2009 అక్టోబర్ 25న రెండు వందల మంది ఎస్.పి.ఒ.లు, ఛత్తీస్‌గఢ్ పోలీసులు కలిసి దాడి చేశారు. ఈ దాడిలో

గంగి అనే మహిళను అత్యాచారం చేసి క్రూరంగా కాల్చిచంపారు. ఈమెతోపాటు ఇదే గ్రామానికి చెందిన ముసాకి చుక్కాను మరొక యువకుడిని కాల్చిచంపారు. ఇండ్లలో దొరికిన వంట సామాగ్రినీ, ఆహార పదార్థాలను చెల్లాచెదురు చేశారు. కోళ్లను పట్టుకొని తిని, కొన్నింటిని పట్టుకెళ్లారు.

పూజారి కాంకేర్ ఆర్.పి.సి. పరిధిలో ప్రజలంతా గంగికి దహన సంస్కారం చేసి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సభలో ఆర్.పి.సి. అధ్యక్షుడు పోలీసు నిర్బంధాన్ని ప్రజలు ఐక్యంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చాడు.

## ప్రచారం

వెంకటాపురం ఏరియాలో 'గ్రీన్‌హంట్'కు వ్యతిరేకంగా మండల కేంద్రాల్లోనూ, 20 గ్రామాలలోనూ పోస్టరు, బ్యానర్లు, పత్రికా ప్రకటనల ద్వారా ప్రచారం జరిగింది.

ఇదే ప్రాంతంలో ప్రజలు కరువు దాడులకు సిద్ధం కావాలనీ, రోడ్లతో అభివృద్ధి జరగదనీ, ఆదివాసీల మౌలిక సమస్యలు పరిష్కరించకుండా అభివృద్ధి సాధ్యం కాదనీ అంటూ పోస్టర్లు, పత్రికా ప్రకటనల ద్వారా విస్తృతంగా ప్రజల్లో ప్రచారం జరిగింది.

పి.ఎల్.జి.ఎ. 9వ వార్షికోత్సవ సందర్భంగా శత్రువు ఆంబుష్‌లు, ప్యాట్రోలింగ్‌ల మధ్యనే వెంకటాపూర్, చర్ల, దుమ్ముగూడెం మండల కేంద్రాలలో, గ్రామాలలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దాడిని తిప్పికొట్టాలనీ, పి.ఎల్.జి.ఎ.లో యువతీ యువకులు భర్తీ కావాలని బ్యానర్లు, పోస్టర్ల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.

ఏరియాలోని ఒక ఆర్.పి.సి. పరిధిలో పి.ఎల్.జి.ఎ. సభను నిర్వహించగా ఆ సభకు 250 మంది ప్రజలు హాజరయ్యారు. ఆర్.పి.సి. అధ్యక్షుడు, మిలీషియా కమాండర్, ఏసీఎంలు సభలో మాట్లాడారు. సాంప్రదాయక నృత్యాలతో, పాటలతో సభ ఉత్తేజకరంగా కొనసాగింది. ఈ సభను విజయవంతం చేయడానికి మిలీషియా రక్షణ బాధ్యతలు చేపట్టింది.

ఇదే సందర్భంగా వాజేడు మండలంలోనూ రెండు చోట్ల చిన్న సభలు జరిగాయి.

# శ్రీకాకుళం-కోరాపుట్ డివిజన్

## నర్సరీల ధ్వంసం

నారాయణపట్నం బ్లాక్‌లోని వివిధ పంచాయితీలలో ఐ.టి.డి.ఎ., ఫారెస్టు విభాగం. ఆధ్వర్యంలో ప్రభుత్వం నర్సరీల ద్వారా మొక్కలు పెంచి ప్రజలు సాగుచేసుకుంటున్న కొండల్లో నాటించి ప్రజల జీవనాధారమైన కొండపోడును బలవంతంగా బంద్ చేయిస్తున్నారు. ఫారెస్ట్ వాళ్లతో తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు నర్సరీలను ధ్వంసం చేయాలనే డిమాండ్‌ను పార్టీ ముందుకు తీసుకువచ్చారు. పాలూరు ఆంబుష్‌కు ముందు మిలీషియాకు కార్యక్రమం ఇవ్వటంతో వందల మంది ప్రజలను కదిలించి 2009 జూన్ 15వ తేదీన ఒకేరోజు రాత్రి కత్తులు, గొడ్డళ్ళు, వింటిబద్దలతో ఒడియాపేట, పగ్గం, మొండగూడ నర్సరీలను ధ్వంసం చేశారు. చెట్లను నరికి రోడ్లకు అడ్డంగా వేశారు. ఈ ప్రభావంతో చుట్టుపక్కల మరికొన్ని గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా మరుసటిరోజు మరికొన్నిచోట్ల నర్సరీలను ధ్వంసం చేశారు.

## విజయవంతమైన భారత్ బంద్

కేంద్ర కమిటీ సభ్యుడు కా. పటేల్ సుధాకర్ రెడ్డి (సూర్యం), డీవీసీ సభ్యుడు కా. వెంకటయ్య (ప్రసన్న)ల బూటకపు ఎన్‌కౌంటర్లకు నిరసనగా పార్టీ జూన్ 21, 22లలో భారత్ బంద్‌కు పిలుపునిచ్చింది. ఈ పిలుపు విజయవంతం చేయడంలో భాగంగా కోరాపుట్ జిల్లా నారాయణపట్నం, బందుగాం బ్లాక్‌లలో బంద్ సంపూర్ణంగా జరిగింది. నారాయణపట్నం-బందుగాం, బందుగాం-పార్వతీపురం, బందుగాం-రాయగఢ దారుల్లో రోడ్లకు అడ్డంగా చెట్లు నరికివేసి, బ్యానర్లు కట్టడంతో విస్తృతంగా ప్రచారం జరిగి బంద్ విజయవంతమైంది.

## ప్రభుత్వ, ప్రయివేట్ ఆస్తుల ధ్వంసం

కామ్రేడ్స్ పటేల్ సుధాకర్ రెడ్డి, వెంకటయ్యల బూటకపు ఎన్‌కౌంటర్‌ను ఖండిస్తూ చేపట్టిన నిరసన చర్యల్లో 2009 జూన్ 24న కోరాపుట్ జిల్లా కక్కిరిగుమ్మ బ్లాక్ సెంటర్‌లో మూడు సెల్‌పోన్ టవర్లనూ, రైల్వే కమ్యూనికేషన్ వ్యవస్థను గెరిల్లాలు ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో 15 మంది పి.ఎల్.జి.ఎ. ప్రధాన, ద్వితీయ బలగాలతో పాటు 40 మంది మిలీషియా పాల్గొన్నారు.

ఇదే రోజున నారాయణపట్నం బ్లాక్ సెంటర్‌లో బ్లాక్ ఆఫీసుపై కరువు దాడి జరిగింది. ఇందులో 30 మంది పి.ఎల్.జి.ఎ. బలగాలతోపాటు 600 మంది ప్రజలు పాల్గొన్నారు. ఇందులో 100 మంది మహిళలు వున్నారు. సి.ఆర్.పి.ఎఫ్. బలగాలున్న పోలీస్ క్యాంప్‌కు కొద్ది దూరంలోనే ఈ దాడి జరిగింది. పి.ఎల్.జి.ఎ. బలగాల అండతో ప్రజలు చాలా ధైర్యంగా, చురుగ్గా, ఉత్సాహంగా పాల్గొని 70 సైకిళ్లను, పప్పు, వంటపాత్రలు తదితర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నారు.

కేంద్ర హోంమంత్రి చిదంబరం పర్యటనకు రావటానికి ముందురోజే ఈ సంఘటనలు జరగటంతో దామన్‌జోడి, నాల్కో పర్యటనను రద్దు చేసుకుని కోరాపుట్‌కు మాత్రం వచ్చి తిరిగి వెళ్లిపోయాడు. ఈ కార్యక్రమాలు విస్తృతంగా ప్రచారం జరిగి రాజకీయంగా మంచి ప్రభావం వేశాయి.

## ఎస్.పి.ఒ.లకు దేహశుద్ధి

కోరాపుట్ జిల్లా నారాయణపట్నం బ్లాక్‌లో బొరిగి, నాగులబెద్ద పంచాయితీలలోని ఎగువలోచ్చ గ్రామానికి చెందిన చంద్రా, నాచిక బొరిగి గ్రామానికి చెందిన రాజయ్య, మండంగి బేసు, మండంగి సుబ్బ(మహిళ)లు 'బికాస్' సంస్థలో పనిచేస్తూ ప్రజలను మోసం చేస్తూ ఆ సంస్థ ద్వారా వచ్చే బియ్యం, డబ్బులను తినేస్తున్నారు. ఎస్.పి.ఒ.లుగా శిక్షణ పొంది రహస్యంగా పని చేస్తున్న దళం వీళ్ల పద్ధతులను మార్చుకోవాలనీ, ఉద్యోగాలు వదిలిపెట్టాలని పలుమార్లు హెచ్చరించినా వినకపోవడంతో చుట్టుపక్కల ఏడు గ్రామాల ప్రజల ముందు పెట్టి దేహశుద్ధి చేసి వదిలివేయడం జరిగింది. ఇది ఏరియాలో మంచి ప్రభావం వేసింది.

## ఇన్‌ఫార్మర్లు ఖతం

బందుగాం బ్లాక్ అలమండకు చెందిన కాంతారావు, కత్తులపేట గ్రామానికి చెందిన బోగి రమేష్‌లు 2008 మే, అక్టోబర్‌లలో జరిగిన ఎన్‌కౌంటర్లకు కారకులు. వీళ్లు ఎ.పి. పోలీసులతో కుమ్మక్కయి పార్టీ సభ్యులను అరెస్టు చేయించారు. దళం వీళ్లను గతం నుండీ హెచ్చరిస్తున్నా వినకపోవడంతో 2009 జనవరిలో వీరిని ఖతం చేసింది.

అదే బ్లాక్‌లో కౌరుబడి పంచాయితీ కొండటిక్కరపాడు గ్రామానికి చెందిన పీడిక మోహన్ గత సంవత్సర కాలం నుండి హోంగార్డుగా పనిచేస్తూ ఒడిషా, ఎ.పి. పోలీసులకు దళం సమాచారాన్ని ఇచ్చేవాడు. పెద్ద ఇటికి, కొండబొరిగి గ్రామాలపై దాడులు చేయించి ప్రజలను అరెస్టు చేయించాడు. ప్రజలను తిట్టడం, కొట్టడం చేసేవాడు. అలాగే చుట్టుపక్కల గ్రామాలలో ఇన్‌ఫార్మర్లను తయారు చేసాడు. పలుమార్లు దళం వున్న డెన్‌కు పోలీసులను తీసుకొచ్చి దాడి చేయడానికి ప్రయత్నించాడు. కానీ అప్పటికే దళం అక్కడి నుండి పోవడంతో తృటిలో ప్రమాదం తప్పిపోయింది. మోహన్‌ను ప్రజలముందు పెట్టడంతో ఇతన్ని చంపడమే మంచిదన్నారు. దాంతో ఇతన్ని పి.ఎల్.జి.ఎ. ఖతం చేయడంతో పీడ విరగడైందని ప్రజలు సంతోషించారు.

బొరిగి పంచాయితీ కంబివలస గ్రామానికి చెందిన శిబో అనే అతను బికాస్ సంస్థలో పనిచేస్తూ ఎస్.పి.ఒ. శిక్షణకు వెళ్లి రిక్రూటయి వచ్చాడు. ఇతను ఒడిషా, ఎ.పి. పోలీసుల సంబంధాల్లో వుండేవాడు. చుట్టుపక్కల గ్రామాల యువకులను డబ్బు ఆశచూపి ఇన్‌ఫార్మర్లుగా తయారుచేశాడు. ప్రజలను బెదిరిస్తూ తిరిగేవాడు. దాంతో దళం 2009 మే నెలలో ఇతన్ని ప్రజల ముందు విచారించి ఖతం చేసింది. ఈ చర్యలో మిలిషియా కూడా పాల్గొంది.

నారాయణపట్నం పంచాయితీ పశ్చింగి గ్రామస్థుడైన మండంగి కుంజా ఆదివాసీ కువ్వి తెగ పెత్తందారు. కాంట్రాక్టరుగా, పోలీస్ ఇన్‌ఫార్మర్‌గా పని చేసేవాడు. గ్రామస్తుల భూములను దౌర్జన్యంగా గుంజుకునేవాడు. ప్రశ్నించిన వారిని కొట్టి వూళ్లో నుండి తరిమివేసేవాడు. మహిళలపై అత్యాచారాలు చేసేవాడు. ప్రభుత్వం ఏర్పాటుచేసిన శాంతి సంఘంలో పనిచేస్తూ విర్రవీగేవాడు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలందరికీ దుర్మార్గుడిగా, ప్రజావ్యతిరేకిగా మారాడు. దాంతో 2009 మే నెలలో దళం ఇతన్ని ప్రజాకోర్టులో పెట్టింది. విచారణ అనంతరం మిలీషియా ఇతన్ని హతమార్చింది. ★

---

*(...26వ పేజీ తరువాయి)*

రంగస్థలం నిర్మించుకుంటాడు. అయితే ఆ రంగ స్థలంపైననే శబ్దం, రంగూ, శక్తి, వైభవాలతో కూడిన ఎన్నో నాటకాలను రక్తి కట్టించ గలుగుతాడు. కనుక ప్రస్తుతమున్న నిర్దిష్టమైన భౌతిక పునాదులపై ఆధారపడి అంటే మిలిటరీ, రాజకీయ, ఆర్థిక, సహజ పరిస్థితులపై ఆధారపడి ఎర్రసైన్యం కమాండర్లు తమ శక్తి సామర్థ్యాలన్నింటినీ ప్రదర్శించాలి. తమ శక్తులన్నింటినీ కూడగట్టుకొని జాతీయ శత్రువులను, వర్గ శత్రువులను అణచివేయాలి. దుష్ట ప్రపంచాన్ని మార్చాలి. యుద్ధం నడపడంలో మన స్వీయాత్మక శక్తిని ప్రదర్శించవలసింది ఇక్కడే. మన ఎర్రసైన్యం కమాండర్లలో ఎవరూ కూడా తప్పులు చేసే తలబిరుసుదనం ప్రదర్శించడానికి మనం అంగీకరించం. ప్రతి ఎర్రసైన్యం కమాండర్ ఒక వీరుడుగా తయారు కావాలని ఖచ్చితంగా ఆశిస్తాం. అతడు ధైర్యవంతుడు గానూ, వివేకవంతుడుగానూ వుండాలి. అతడు ఎదురులేని సాహసం, యుద్ధంలోని అన్ని దశలలోనూ, మార్పులలోను కూడా పరిస్థితులను తన చేతిలో ఉంచుకోగల శక్తిగలవాడుగా వుండాలి. అంతేకాకుండా, యుద్ధం అనే సముద్రంలో ఈదుతూ మధ్యలో మునిగిపోకుండా నిర్ణీతమైన బారలు వేసుకుంటూ అవతలి ఒడ్డుకు తప్పకుండా చేరుకోగలగాలి. యుద్ధాన్ని నడిపించే సూత్రాలు, యుద్ధం అనే సముద్రంలో ఈత లాంటి కళ. మన పద్ధతులను గురించి ఇక ముగిస్తాను. ★

# వందేళ్ల అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినపు వారసత్వాన్ని సమున్నతంగా ఎత్తిపడుదాం!

## స్త్రీ విముక్తి బాటలోన సాహసంగా సాగిపోదాం!!

న్యూయార్క్‌లోని బట్టలు కుట్టే మహిళా కార్మికులు పని పరిస్థితులను మెరుగు పర్చాలనీ, పని గంటలను తగ్గించాలనీ, మహిళలకు సమాన హక్కులనూ, ఓటు హక్కును కల్పించాలనీ, స్వెట్ షాపు ( అత్యంత ఘోరమైన పని పరిస్థితులలో అతి తక్కువ వేతనానికి పని చేసే చోటు)లనూ, బాల కార్మిక వ్యవస్థను అంతం చేయాలనీ డిమాండ్ చేస్తూ 1908 మార్చి 8న చారిత్రాత్మక పోరాటం చేశారు. ఈ పోరాటంతో ఉత్తేజితురాలైన అంతర్జాతీయ కమ్యూనిస్టు నేత కామ్రేడ్ క్లారా జెట్కిన్ ఈ పోరాట స్ఫూర్తిని తరతరాలకూ అందించాలనే వుద్దేశ్యంతో 1910లో కోపెన్ హేగెన్‌లో జరిగిన సోషలిస్ట్ మహిళల రెండవ అంతర్జాతీయ మహిళా సభలో, మార్చి 8ని అంతర్జాతీయ మహిళా దినంగా గుర్తించాలని ప్రతిపాదించగా ఆ మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

అలా 'మార్చి 8' అంతర్జాతీయ మహిళా దినంగా గుర్తింపును పొంది ఈ సంవత్సరానికి వందేళ్లు నిండాయి. ఈ వందేళ్లుగా మార్చి 8 అంతర్జాతీయంగా శ్రామిక మహిళలకు ఒక పోరాట పిలుపుగా, నిరంతరం స్ఫూర్తినిస్తూనే వుంది. వారి ఐక్యతను మరింతగా బలోపేతం చేస్తూనే వుంది. వారిని పోరాటాల్లోకి నడిపిస్తూనే వుంది. అలా మార్చి 8, పెట్టుబడిదారులనూ, సామ్రాజ్యవాదులనూ, మొత్తంగా సమస్త దోపిడీ పాలక వర్గాలను కూల్చే ఒక ఆయుధమైంది. అందుకే అది దోపిడీ పాలకవర్గాలకు కంటగింపయింది. అయితే ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మహిళలు, మహిళలే కాదు శ్రామిక వర్గ పురుషులు సైతం సొంతం చేసుకున్న ఈ పోరాట దినాన్ని బహిరంగంగా వ్యతిరేకించే సాహసం లేని పాలక వర్గాలు ఆ పోరాట దినపు స్ఫూర్తిని దెబ్బతీయాలనే కుట్రను పన్నాయి. అందుకే పాలకవర్గాలూ, బహుళ జాతి సంస్థలూ కూడా మార్చి 8ని ఒక జాతరగా జరుపుతున్నాయి. మహిళలను పితృస్వామ్య నమూనాలో బంధించే విధంగా ఈ రోజున ఫ్యాషన్ పేరేడ్‌లూ, అందాల పోటీలూ, వంటల ముగ్గుల పోటీలు పెడ్తూ మహిళలను కించ పరుస్తున్నాయి. వారి చైతన్యాన్ని మొద్దు బార్చే, పక్కదార్లు పట్టించే ప్రయత్నం చేస్తున్నాయి.

అయితే మార్చి 8కి నిజమైన వారసులైన శ్రామికవర్గ పుత్రికలు, పాలకవర్గాల కుట్రలను భగ్నం చేస్తూ, ఆ పోరు కేతనాన్ని తమ భుజానెత్తుకొని విశ్వవ్యాప్తంగా కవాతు చేస్తూనే వున్నారు.

ఈ పోరాట వారసత్వాన్ని స్వీకరించిన సి.పి.ఐ. (మావోయిస్ట్), దాని ప్రజా సంఘాలు ప్రతి సంవత్సరం మార్చి8న సభలూ, సమావేశాలూ, ప్రదర్శనలూ జరుపుతూ అంతర్జాతీయ శ్రామిక మహిళల పోరాట స్ఫూర్తిని వ్యాపింప చేస్తూ వున్నాయి. ఈ పోరాట పిలుపుకు వందేళ్లు నిండిన సందర్భంగా ఈ సంవత్సరం మార్చి8 నుండి 14 వరకూ అంతర్జాతీయ శ్రామికా మహిళా వారాన్ని స్ఫూర్తిదాయకంగా జరుపుకోవాలని సి.పి.ఐ. (మావోయిస్ట్) కేంద్ర కమిటీ కార్యదర్శి కామ్రేడ్ గణపతి పిలుపునిచ్చాడు.

నేడు ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారీ విధానం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నది. దీన్నుంచి బయట పడ్డానికి అది సంక్షోభ భారాన్ని పీడిత ప్రజల మీదికి నెట్టేస్తూ వారి జీవితాలను మరింత దుర్భరం చేస్తున్నది. ముఖ్యంగా పీడిత మహిళల జీవన స్థితిగతులు ఈ సంక్షోభంలో మరింత ఘోరంగా దిగజారుతున్నాయి. ఫలితంగా పీడిత ప్రజలు మరింతగా సంఘటిత పోరులో కదులుతున్నారు. ఈ పోరాటాలను అణచివేయడానికి ప్రపంచవ్యాప్తంగా పాలకవర్గాలు ఫాసిస్ట్ అణచివేతను ప్రయోగిస్తున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు పీడిత దేశాల్లో యుద్ధాలను నడుపుతున్నాయి.

నేడు మన దేశంలో కూడా సామ్రాజ్యవాద అండదండలతో పీడిత ప్రజలపై యుద్ధం కొనసాగుతోంది. ఇందులో భాగంగా కొనసాగుతున్న 'గ్రీన్‌హంట్'లో మహిళలపై హింస విపరీత స్థాయిలో జరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో వందేళ్ల మార్చి 8 స్ఫూర్తి వేడుకలను జరుపుకుంటున్న శ్రామిక ప్రజలకు, ముఖ్యంగా మహిళలకు సి.పి.ఐ. (మావోయిస్ట్) నాయకత్వంలో దోపిడీ వర్గాలను కూల్చే సాయుధపోరులో మరింతగా చేరమని పిలుపునిద్దాం.

వందేళ్ల అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినం వర్ధిల్లాలి!